
సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50 సంపుటి: 15 సంచిక: 299



'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి. పాడిపంటలతో పులకించిపోవాలి'

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



మోదీయే బాధ్యుడు

గుజరాత్ మత ఘర్షణలకు అప్పట్లో సీఎంగా ఉన్న మోదీయే బాధ్యుడని బీబీసీ ప్రసారం చేసిన డాక్యుమెంటరీ ప్రకంపనలు సృష్టిస్తోంది.

- వివరాలు 6లో▶



ఇక చాలు...

న్యూజిలాండ్ ప్రధాని జసిండా రాజీనామా చేశారు. ప్రధానిగా ఫిబ్రవరి 7 ఆఖరి రోజని కన్నీటి పర్యంతమవుతూ ప్రకటించారు.

- వివరాలు 6లో▶

అగ్నికీలల్లో సికింద్రాబాద్ మినిస్టర్స్ రోడ్డులోని రాధా ఆర్కేడ్ భవనం..







రోజంతా మంటలు

40 ఫైరింజన్లు..

200 పైగా నీటి ట్యాంకర్లతో 'ఫైర్ ఫైటింగ్'

సికింద్రాబాద్ మినిస్టర్స్ రోడ్‌లోని రాధా ఆర్కేడ్ భవనంలో భారీ అగ్నిప్రమాదం

- మంటల్లో చిక్కుకున్న నలుగురిని కాపాడిన అగ్నిమాపక, పోలీసు సిబ్బంది
- వద్దన్నా వినకుండా భవనంలోకి వెళ్లిన ముగ్గురు గల్లంతు..
- వారిని కాపాడేందుకు వెళ్లిన రెస్క్యూ సిబ్బందికీ అస్వస్థత... నేడు మళ్లీ గాలింపు

2 లో

రూ.16,000 కోట్లు!

హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ పెట్టుబడి

- భారీ విస్తరణ ప్రణాళికను ప్రకటించిన ఐటీ దిగ్గజం
- దావోస్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో వెల్లడి

- వివరాలు 10లో▶



మైక్రోసాఫ్ట్ ఆసియా హెడ్ అహ్మద్ మజారీతో కేటీఆర్

తెలంగాణలో డబ్ల్యూహెచ్ఓ టీకా కేంద్రం - 10లో

కంటి'వెలుగు' షురూ

రాష్ట్రవ్యాప్తంగా రెండో విడత కార్యక్రమం ప్రారంభం

- హైదరాబాద్‌లో కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి హరీశ్‌రావు
- తొలిరోజు 1.60 లక్షల మందికి కంటి పరీక్షలు

- వివరాలు 3లో▶



ప్రొటోకాల్‌పై సీఎం జవాబివ్వాలి

- ఆ తర్వాతే పెండింగ్ బిల్లులు, ఇతర అంశాలపై బదులిస్తా: గవర్నర్ తమిళిసై
- గణతంత్ర దిన వేడుకలపై నాకు సమాచారం లేదు
- అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు కూడా వస్తున్నాయి... రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తుందో అంతా చూస్తారని వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: భారత గణతంత్ర దినోత్సవానికి మరో వారమే ఉన్నా.. వేడుకల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి తనకు ఇప్పటివరకు ఎలాంటి సమాచారం అందలేదని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చెప్పారు. దీనితోపాటు రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు కూడా వస్తున్నాయని.. రాష్ట్ర ప్రభుత్వం ఏం చేయబోతుందో అంతా చూస్తారని పేర్కొన్నారు. ప్రధాని మోదీ రాసిన 'ఎగ్జామ్ వారియర్స్' పుస్తకాన్ని గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్ ఆవిష్కరించారు. తర్వాత మీడియాతో మాట్లాడారు. ఖమ్మం సభలో గవర్నర్ల వ్యవస్థపై సీఎంలు, పలు పార్టీల ముఖ్యనేతలు చేసిన ఆరోపణలపై ఆమె స్పందించారు. గవర్నర్లను అవహేళన చేస్తూ సీఎంలు, ఇతర రాజకీయ నేతలు మాట్లాడటం సరికాదని గవర్నర్ తమిళిసై పేర్కొన్నారు. రాజ్యాంగ బద్ధమైన గవర్నర్ పదవికి కనీస గౌరవం ఇవ్వాలని సూచించారు. గవర్నర్లు

మిగతా 3వ పేజీలో ▶

ఇదండీ సంగతి



వైద్య విద్యార్థుల గోస

టీఆర్ఆర్ మెడికల్ కాలేజీలో అడ్మిషన్లు రద్దు

- దిక్కుతోచని స్థితిలో 150 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు
- ఏడుగురు విద్యార్థులైతే వైద్యవిద్యకే స్వస్తి చెప్పాల్సిన పరిస్థితి

టీఆర్ఆర్ మెడికల్ కాలేజీలో అడ్మిషన్లు రద్దయిన ఎంబీబీఎస్ ఫస్టియర్ విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వారిని వివిధ మెడికల్ కాలేజీల్లో సర్దుబాటు చేసినా, ఆ కాలేజీ నుంచి ఫీజు బదిలీ జరగలేదు. సర్దుబాటు జరిగిన కాలేజీలకు ఫీజు చెల్లించకపోతే మొదటి ఏడాది పరీక్ష రాసేందుకు వీలుండదు. బీ, సీ కేటగిరీలకు చెందిన ఏడుగురు విద్యార్థులు వైద్యవిద్యకు స్వస్తి చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- 5లో▶

లోన్ వస్తే ట్రాన్స్'ఫార్మర్ల'కు మీటర్లు!

ఈఆర్సీకి నివేదించిన టీఎస్ ఎస్పీడీసీఎల్



రాష్ట్రంలో అన్ని వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు గడువులోగా మీటర్లు బిగించి, విద్యుత్ వినియోగాన్ని కచ్చితంగా లెక్కించాలని గతంలో రాష్ట్ర ఈఆర్సీ ఆదేశించింది. దీనిపై పురోగతిని తెలపాలని ఇటీవల ఈఆర్సీ కోరగా.. తాజాగా టీఎస్ఎస్పీడీసీఎల్ బదులిచ్చింది. మీటర్ల ఏర్పాటుకు రూ.93 కోట్ల రుణమివ్వాలని గతేడాది జూలై 22న ఆర్ఈసీకి ప్రతిపాదనలు పంపామని.. ఆ రుణం మంజూరయ్యాక మీటర్లు ఏర్పాటు చేస్తామని ఈఆర్సీకి తెలిపింది.

- వివరాలు 3లో▶

ఢిల్లీ మహిళా కమిషన్ చీఫ్ స్వాతి మలివాల్‌కు నడిరోడ్డుపై వేధింపులు



- తెల్లవారుజామున తనిఖీ వేళ అసభ్యంగా ప్రవర్తించిన తాగుబోతు
- నిందితుడి అరెస్ట్.. పలు సెక్షన్ల కింద కేసులు నమోదు

6 లో

రోజంతా మంటలే!

సికింద్రాబాద్‌లోని మినిస్టర్స్ రోడ్‌లో భారీ అగ్నిప్రమాదం


మంటల్లో రాధా ఆర్కేడ్ భవనం

సాక్షి, హైదరాబాద్/రాంగోపాల్‌పేట్: అది దుకాణాలు, జనావాసాల మధ్య ఉన్న భవనం.. మెల్లగా పొగలు రావడం మొదలైంది.. కాసేపటికే భవనమంతా అగ్నికీలల్లో చిక్కుకుంది. ఉధృతంగా మంటలు, పొగ ధాటికి ఆ చుట్టుపక్కల ప్రాంతం రాత్రి అయిందేమో అన్నట్టుగా మారిపోయింది. ఏం జరుగుతుందోనని చుట్టుపక్కల భవనాలు, దుకాణాల వారు భయాందోళనకు లోనయ్యారు. మరోవైపు సామగ్రిని కాపాడుకునేందుకు భవనంలోకి వెళ్లిన ముగ్గురు ఉద్యోగులు గల్లంతయ్యారు. సికింద్రాబాద్‌లోని మినిస్టర్స్ రోడ్‌లో ఉన్న రాధా ఆర్కేడ్ భవనంలో జరిగిన భారీ అగ్నిప్రమాద ఘటన ఇది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఈ ప్రమాదం జరిగినట్టుగా భావిస్తున్నారు.

ఉదయం పొగలతో మొదలై..

రాధా ఆర్కేడ్ భవనంలో 2010 నుంచి టీ-షర్టులు, ట్రాక్స్, టోపీలు తయారుచేసి విక్రయించే డెక్కన్ కార్పొరేట్, డెక్కన్ నైట్ సంస్థలు కొనసాగుతున్నాయి. భవనం సెల్లార్-1లో చెకర్డ్ ఫ్లాగ్ కార్ డెకార్స్ గోదాం, సెల్లార్‌లో ఆ కార్ డెకార్స్ దుకాణం, డెక్కన్ కార్పొరేట్ వస్త్ర గోదాం ఉన్నాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో డెక్కన్ కార్పొరేట్ వస్త్రాల హోల్ సేల్ షాపు ఉండగా.. పైన అంతస్తుల్లో డెక్కన్ నైట్ సంస్థ వస్త్రాల తయారీ, నిల్వకు వినియోగిస్తున్నారు. గురువారం ఉదయం సెల్లార్‌లో స్వల్పంగా పొగలు కనిపించాయి. ఆ సమయంలో అక్కడికి వచ్చిన కార్ డెకార్స్ యజమాని.. తన దుకాణాన్ని పరిశీలించి, బాగానే ఉండటంతో డెక్కన్ సంస్థ వారిని అప్రమత్తం చేశారు. వారు సరిగా పట్టించుకోలేదు. ఉదయం 10.30 గంటల సమయంలో పొగలు దట్టంగా మారాయి. కాసేపటికే సెల్లార్-1, గ్రౌండ్ ఫ్లోర్‌లకూ విస్తరించాయి. దీనిపై చుట్టుపక్కల వారు అగ్నిమాపకశాఖకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి సహాయక చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం 12 గంటల సమయానికల్లా సెల్లార్-1 నుంచి మూడో ఫ్లోర్ వరకు మంటలు విస్తరించాయి. అప్పటికే పైన ఐదు, ఆరో అంతస్తుల్లో పనిచేస్తున్న పెయింటర్ మిథిలేశ్ కుమార్, మార్బుల్ వర్కర్లు రూపేష్, బిబాష్, రామ్‌రాజ్ సింగ్‌లను అగ్నిమాపక సిబ్బంది రక్షించారు.

వద్దన్నా లోపలికి వెళ్లి.. గల్లంతై..

మధ్యాహ్నం 12 గంటల సమయంలో భవనం వద్దకు వచ్చిన డెక్కన్ సంస్థ ఉద్యోగులు వసీమ్, జహీర్, జునైద్ ముగ్గురు లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిస్తున్నా వినకుండా పక్కన ఉన్న ద్వారం తెరుచుకుని గ్రౌండ్ ఫ్లోర్‌లోకి ప్రవేశించారు. అప్పటికే గ్రౌండ్ ఫ్లోర్ నుంచి పై అంతస్తులకు మంటలు భారీగా వ్యాపించాయి. లోపలికి వెళ్లిన ముగ్గురు ఉద్యోగుల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. వారి కోసం ఇద్దరు అగ్నిమాపక సిబ్బంది ఆక్సిజన్ సిలిండర్లు పెట్టుకుని భవనంలోకి ప్రవేశించినా.. మంటలు, వేడి వాయువుల ధాటికి అస్వస్థతకు గురై బయటికి వచ్చారు. అధికారులు వారిని వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో ఐసీయూలో చేర్చి చికిత్స అందిస్తున్నట్టు తెలిసింది.

ఆ ముగ్గురి కోసం నేడు గాలింపు

రాధా ఆర్కేడ్ భవనంలో మంటలు రాత్రి 9.30 గంటలకు అదుపులోకి వచ్చినా ఆ తర్వాత కూడా పొగలు కొనసాగాయి. దానికితోడు మంటల ధాటికి భవనం బలహీనపడి కూలిపోయే ప్రమాదం ఉండటంతో.. లోపలికి వెళ్లి గల్లంతైన ముగ్గురి కోసం శుక్రవారం ఉదయం గాలింపు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. భవనం సమీపంలోకి ఎవరూ వెళ్లకుండా బారికేడ్లు పెట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. గల్లంతైన ముగ్గురూ గుజరాత్ నుంచి వలస వచ్చిన కార్మికులని గుర్తించారు. వీరిలో వసీమ్, జహీర్ తమ కుటుంబాలతో నల్లగుట్టలో నివసిస్తుండగా.. జునైద్ ఇదే భవనం మూడో అంతస్తులో ఉంటున్నట్టు తెలిసింది.

నివాసం కోసం అనుమతి తీసుకుని..

మినిస్టర్స్ రోడ్‌లోని ఈ భవనానికి 2006లో సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్‌తోపాటు పైన నాలుగు అంతస్తులు నిర్మిస్తామంటూ అనుమతి తీసుకున్నారు. అధికారులు సెల్లార్‌లో వాహనాల పార్కింగ్‌కు, మిగతా ఫ్లోర్లకు నివాసాల కోసం అనుమతి ఇచ్చారు. కానీ దాని యజమాని సెల్లార్-1, సెల్లార్-2, గ్రౌండ్ ఫ్లోర్‌తోపాటు 4 అంతస్తులు నిర్మించి.. వాణిజ్య అవసరాల కోసం వినియోగిస్తున్నారు. తర్వాత ఐదు, ఆరో అంతస్తుల నిర్మాణమూ చేపట్టారు. పనులు చివరిదశలో ఉన్నాయి. భవన యజమాని 2015లో వచ్చిన బీఆర్‌ఎస్ (బిల్డింగ్ రెగ్యులరైజేషన్ స్కీమ్) పథకం కింద కమర్షియల్‌గా వాడుతున్న గ్రౌండ్ ఫ్లోర్‌తోపాటు అక్రమంగా కట్టిన 5, 6 అంతస్తులను క్రమబద్ధీకరించుకున్నారు.

డెక్కన్ సంస్థ యజమాని అరెస్టు

రాధా ఆర్కేడ్ భవనంలో డెక్కన్ సంస్థను మహ్మద్ ఒవైసీ, ఆయన తండ్రి జావీద్ నిర్వహిస్తున్నారు. పై రెండు అంతస్తులను నల్లగుట్టకు చెందిన ఎంఏ రహీం అనే వ్యక్తి నివసించడం కోసం కట్టిస్తున్నట్టు స్థానికులు చెప్తున్నారు. ప్రమాద ఘటనకు సంబంధించి మహ్మద్ ఒవైసీ, జావీద్‌లపై రాంగోపాల్‌పేట్ పోలీసులు కేసు నమోదు చేసి.. మహ్మద్‌ను అదుపులోకి తీసుకున్నారు.

40 ఫైరింజన్లు.. 200కుపైగా ట్యాంకర్లు

మొదట ఒకట్రెండు ఫైరింజన్లతో నీరు చల్లడం మొదలుపెట్టిన అగ్నిమాపక సిబ్బంది.. మంటలు తీవ్రం కావడం, ముగ్గురు ఉద్యోగులు లోనికి వెళ్లడంతో ఉధృతంగా సహాయక చర్యలు చేపట్టారు. హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఫైరింజన్లను, వాటికి నీటి కోసం జల మండలితోపాటు ప్రైవేటు ట్యాంకర్లను వెంట వెంటనే రప్పించారు. దాదాపు 40 ఫైరింజన్లు, 200కుపైగా ట్యాంకర్లను వినియోగించారు. ఉదయం దాదాపు 11 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు కూడా సహాయక చర్యలు సాగుతూనే ఉన్నాయి. భవనంలో అంతా వస్త్రాలు, రెగ్జిన్, ప్లాస్టిక్, ఫైబర్ మెటీరియల్ ఉండటంతో మంటలను అదుపులోకి తీసుకురావడం కష్టమైందని అధికారులు చెప్తున్నారు. ప్రమాదం కారణంగా గురువారం ఉదయం నుంచీ మినిస్టర్స్ రోడ్‌ను మూసేశారు. దీనితో చుట్టుపక్కల మార్గాల్లో పొద్దంతా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

అంతా వస్త్రం, ప్లాస్టిక్ మెటీరియల్ కావడంతో..

రాధా ఆర్కేడ్ భవనంలో ఉన్న డెక్కన్ కార్పొరేట్ సంస్థ మొత్తం వస్త్ర మెటీరియల్‌కు సంబంధించినదే. పైగా రెండు సెల్లార్‌లలో ఉన్న కార్ డెకార్స్‌కు చెందిన సామగ్రి అంతా ప్లాస్టిక్, ఫైబర్‌తో పాటు బాగా మండిపోయే స్వభావం ఉన్నది కావడంతో.. మంటలు చాలా ఉధృతంగా వచ్చాయి. ఒక సమయంలో దాదాపుగా భవనం ఎత్తున ఎగిసిపడ్డాయి. మంటల ఉధృతి, నల్లటి దట్టమైన పొగల కారణంగా రాధా ఆర్కేడ్ భవనం చుట్టుపక్కల కొంత ప్రాంతం చీకటి కమ్మినట్టుగా అయిపోయింది. మంటలు ఇతర భవనాలకూ విస్తరించే ప్రమాదం ఉందని భావించిన పోలీసులు.. చుట్టుపక్కల మూడు భవనాల్లోని 21 కుటుంబాలను, ఎనిమిది దుకాణాలను ఖాళీ చేయించారు. రాధా ఆర్కేడ్ భవనంలో పలుగోడలు, పిల్లర్లు పగుళ్లు ఇవ్వడంతో.. అది కూలిపోయే ప్రమాదం ఉందని చెప్తున్నారు.

ప్రమాదకర భవనాలపై స్పెషల్ డ్రైవ్: మంత్రి తలసాని


సంఘటన స్థలంలో మంత్రి తలసాని

హైదరాబాద్ నగరంలో చాలా ఏళ్లుగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని.. నిబంధనలు పాటించని, ప్రమాదకర భవనాల విషయంగా స్పెషల్ డ్రైవ్ చేపడతామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. ప్రమాద స్థలాన్ని సందర్శించి మీడియాతో మాట్లాడారు. అగ్నిమాపక సిబ్బంది, డీఆర్‌ఎఫ్, పోలీసులు వేగంగా సహాయక చర్యలు చేపట్టారన్నారు. ఘటనపై పూర్తి నివేదిక తెప్పిస్తామని.. నిబంధనలు పాటించని షాపులు, గోదాములపై కఠినచర్యలు తీసుకుంటామని చెప్పారు.

కఠినచర్యలు చేపడతాం: మంత్రి మహమూద్ అలీ



నిబంధనలు ఉల్లంఘించి నిర్వహిస్తున్న గోదాములపై కఠిన చర్యలు తీసుకుంటామని హోం మంత్రి మహమూద్ అలీ అన్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గోదాములో ఎక్కువగా ప్లాస్టిక్ వస్తువులు, సింథటిక్ వస్త్రాలు ఉండటంతో మంటలు అదుపులోకి రావడం కష్టమైందన్నారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి కఠినచర్యలు తీసుకుంటామన్నారు.

బీఆర్‌ఎస్ సభ అట్టర్ ఫ్లాప్

బండి సంజయ్ విసుర్లు

- లిక్కర్, గోల్డ్ స్కామ్‌ల సీఎంలే వచ్చారు
- కేసీఆర్ దగ్గరకు ఒకసారి వచ్చిన నేతలు మళ్లీ రారు



సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్‌ఎస్ పార్టీ ఖమ్మంలో నిర్వహించిన బహిరంగ సభ అట్టర్ ఫ్లాప్ అయిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఎద్దేవా చేశారు. డబ్బులిచ్చి, బెదిరించి ప్రజలను తీసుకొచ్చి సభను విజయవంతం చేసేందుకు ప్రయత్నించినా అది ఫలించలేదన్నారు. ఇండియా, న్యూజిలాండ్ మ్యాచ్‌ను తప్ప బీఆర్‌ఎస్ సభను ప్రజలు పట్టించుకోలేదని చెప్పారు. సభకు కేవలం లిక్కర్, గోల్డ్ స్కాముల్లో ఇరుక్కున్న ముఖ్యమంత్రులే వచ్చారని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, కేరళ సీఎం పినరయి విజయన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. పంజాబ్, తెలంగాణ సీఎంలు తాగి ఊగడంలో జాన్ జబ్బులు అంటూ విమర్శించారు. కేసీఆర్ దగ్గరకు ఒకసారి వచ్చినోళ్లు మళ్లీ రారని, బిహార్ సీఎం నితీశ్‌కుమార్, కర్ణాటక మాజీ సీఎం కుమారస్వామిలు అందుకే ఖమ్మం సభకు రాలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం ఖమ్మం సభకు వచ్చిన నేతలు ఇకపై కనబడరని అన్నారు. ఆలయాల మాటున వ్యాపారం ఎట్లా చేయొచ్చో చెప్పేందుకే ముఖ్యమంత్రులను కేసీఆర్ యాదాద్రి తీసుకెళ్లారని ఆరోపించారు. సంజయ్ గురువారం ఇక్కడ మీడియాతో మాట్లాడారు.

కేసీఆర్ దయచేసి దేశం పేరెత్తకు..

'కేసీఆర్ ఏ దేశం పేరెత్తి మాట్లాడితే ఆ దేశం ఔట్ అవుతోంది. గతంలో పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక పేర్లు ప్రస్తావించాడు. ఇప్పుడు ఆ దేశాలు అడుక్కునే స్థితికి వెళ్లాయి. చైనా పేరెత్తితే ఆ దేశం కరోనాతో చస్తోంది. కేసీఆర్.. దయచేసి భారత్ బాగుందని చెప్పొద్దు. నీ నోరు అంత మంచిది కాదు..' అంటూ సంజయ్ ఎద్దేవా చేశారు. 'కృష్ణా, గోదావరి నదుల్లో తెలంగాణ వాటాను వాడుకోలేని కేసీఆర్ దేశ జల విధానం గురించి మాట్లాడటం సిగ్గుచేటు. తుపాకీ రాముడి మాదిరిగా టోపీ పెట్టుకుని, మేక్ ఇన్ ఇండియాను విమర్శించడం విడ్డూరం. తొలి కేబినెట్‌లో ఒక్క మహిళకు చోటివ్వలేదు. ఇప్పుడు మహిళలకు 35 శాతం రిజర్వేషన్లు ఇస్తాననడం హాస్యాస్పదం. మహిళా బిల్లును చింపేసిన ఎస్పీ నేత పక్కనే ఉన్నారు. ఆయనకు తెలుగు అర్థమైతే కొట్టి వెళ్లేవాడు. తెలంగాణ సెంటిమెంట్‌తో అధికారంలోకి వచ్చి 'జై తెలంగాణ' అనే పదాన్ని విస్మరించిన తెలంగాణ ద్రోహి కేసీఆర్..' అని మండిపడ్డారు.

బండి సంజయ్‌కు 'కంటి వెలుగు' పరీక్షలు అవసరం

- దేశంలోనే కాదు.. ఖమ్మం రాజకీయాల్లోనూ మార్పు
- కాంగ్రెస్ ఓటమికి సుపారీలు కాదు.. వాళ్ల నేతలే చాలు: పువ్వాడ


మాట్లాడుతున్న పువ్వాడ. చిత్రంలో పల్లా రాజేశ్వరరెడ్డి, రవిచంద్ర

సాక్షి, హైదరాబాద్: భారత్ రాష్ట్ర సమితి(బీఆర్‌ఎస్) బుధవారం ఖమ్మంలో నిర్వహించిన బహిరంగసభ ద్వారా దేశ రాజకీయాలతోపాటు జిల్లా రాజకీయాలు కూడా మారుతాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ అన్నారు. పార్టీ నేతల సమన్వయంతో సభ విజయవంతమైందని, ఖమ్మం చరిత్రలో ఈ తరహా సభ ఎన్నడూ జరగలేదని అన్నారు. రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌తో కలిసి గురువారం బీఆర్‌ఎస్ శాసన సభాపక్ష కార్యాలయంలో అజయ్ మీడియాతో మాట్లాడారు. ఖమ్మం సభ ఫ్లాప్ అయిందంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ అంతటి భారీసభను కూడా చూడలేకపోయిన ఆయనకు కంటి వెలుగు పరీక్షలు అవసరమని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. 24 గంటల కరెంటు గురించి సంజయ్‌కు సందేహాలు ఉంటే, రాష్ట్రంలో ఎక్కడైనా కరెంటు తీగను పట్టుకుని చూడాలని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌ను ఓడించేందుకు సీఎం కేసీఆర్ సుపారీ ఇచ్చారంటూ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ కాంగ్రెస్‌ను ఓడించేందుకు ఆ పార్టీ నేతలే సరిపోతారన్నారు. సభలో ఖమ్మం జిల్లాకు సీఎం నిధుల వరద పారించారని, అభివృద్ధికి గుమ్మంలా ఖమ్మం మారిందని పువ్వాడ అన్నారు. టీఆర్‌ఎస్ ఆవిర్భావం సందర్భంగా 2001లో జరిగిన కరీంనగర్ సభ తెలంగాణ ఏర్పాటుకు బాటలు వేసినట్లే, ఖమ్మం బీఆర్‌ఎస్ సభ జాతీయ రాజకీయాల్లో మార్పులకు నాంది పలుకుతుందని రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రగతిశీల శక్తుల కలయికకు ఖమ్మం సభ బాటలు వేసిందని అభిప్రాయపడ్డారు. విద్యుత్ రంగాన్ని బడా పారిశ్రామికవేత్త అదానికి కట్టబెట్టే కుట్రలను ప్రతిఘటించడంతోపాటు తెలంగాణ తరహాలో దేశమంతా ఉచిత విద్యుత్ ఇస్తామన్నారు. ఖమ్మం జిల్లాలో బీజేపీకి స్థానం లేదని బీఆర్‌ఎస్ బహిరంగ సభ ద్వారా తేలిపోయిందని, వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి ఇక్కడ డిపాజిట్లు కూడా రావని రవిచంద్ర అన్నారు.



బడి పక్కింట్లో పాఠాలు వింటున్న విద్యార్థులు

బడిలో 'కంటి వెలుగు'.. పక్కింట్లో పాఠాలు

మహబూబాబాద్ జిల్లాలో ఘటన

కురవి: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కంటి వెలుగు–2 కార్యక్రమాన్ని నిర్వహించడంతో విద్యార్థులకు పక్కింట్లో తరగతులు నిర్వహించారు. పైగా ఈ కార్యక్రమాన్ని జిల్లాకు చెందిన మంత్రి సత్యవతి రాథోడ్ ప్రారంభించడం గమనార్హం. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కొత్తూరు(జీ) శివారు తాట్య తండాలో గురువారం జరిగింది. తాట్య తండాలోని ప్రాథమిక పాఠశాలలో కంటి వెలుగు–2 కార్యక్రమానికి ఆరోగ్య, వైద్య శాఖ సిబ్బంది ఏర్పాట్లు చేయగా, మంత్రి సత్యవతి రాథోడ్ ప్రారంభించారు. పాఠశాలలో కంటి వెలుగు శిబిరం ఏర్పాటు చేయడంతో ఆ పక్కనే భూక్య భద్రు అనే వ్యక్తి ఇంట్లో ఉపాధ్యాయురాలు పద్మ విద్యార్థులకు తరగతులు నిర్వహించారు. పిల్లలకు మధ్యాహ్న భోజనాన్ని సైతం అదే ఇంటి ఆవరణలో వడ్డించారు. దీనిపై స్థానికంగా విమర్శలు వెల్లువెత్తాయి. కంటివెలుగు కార్యక్రమాన్ని వేరేచోట కాకుండా బడిలో నిర్వహించి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం ఏమిటని తండావాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తీరును తప్పుపట్టారు.

తొలిరోజు @ 1.60 లక్షలు

- రాష్ట్రవ్యాప్తంగా కంటి వెలుగు ప్రారంభం
- 1,500 కేంద్రాల్లో పరీక్షలు
- గుత్తా, ఇంద్రకరణ్, జగదీశ్‌రెడ్డికి కూడా టెస్టులు
- 55 లక్షల కళ్లజోళ్ల పంపిణీ లక్ష్యం: మంత్రి హరీశ్



వృద్ధురాలికి కంటి అద్దాలు ఇచ్చి అక్షరాలు చదివిస్తున్న హరీశ్. చిత్రంలో తలసాని



మంత్రి ఇంద్రకరణ్‌కు పరీక్షలు చేస్తున్న వైద్యులు

సాక్షి నెట్‌వర్క్: రెండో విడత 'కంటి వెలుగు' కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమయ్యింది. ముఖ్యమంత్రి కేసీఆర్ బుధవారం ఖమ్మంలో దీనిని ప్రారంభించగా, గురువారం నుంచి రాష్ట్రంలోని 1,500 కేంద్రాల్లో కంటి పరీక్షలు చేపట్టారు. తొలిరోజు 1.60 లక్షల మందికి పరీక్షలు నిర్వహించినట్లు వైద్య ఆరోగ్య శాఖ ప్రకటించింది. 72,580 మంది పురుషులు, 87,889 మంది మహిళలు, ఇద్దరు ఇతరులు పరీక్షలు చేయించుకున్నారు. మొత్తం 70 వేల మందిలో సమస్యలు గుర్తించారు. 37 వేల మందికి దగ్గరి చూపు లోపానికి సంబంధించి అద్దాలు అందజేశారు. మరో 33 వేల మందిలో ఇతరత్రా సమస్యలు గుర్తించి అద్దాల కోసం సిఫారసు చేశారు. అతి తక్కువ మందికి శస్త్రచికిత్సలు అవసరమని తేల్చారు. మొత్తం మీద తొలిరోజు పరీక్షించిన వారిలో 43.75 శాతం మందికి రకరకాల చూపు సమస్యలు ఉన్నట్లు తేలింది. పట్టణ ప్రాంతాల్లో రద్దీ తక్కువగా ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో 40 ఏళ్ల పైబడ్డ వారితో క్యూ లైన్లు నిండిపోయాయి.

పలువురు ప్రముఖులకు అద్దాలు

రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నిర్మల్‌లో కంటి పరీక్ష చేసుకోగా, ఆయనకు దగ్గరి చూపు (షార్ట్ విజన్) లోపం ఉన్నట్లు గుర్తించి అద్దాలు అందజేశారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి వేములపల్లి మండల కేంద్రంలో పరీక్ష చేసుకోగా లోపం ఉందని గుర్తించి రీడింగ్ గ్లాసులు అందజేశారు. సూర్యాపేటలో పరీక్ష చేయించుకున్న రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డికి ఎలాంటి అద్దాలు అవసరం లేదని నిర్ధారించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్‌భాస్కర్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణరెడ్డి పరీక్షలు చేయించుకున్నారు. వీరిద్దరికీ అద్దాలు అందజేశారు.

ఎక్కడ కావాలంటే అక్కడికే..

గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీలు, బస్తీలు, అపార్ట్‌మెంట్లు.. ఎక్కడ సేవలు కావాలన్నా ట్విట్టర్ లేదా వెబ్‌సైట్‌లో రిక్వెస్ట్ పెడితే అక్కడికే కంటి వెలుగు బృందాలు వస్తాయని మంత్రి హరీశ్ తెలిపారు. సీఎం కేసీఆర్ ఏపని చేపట్టినా ప్రజల మంచి గురించి ఆలోచించి చేస్తారని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. టీఎస్ఎంఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్, ఆరోగ్య శాఖ కమిషనర్ శ్వేత మహంతి తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ రహిత తెలంగాణ లక్ష్యం..

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావు, మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్‌తో కలిసి హైదరాబాద్ అమీర్‌పేటలో కంటి వెలుగు పరీక్షా శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..అంధత్వ రహిత తెలంగాణ కంటి వెలుగు లక్ష్యమని చెప్పారు. ఎవరూ కంటి చూపు సమస్యతో బాధపడకూడదనే ఉద్దేశంతో 2018లో సీఎం కేసీఆర్ ఈ పథకానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. గతంలో 8 నెలల పాటు కంటి వెలుగు నిర్వహిస్తే ఈసారి 100పనిదినాల్లో దీన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ దఫా కంటి వెలుగు ద్వారా 55 లక్షల కళ్ళ జోళ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.

క్లుప్తంగా...

ఎంఎల్‌ఎం వలలో చిక్కుకోవద్దు: సజ్జనార్



సాక్షి, హైదరాబాద్: అత్యాశతో క్యూనెట్ వంటి మోసపూరిత మల్టీలెవెల్ మార్కెటింగ్ (ఎంఎల్‌ఎం) సంస్థల వలలో చిక్కుకోవద్దని సీనియర్ ఐపీఎస్ అధికారి, ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విహాన్ డైరెక్ట్ సెల్లింగ్ ప్రైవేట్ లిమిటెడ్ మాటున క్యూనెట్ సంస్థ గొలుసుకట్టు పద్ధతిలో అమాయకుల నుంచి రూ. వేల కోట్లు కొల్లగొట్టిందని ఆయన పేర్కొన్నారు. క్యూనెట్‌కు చెందిన 36 బ్యాంకు ఖాతాల్లోని రూ. 90 కోట్ల నగదును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాజాగా సీజ్ చేసిన నేపథ్యంలో సజ్జనార్ గురువారం ట్విట్టర్ వేదికగా ప్రజలకు ఈ సూచనలు చేశారు. గతంలో తాను సైబరాబాద్ పోలీసు కమిషనర్‌గా పనిచేసినప్పుడు క్యూనెట్ మోసాలపై పలు కేసులు నమోదు చేసినట్లు ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. గొలుసుకట్టు సంస్థలకు ఎలాంటి అనుమతులు ఉండవని, ఆర్బీఐ నియంత్రణలో లేని సంస్థలను నమ్మొద్దని ప్రజలకు సూచించారు.

కొత్తగా సైబర్ సెక్యూరిటీ కోర్సు

సాక్షి, హైదరాబాద్: అండర్ గ్రాడ్యుయేషన్‌లో కొత్తగా సైబర్ సెక్యూరిటీ అండ్ సేఫ్టీ కోర్సును ప్రవేశపెట్టేందుకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కసరత్తు వేగవంతం చేసింది. 2023–24 విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రకటించిన టీఎస్‌సీహెచ్‌ఈ... ఆ కోర్సు పాఠ్యాంశం, విధానాలు తదితరాల ఖరారు కోసం డీజీపీ కార్యాలయం, ఉస్మానియా, జేఎన్‌టీయూ, నల్సార్ యూనివర్సిటీలతో పాటు ఐఐటీ హైదరాబాద్‌లను ప్రతిపాదిస్తూ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా గురువారం టీఎస్‌సీ హెచ్‌ఈ కార్యాలయంలో ప్రత్యేక కమిటీ ప్రతినిధులతో సమావేశం జరిగింది. సైబర్ సెక్యూరిటీ అండ్ సైన్స్ కోర్సు విధివిధానాలపై చర్చించారు.

'మెడికల్' దరఖాస్తుదారులకు ఎడిట్ ఆప్షన్

సాక్షి, హైదరాబాద్: మెడికల్ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఎడిట్ ఆప్షన్ కల్పించింది. ఆన్‌లైన్ దరఖాస్తులను సవరించడానికి వీలు కల్పించింది. బోర్డ్ వెబ్‌సైట్ https://mhsrb.telangana.gov.inలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి 24 సాయంత్రం 5 గంటల వరకు ఆప్షన్ అందుబాటులో ఉంటుందని సభ్య కార్యదర్శి గోపికాంత్‌రెడ్డి తెలిపారు.

లోన్ వస్తే ట్రాన్స్‘ఫార్మర్ల’కు మీటర్లు!

- ఈఆర్సీకి నివేదించిన టీఎస్ ఎస్పీడీసీఎల్
- ఆర్ఈసీ రుణం కోసం దరఖాస్తు చేసుకున్నాం
- రాష్ట్రంలో వ్యవసాయ విద్యుత్ వినియోగం తగ్గింది
- ఎత్తిపోతల పథకాల విద్యుత్ వాడకం భారీగా పెరిగింది

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు మీటర్ల ఏర్పాటుకు సంబంధించి రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈ ఆర్సీ)కి దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్)వివరణ ఇచ్చింది. మీటర్ల ఏర్పాటు కోసం రూ.93 కోట్ల రుణమివ్వాలని గతేడాది జూలై 22న గ్రామీణ విద్యుదీకరణ సంస్థ (ఆర్ఈసీ)కు ప్రతిపాదనలు పంపామని.. ఆ రుణం మంజూరయ్యాక మీటర్లు ఏర్పాటు చేస్తామని తెలిపింది. అయితే దీనిపై ఆర్ఈసీ నుంచి ఇంకా స్పందన రాలేదని పేర్కొంది. రాష్ట్రంలో అన్ని వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు నిర్దేశిత గడువులోగా మీటర్లు బిగించి, వ్యవసాయ విద్యుత్ వినియోగాన్ని కచ్చితంగా లెక్కించాలని గతంలో రాష్ట్ర ఈఆర్సీ ఆదేశించింది. ఈ అంశంలో పురోగతిని తెలియజేయాలని ఇటీవల ఈఆర్సీ కోరగా.. తాజాగా టీఎస్ఎస్పీడీసీఎల్ బదులిచ్చింది.

తగ్గిన వ్యవసాయ విద్యుత్ వినియోగం

రాష్ట్రంలో భారీ ఎత్తిపోతల పథకాలు చేపట్టిన నేపథ్యంలో కాల్వల కింద సాగు పెరిగి బోరుబావుల కింద వ్యవసాయ విద్యుత్ వినియోగం క్రమంగా తగ్గుతోందని రాష్ట్ర డిస్కంలు వెల్లడించాయి. ఇదే సమయంలో ఎత్తిపోతల పథకాల విద్యుత్ వినియోగం భారీగా పెరిగిందని వివరించాయి.

→ దక్షిణ తెలంగాణలోని 5 ఉమ్మడి జిల్లాల పరిధిలో 2021–22 తొలి అర్ధవార్షికంలో 5,410 మిలియన్ యూనిట్ల (ఎంయూ) వ్యవసాయ విద్యుత్ వినియోగం జరగగా.. 2022–23తొలి అర్ధవార్షికంలో 5,105 ఎంయూల వినియోగం జరిగిందని టీఎస్ఎస్పీడీసీఎల్ తెలిపింది. తమ సంస్థ పరిధిలో దాదాపు 6% వ్యవసాయ విద్యుత్ వినియోగం తగ్గిందని తెలిపింది. 2023–24లో ఎత్తిపోతల పథకాల వినియోగం 105% పెరగనుందని అంచనా వేసింది.

→ ఉత్తర తెలంగాణలోని ఐదు ఉమ్మడి జిల్లాల పరిధిలో 2021–22 తొలి అర్ధ వార్షికంలో 2,938 ఎంయూల వ్యవసాయ విద్యుత్ వినియోగం జరగగా.. 2022–23 తొలి అర్ధ వార్షికంలో 2,809 ఎంయూల వినియోగం మాత్రమే జరిగిందని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీఎస్ఎన్పీడీసీఎల్) తెలిపింది. తమ సంస్థ పరిధిలో దాదాపు 4% వ్యవసాయ విద్యుత్ వినియోగం తగ్గిందని ఈఆర్సీకి నివేదించింది. ఉత్తర తెలంగాణలో 2023–24లో ఎత్తిపోతల పథకాల విద్యుత్ వినియోగం 287% పెరగనుందని అంచనా వేసింది.

→ 2023–24కి సంబంధించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదిక(ఏఆర్ఆర్)లో వ్యవసాయ విద్యుత్ అవసరాల అంచనాలను తగ్గించడంపై ఈఆర్సీ వివరణ కోరగా.. డిస్కంలు ఈ వివరాలు ఇచ్చాయి.

ఇక ఎవరంటే వారు కుదరదు

- ఈఆర్సీ చైర్ పర్సన్, సభ్యులుగా ఇకపై ఎవరిని పడితే వారిని నియమించలేరు !
- విద్యుత్ సంస్థల అధిపతి/ప్రభుత్వ ముఖ్యకార్యదర్శిగా పనిచేసి ఉంటేనే చైర్‌పర్సన్‌కు అర్హత
- విద్యుత్ సంస్థల డైరెక్టర్/ ప్రభుత్వ కార్యదర్శిగా పనిచేసి ఉంటేనే ఈఆర్సీ సభ్యుడిగా నియామకం
- డిస్కంల లైసెన్స్‌కి 25 ఏళ్ల కాలపరిమితి
- ముసాయిదా విద్యుత్(సవరణ) 2023 నిబంధనలను ప్రకటించిన కేంద్రం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్సీ) చైర్ పర్సన్, సభ్యులుగా ఇకపై ఎవరినిపడితే వారిని నియమించడానికి ఆస్కారం ఉండదు. ఈఆర్సీల చైర్‌పర్సన్, సభ్యులకు ఉండాల్సిన అర్హతలపై కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలను ప్రతిపాదించింది. ఈ మేరకు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ గురువారం 'ముసాయిదా విద్యుత్(సవరణ) నిబంధనలు–2023 ప్రకటించింది. ఈ నిబంధనల ప్రకారం.. విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం), విద్యుత్ సరఫరా సంస్థ(ట్రాన్స్‌కో), విద్యుదుత్పత్తి సంస్థ(జెన్‌కో)ల అధిపతిగా పని చేసిన వ్యక్తిని లేదా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో కనీసం ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి స్థాయిలో పనిచేసిన అనుభవం కలిగిన వ్యక్తిని మాత్రమే ఇకపై రాష్ట్రాల ఈఆర్సీ చైర్‌పర్సన్‌గా నియ మించాల్సి ఉంటుంది. ఇక ఈఆర్సీ సభ్యులుగా సైతం జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంల బోర్డుల్లో సభ్యులు(డైరెక్టర్లు)గా పనిచేసిన వ్యక్తులు గానీ లేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో కనీసం కార్యదర్శి స్థాయిలో పనిచేసిన వ్యక్తిని నియ మించాల్సి ఉంటుంది. అదేవిధంగా ఏదైనా రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో పని చేసిన వ్యక్తి మూడేళ్ల విరామం తర్వాతే ఆ రాష్ట్ర ఈఆర్సీ చైర్‌పర్సన్, సభ్యుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు అవుతారు. విద్యుత్ రంగంలో కనీసం రెండేళ్లు పనిచేసిన అనుభవం కలిగిన వ్యక్తులకు ప్రాధాన్యత ఇస్తారు.

ఇక అలా కుదరదు..: విద్యుత్ రంగంలో ఎలాంటి అనుభవం లేని న్యాయవాదులు, అకౌంటెంట్లను సైతం రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఈఆర్సీ చైర్‌పర్సన్, సభ్యులుగా నియమించింది. ఈ కొత్త నిబంధనలు అమల్లోకి వస్తే అలా చేయడానికి వీలుండదు. కొంత వరకు రాష్ట్రాల అధికారాలకు కత్తెర వేసినట్టయింది.ఈ ముసాయిదా నిబంధనలపై వచ్చే నెల 17లోగా అభిప్రాయాలను తెలియజేయాలని కేంద్రం రాష్ట్రాలకు కోరింది.

డిస్కంల లైసెన్స్‌కు కాలపరిమితి..: వినియోగదారులకు రిటైల్ విద్యుత్ సరఫరా చేసే విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లకు ఆయా రాష్ట్రాల ఈఆర్సీలు జారీ చేసే లైసెన్స్‌లకి ఇప్పటి వరకు నిర్దేశిత కాల వ్యవధి లేదు. ఇకపై డిస్కంల లైసెన్స్‌కు 25 ఏళ్ల కాల వ్యవధి అమల్లోకి రానుంది. ఆ తర్వాత మళ్లీ డిస్కంలు సంబంధిత రాష్ట్ర ఈఆర్సీ నుంచి లైసెన్స్ పునరుద్ధరణ చేసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత మరో 25 ఏళ్లకు లైసెన్స్ పునరుద్ధరణ చేస్తారు. ఈ విషయాన్ని సైతం ముసాయిదా రూల్స్‌లో కేంద్రం పొందుపరిచింది.

ప్రొటోకాల్‌పై సీఎం జవాబివ్వాలి

▶ మొదటి పేజీ తరువాయి

తమ బాధ్యతలు నిర్వహిస్తున్నారని, రాజకీయ విమర్శలు సరికాదన్నారు.

ఆ తర్వాతే బదులిస్తా..: అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను క్లియర్ చేయట్లేదన్న విమర్శలను విలేకరులు ప్రస్తావించగా.. అన్ని బిల్లులను మదింపు చేసి పరిశీలించాల్సి ఉంటుందని, దీనికి అవసరమైన మేర సమయం తీసుకుంటానని తాను ఇప్పటికే చెప్పానని పేర్కొన్నారు. తన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఏడాది నుంచి ప్రొటోకాల్ పాటించడం లేదని, కనీసం జిల్లా కలెక్టర్లు సైతం తన పర్యటనల సందర్భంగా కలవడానికి రావడం లేదని చెప్పారు. ప్రొటోకాల్ ఎందుకు పాటించడం లేదన్న విషయంపై సీఎం కేసీఆర్ సమాధానమిచ్చిన తర్వాతే బిల్లులపైగానీ, ఇతర విషయాలపైగానీ తాను బదులిస్తానని చెప్పారు. సంప్రదాయం ప్రకారం ఏటా రాష్ట్రస్థాయిలో నిర్వహించే గణతంత్ర దిన వేడుకల్లో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది కోవిడ్ మహమ్మారిని కారణంగా చూపి వేడుకలను రాజ్‌భవన్‌కు పరిమితం చేసి సాదాసీదాగా నిర్వహించింది. దీనిపై గవర్నర్ తమిళిసై తీవ్ర విమర్శలు చేశారు. గణతంత్ర వేడుకల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తనను అవమానాలకు గురిచేసిందని ఆరోపించారు. ఇక గత ఏడాది రాష్ట్ర బడ్జెట్ సమావేశాలను గవర్నర్ ప్రసంగం లేకుండానే ప్రారంభించడాన్ని కూడా తప్పుపట్టారు. ఇప్పుడు మళ్లీ గణతంత్ర దినం, బడ్జెట్ సమావేశాలు వస్తుండటంతో.. గవర్నర్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. కాగా, ప్రధాని మోదీ రాసిన 'ఎగ్జామ్ వారియర్స్' పుస్తకాన్ని రాష్ట్రంలోని ప్రతి పాఠశాలలో పంపిణీ చేస్తామని, గ్రంథాలయాల్లో సైతం అందుబాటులో ఉంచుతామని గవర్నర్ చెప్పారు.

ప్రతి సమస్యకూ పరిష్కారం సహనంలోనూ.
క్షమాపణ అడగటంలోనూ ఉంది.
– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, జనవరి, 20

ఇది న్యాయం కోసం దంగల్

ఒలింపిక్స్, కామన్వెల్త్ క్రీడల లాంటి అంతర్జాతీయ వేదికలపై దేశానికి పతకాలు సాధించి వార్తల్లో వ్యక్తులుగా నిలవడం ఆ కుస్తీ ప్రవీణులకు అలవాటు. కానీ, ఇప్పుడు పూర్తి భిన్నమైన పరిస్థితుల్లో వారు, వారి ఆట వార్తల్లోకి ఎక్కాయి. భారత రెజ్లింగ్ సమాఖ్య పైన, దాని అధ్యక్షుడైన పాలక బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ వికృత వ్యవహారశైలి పైన ధ్వజమెత్తుతూ ఢిల్లీ నడిబొడ్డున బుధవారం నుంచి రెండు రోజులుగా 30 మందికి పైగా మహిళా రెజ్లర్లు నిరసనకు దిగేలా చేశాయి. అంతా కలిపి 200 మందికి పైగా అథ్లెట్లు నిరసనకు దిగడం, అనేక సంగతులు బయటపెట్టడం భారత క్రీడా చరిత్రలో మునుపెన్నడూ చూడని దృశ్యం. ముక్కున వేలేసుకొనేలా సందర్భం.

కామన్వెల్త్ క్రీడోత్సవాల్లో మూడుసార్లు స్వర్ణాలు సాధించిన వినేశ్ ఫోగాట్ కన్నీరు పెట్టుకుంటూ మహిళా అథ్లెట్లు ఎదుర్కొంటున్న దారుణాల్ని వివరిస్తుంటే గుండె మండిపోతుంది. అన్షూ మలిక్ లాంటి వారు బయటపెట్టిన సంగతులు ఆవేదన రేపుతాయి. సాక్షీ మలిక్, బజ్‌రంగ్ పునియా – ఇలా స్త్రీ పురుష తేడా లేకుండా అందరూ జరుగుతున్న అన్యాయాలను కెమెరాల సాక్షిగా ఏకరవు పెట్టాల్సి వచ్చింది. మహిళా రెజ్లర్లుండే హోటల్‌లోనే బస చేయడం, వారు గది దాటి స్వేచ్ఛగా బయటకు రావడానికైనా వీల్లేకుండా తన గది తలుపులు సదా తీసి ఉంచి, తన రోజువారీ పనులు చేసుకోవడం– ఇదీ సమాఖ్య అధ్యక్షుడి తీరు. ఇది నియమానుసారమే కాదు నైతికంగానూ సరికాదు.

బ్రిజ్ గత చరిత్రా గొప్పదేమీ కాదు. గతంలో ఆయన నేరసామ్రాజ్య నేత దావూద్ ఇబ్రహీమ్ బృందానికి సాయపడ్డారట. ఆ కేసులో తీవ్రవాద కార్యకలాపాల నిరోధక చట్టం కింద అరెస్టయ్యారు. దౌర్జన్యానికి మారుపేరై, ఇప్పటికి 6 సార్లు ఎంపీగా గెలిచారు. 2011 నుంచి పుష్కర కాలానికి పైగా కుర్చీలో ఉంటూ, కుస్తీ సమాఖ్యను సొంత జాగీరుగా మార్చుకొన్నారు. ఆటను అడ్డంపెట్టుకొని అవినీతి, అక్రమాలు, వేదికపై ఆటగాళ్ళను చెంపదెబ్బ కొట్టిన దౌర్జన్యాలు, అథ్లెట్లతో అనుచితవర్తనలు... ఇలా ఈ రాజకీయవాది ఘనతల చిట్టా సుదీర్ఘమైనది. సొంత ఊరు లక్నోలో, స్వగృహానికి దగ్గరలోనే సదా మహిళా అథ్లెట్ల శిబిరం పెట్టి, తానూ హాజరయ్యే మనోడి గురించి ఎంత చెప్పినా తక్కువే.

క్రీడావ్యవస్థలో ఇలాంటి దుష్టసంస్కృతి చిరకాలంగా ఉన్నదే. ఇటీవల ఏడు నెలల క్రితం కూడా అగ్రశ్రేణి భారత సైక్లింగ్ క్రీడాకారిణి ఒకరు తమ నేషనల్ టీమ్ కోచ్ నుంచి ఇలాంటి వేధింపులే ఎదుర్కొన్నారు. స్లొవేనియాలో క్రీడా శిక్షణా శిబిరంలో కోచ్ అనుచిత ప్రవర్తనపై ఆమె ఏకంగా 'భారత క్రీడా ప్రాధికార సంస్థ' (శాయ్)కు ఫిర్యాదు చేయాల్సి వచ్చింది. ఇటీవలే హర్యానాలో ఓ మహిళా కోచ్ స్వయానా ఆ రాష్ట్ర క్రీడా మంత్రి లైంగిక అత్యాచార పర్వాన్ని బట్టబయలు చేయడం గమనార్హం. ఇంకెన్నో వెలుగులోకి రాని ఫిర్యాదులున్నాయి. ఓ సినీ నటుడి అనుచిత ప్రవర్తనను ఒక హిందీ నటి బయటపెట్టే సరికి, తీగ లాగితే డొంకంతా కదిలినట్టు భారత్‌లో 'మీ టూ' ఉద్యమస్థాయికి చేరిన సంగతి 2018లో చూశాం. ఇప్పుడు కుస్తీ సమాఖ్య సారథి సహా కోచ్‌లపై లైంగిక వేధింపుల ఆరోపణ ఆట వెనుక దాగిన చీకటి కోణాన్ని బయటపెట్టింది.

నాలుగు పర్యాయాలు ఒలింపిక్ పతకాలు తెచ్చిపెట్టిన కుస్తీలోనే ఇలాంటి దారుణమైన పరిస్థితి ఉందంటే, ఇతర క్రీడల్లో పరిస్థితిని ఇట్టే ఊహించుకోవచ్చు. 72 గంటల్లో సమాధానం చెప్పాలంటూ కుస్తీ సమాఖ్యకు క్రీడాశాఖ తాఖీదు ఇచ్చింది. కానీ, బ్రిజ్‌ను తొలగించాలి, అథ్లెట్లతో మర్యాదగా ప్రవర్తించాలి, సమాఖ్యను సమూలంగా మార్చాలి లాంటి ఆటగాళ్ళ కనీస డిమాండ్లు తీర్చలేనివేమీ కావు. ఆ మాటకొస్తే సమాఖ్యలో ఇష్టారాజ్యంగా నియమాలు మారుస్తున్నారనీ, తమపై అనవసరమైన అధిక నిఘా ఉంచుతున్నారనీ అథ్లెట్లు చేస్తున్న ఆరోపణలకు బ్రిజ్ బృందం జవాబివ్వాల్సి ఉంది. కానీ, వేధింపుల బాధితులు బాహాటంగా చెప్పాలనీ, సాక్ష్యాలతో నిరూపిస్తే ఉరిశిక్షకైనా సిద్ధమనీ ఆయన అనడం చట్టం ముందూ నిలవని బుకాయింపే. ఇదంతా కాంగ్రెస్ నిర్వాకమనే ఆరోపణ, యూపీ వర్సెస్ హర్యానా వాదన అలాంటివే.

ఆరోపణలు హోరెత్తుతున్నా బ్రిజ్ రాజీనామా చేయకపోవడం విడ్డూరం. ఇక స్వయంగా క్రికెటరైన క్రీడామంత్రి అనురాగ్ ఠాకూర్ రెండోరోజు రాత్రి దాకా నోరెందుకు విప్పలేకపోయారో అర్థం కాదు. ఇన్నేళ్ళుగా కుస్తీ సమాఖ్య సహా అనేక చోట్ల లైంగిక వేధింపుల విచారణ కమిటీలు పెట్టకున్నా ఎలా చూస్తూ కూర్చున్నారో తెలీదు. పాలకులు పతకాల విజేతలతో ఫోన్‌లో మాట్లాడుతూ, ఫోటోలకు పోజులిస్తే చాలదు. బేటీ బచావో... మాటల్లో కాదు, చేతల్లో చూపాలి. దేశవ్యాప్తంగా బ్రిజ్ కనుసన్నల్లో సాగుతున్న సమాఖ్య కార్యవర్గాలన్నిటినీ రద్దు చేయాలి. నిపుణులు సారథ్యం వహించాల్సిన క్రీడాసంస్థల్ని ఇకనైనా రాజకీయాలకూ, ఇలాంటి రాజకీయవాదులకూ దూరంగా ఉంచాలి.

అథ్లెట్ల నిరసనకు తలొగ్గి, సమాఖ్యలో అక్రమాలను విచారించడానికి క్రీడాశాఖ త్రిసభ్య సంఘం వేసిందట. అయితే, అది చాలదు. వేధింపులతో వ్యవహారం బరి దాటి నేరాల గిరిలోకి చేరింది. దీనిపై సీబీఐతో సమగ్ర దర్యాప్తు జరపించాల్సిందే, వ్యవస్థను సమూలంగా ప్రక్షాళించాల్సిందే. ధర్మం కోసం, న్యాయం కోసం... కడకు కనీసపాటి గౌరవం కోసం మహిళలు ఇవాళ్టికీ వీధికెక్కాల్సి వస్తోందంటే అది మన దేశానికే అవమానం. అంతర్జాతీయ బరిలో విజేతలైన ఈ వీరాంగనలు ఈ ఆత్మగౌరవ దంగల్‌లోనూ విజయం సాధించాలి. సమాజంలో పురుషోన్మాద దృక్పథాన్ని మార్చాలి. ఆటల గద్దెపై రాజకీయ గద్దలకు పని లేకుండా క్రీడాసంస్థలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు రావాలి. నిజాయతీ ఉంటే... ఎప్పుడో కాదు, ఇప్పుడే ఆ విధానపరమైన మార్పులకు పాలకులు నడుం బిగించాలి.

రావాల్సిన 'చిరు' విప్లవం

విశ్లేషణ



దేవిందర్ శర్మ

ఐక్యరాజ్యసమితి 2023ను చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. కిలో బియ్యం పండించేందుకు 3–5 వేల లీటర్ల నీళ్లు అవసరం కాగా, చిరుధాన్యాలకు 200 లీటర్లు చాలు. వాటి పర్యావరణ హితాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులకు కనీస మద్దతు ధర నిర్ణయించాలి. ఆంధ్రప్రదేశ్‌లో 'టీటీడీ' ఆధ్వర్యంలో 11 ధార్మిక ప్రాంతాలకు వీటిని అందించేట్టుగా చేసుకున్న ఒప్పందం లాంటిది పంజాబ్ లాంటి రాష్ట్రాలు అనుసరించవచ్చు. చిరుధాన్యాల హల్వా, పాయసాలు ప్రసాదంగా మంచి ప్రత్యామ్నాయాలు. దేశంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 12 కోట్ల మంది చదువుకుంటున్నారు. మధ్యాహ్న భోజనంలో వారంలో ఒక పూటైనా చిరుధాన్యాలు అందిస్తే వీటి డిమాండ్ పెరిగి, రైతులను ఆ దిశగా మళ్లేట్టు చేస్తుంది.

ఈ ఏడాదిని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా జరుపుకోవాలని ఐక్యరాజ్య సమితి తీర్మానించింది. దీంతో ఈ అద్భుత సిరిధాన్యాలపై మరోసారి అందరి దృష్టి కేంద్రీకృతం కానుంది. 2023 ఏడాది ముగిసేలోపు ఈ చిరుధాన్యాలను తృణప్రాయంగా పక్కనబెట్టే మానసిక స్థితి నుంచి అందరూ బయటపడతారని నేనైతే నమ్మకంగా ఉన్నాను. ప్రతిగా... ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న అదృశ్య ఆకలి ప్రమాదాన్ని భారత్ కూడా సమర్థంగా ఎదుర్కొనే అవకాశం లభిస్తుంది.

ఒకప్పుడు వీటిని తృణధాన్యాలని పిలిచేవారు. ఇవి ముతకగా ఉండవచ్చునేమో కానీ, ఆరోగ్యానికి హాని చేసేవి కాదు. నిజానికి పోషకాలతో నిండి ఉంటాయి. వాతావరణాన్ని తట్టుకోగల తెలివైన పంటలు కూడా. మెట్ట, వర్షాధారిత ప్రాంతాల్లో ఎంచక్కా పండించుకోవచ్చు. చిరుధాన్యాల జాబితాలోకి సజ్జలు, జొన్న, రాగులతోపాటు ఇతర చిన్న సైజు గింజలుండే ఆరు ధాన్యాలు(కొర్ర, అండుకొర్ర, అరికె, ఊద, సామ, వరిగ) వస్తాయి. చాలాకాలంగా వీటిని ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం చేశారు. యూరోపియన్ లేదా అమెరికన్ ఆహార శైలుల్లోకి ఇవి ఇమడకపోవడం ఒక కారణం.

సంప్రదాయ సాగు నుంచి మళ్లించాలి...

అయితే మిల్లెట్స్ నెట్‌వర్క్ ఆఫ్ ఇండియా తదితర పౌర సమాజ వర్గాలు చిరుధాన్యాల ప్రయోజనాలపై చేసిన విస్తృత స్థాయి ప్రచారం పుణ్యమా అని ఇప్పుడు వీటికి మరోసారి ప్రాధాన్యం ఏర్పడుతోంది. ప్రజా పంపిణీ వ్యవస్థలోకి వీటిని చేర్చడం కారణంగా ఇప్పుడు వైవిధ్యభరిత ఆహార, పంటల వ్యవస్థలకు మార్గం సుగమమైంది. చిరుధాన్యాల లాభాల గురించి కొత్తగా చెప్పాల్సిందేమీ లేదు. ఈ ఏడాదిలో వీటి గురించి మరింత వింటాం కూడా. ప్రజల్లో అవగాహన మరింత పెంచడం, దిగుబడుల పెంపు, ఆహార శుద్ధికి అవకాశాలు కల్పించడం, సేకరణ మెరుగుపరచడం వంటి అంశాలపై ఈ ఏడాది చర్చోపచర్చలు జరగనున్నాయి. అయితే చిరుధాన్యాల సాగును మరింతగా పెంచాలంటే, నీటి అవసరాలు ఎక్కువగా ఉండే వరి సాగు నుంచి రైతులను మళ్లించాల్సి ఉంటుంది. ఇందుకోసం చిరుధాన్యాల సాగు రైతులకు లాభదాయకంగా ఉండాలి. అయితే ఇది చెప్పినంత సులువైన పనేమీ కాదు. సంప్రదాయ పంటల సాగు నుంచి రైతును ఇంకో దిశకు మళ్లించడం కోసం గతంలోనూ కొన్ని విఫలయత్నాలు జరిగిన విషయం ఇక్కడ చెప్పుకోవాలి.

ఒక కిలో బియ్యం పండించేందుకు ప్రాంతం, వాతావరణాలను బట్టి మూడు నుంచి ఐదు వేల లీటర్ల నీరు అవసరమవుతుంది. కానీ చిరుధాన్యాల విషయంలో నీటి అవసరం కేవలం 200 లీటర్లు మాత్రమే. పైగా వీటి సాగులో రసాయన ఎరువులు, క్రిమి, కీటక నాశినుల వాడకమూ పెద్దగా ఉండదు. పోషకాలూ మెండుగా ఉంటాయి. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని 'కమిషన్ ఫర్



అగ్రికల్చర్ కాస్ట్స్ అండ్ ప్రైజెస్' (సీఏసీపీ) చిరుధాన్యాల ధరల నిర్ణయానికి కొత్త ఫార్ములాను రూపొందించాలి. పర్యావరణానికి చిరుధాన్యాలు అందించే తోడ్పాటును కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. వినియోగదారుడికి అందే ధరలో రైతుకు దక్కేది కొంతే కాబట్టి ధరలు నిర్ణయించే తీరు మారడం ప్రాముఖ్యత సంతరించుకుంటుంది. పండించే పంటకు కచ్చితంగా కొంచెం పెద్ద మొత్తంలోనే ధర లభిస్తుందని తెలిస్తే రైతుకూ, సమాజానికీ లాభం.

స్ఫూర్తిదాయకమైన ఏపీ మోడల్

చిరుధాన్యాలకు మద్దతుధరలు కొత్తగా నిర్ణయించడంతోపాటు వరి పంటకు పేరెన్నికగన్న పంజాబ్ లాంటి రాష్ట్రాల్లో చిరుధాన్యాల సాగును పెంచాలి. 1950లో అవిభాజ్య పంజాబ్‌లో సుమారు 11 లక్షల హెక్టార్లలో సజ్జలు సాగవుతూండేవి. ఇప్పుడు ఇది వెయ్యి హెక్టార్ల కనిష్ఠానికి పడిపోయింది. గోధుమ, వరి పంటలను మార్చి మార్చి వేయడమన్న విధానానికి ప్రాధాన్యం ఇవ్వడం వల్ల పరిస్థితి ఇంతకు దిగజారింది. పప్పులు, నూనెగింజలతోపాటు చిరుధాన్యాల సాగు మళ్లీ చేపట్టడం మేలైన ముందడుగు అవుతుంది. ఇలా పంటల వైవిధ్యానికి చిరుధాన్యాలు చేర్చడం వల్ల ఎన్నో ప్రయోజనాలుంటాయి. పర్యావరణ విధ్వంసానికి కారణమైన హరిత విప్లవ దుష్పరిణామాలను చక్కదిద్దగలగడం ఒకటైతే... చిరుధాన్యాలకు డిమాండ్ పెంచడం రెండోది.

చిరుధాన్యాల సాగు విషయంలో ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న పరిణామాలను పంజాబ్ పరిగణనలోకి తీసుకోవడం మంచిది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలోని 11 ధార్మిక ప్రాంతాల్లో సెంటర్ ఫర్ సస్టెయినబుల్ అగ్రికల్చర్ (సీఎస్ఏ), రైతు సాధికార సంస్థ, ఏపీ మార్క్‌ఫెడ్ కలిసికట్టుగా ఒక ఒప్పందం చేసుకున్నాయి. ఇందులో భాగంగా 12 రకాల పంటలను 15,000 టన్నుల మేరా సహజసేద్య విధానంలో అందించాలి. ఇందులో భాగంగా కనీస మద్దతు ధర కంటే పది శాతం ఎక్కువ ధర రైతుకు లభించనుంది. ఒకవేళ మార్కెట్‌లో ఆయా పంటకు ఎక్కువ ధర ఉంటే... అదనంగా ఇంకో పదిహేను శాతం చెల్లిస్తారు. కర్ణాటకలోనూ గతంలో రాగుల సాగును ప్రోత్సహించేందుకు కనీస మద్దతు ధర కంటే 40 శాతం ఎక్కువ చెల్లించారు.

పంజాబ్‌లోని వేల గురుద్వారాలను దృష్టిలో ఉంచుకుంటే చిరుధాన్యాలకు, అదికూడా సేంద్రీయ ఉత్పత్తులకు మంచి డిమాండే ఉంటుంది. శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ వంటి సంస్థల సాయంతో సేంద్రీయ లంగర్ ఏర్పాటుకు ప్రయత్నించవచ్చు. ఇందులో వడ్డించే ఆహార పదార్థాల్లో చిరుధాన్యాలను చేర్చవచ్చు. ఆ మాటకొస్తే చిరుధాన్యాల హల్వా, పాయసాలు ప్రసాదంగా మంచి ప్రత్యామ్నాయాలవుతాయి. చిరుధాన్యాల సక్రమ నిల్వ, సరఫరాల బాధ్యతను మార్క్‌ఫెడ్ వంటి సంస్థలకు పంజాబ్ అప్పగించవచ్చు. ఖేతీ విరాసత్ మిషన్ వంటి లాభాపేక్ష లేని సంస్థలకు సేంద్రీయ వ్యవసాయ సముదాయాల ఏర్పాటు పనులు అప్పగించవచ్చు. నాణ్యతను నిర్ధారించేందుకు అవసరమైన చర్యలూ సులువుగా చేపట్టవచ్చు.

పాఠశాలల డిమాండ్ కూడా చేరితే...

పంజాబ్‌లో సుమారు 30 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. వీరికందించే మధ్యాహ్న భోజన పథకంలో ప్రారంభంలో వారానికి ఒకసారి చిరుధాన్యాలను కూడా చేరిస్తే విపరీతమైన డిమాండ్ ఏర్పడుతుంది. తద్వారా స్థానికంగానే వీటి సరఫరాకు అవకాశం ఏర్పడుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో టీటీడీ నిర్ణయించినట్లే చిరుధాన్యాలను పంజాబ్‌లోనూ స్థానిక రైతుల నుంచి మాత్రమే సేకరిస్తామని చెప్పవచ్చు. కేంద్ర పాలిత ప్రాంతమైన చండీగఢ్‌లో సుమారు 110 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీరికి వారంలో ఒకసారి చిరుధాన్యాలను వడ్డిస్తున్నారు. అయితే ఈ డిమాండ్‌ను తట్టుకోవడం కష్టమవుతోంది. పంజాబ్ మొత్తమ్మీద చిరుధాన్యాలను వడ్డిస్తే పరిస్థితి ఎలా ఉండనుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. పాఠశాలలు, గురుద్వారాలతో ఏర్పడే డిమాండ్‌ను తట్టుకునేందుకు పంజాబ్ ప్రభుత్వం, రైతులు ఏదో ఒక మాయ కచ్చితంగా చేయగలరు.

జాతీయ స్థాయిలో చూస్తే సుమారు 12.7 లక్షల ప్రభుత్వ పాఠశాలల్లో 12 కోట్ల మంది చదువుకుంటున్నారు. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా వీరందరికీ చిరుధాన్యాలు ఏదో ఒక స్థాయిలో అందించడం రైతులను చిరుధాన్యాల సాగుకు మళ్లించేందుకు మేలిమి మార్గం కాగలదు. పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రార్థనాలయాల సాయంతో చిరుధాన్యాల సాగు, వినియోగాన్ని పెంచడం సుసాధ్యమవుతుంది. పంజాబ్ ఈ దిశగా అడుగులేసి దేశంలో చిరుధాన్యాల విప్లవాన్ని సృష్టించాలని ఆశిద్దాం!

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ రంగ నిపుణులు
ఈ–మెయిల్: hunger55@gmail.com

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

గుడ్‌బై జెసిండా



న్యూజిలాండ్ ప్రధాన మంత్రిగా జెసిండా ఆర్డెన్ రాజీనామా చేశారు. "సత్యానికి సంబంధించిన ఏకైక సోర్సుగా మేము కొనసాగుతాం. మా నుంచి విననట్టయితే అది సత్యం కాదు," అని ప్రకటించారామె. స్వేచ్ఛా సమాజానికి ఆటంకంగా నిలిచిన ఆమె పాలనకు గుడ్‌బై.

– జేమ్స్ మెల్‌విల్, కామెంటేటర్

నమ్మకం కలుగుతోంది



విమానం ఎక్కుతున్నప్పుడు, నా చేతిలో పుస్తకం ఉండటం గమనించిన స్టివార్డెస్, "ఏం చదువుతున్నారు?" అని అడిగింది. నాకు ఆశ్చర్యమేసింది. ఎందుకంటే మన దేశంలో ఎవరూ చదవరు. పుస్తకాల మీద ఆసక్తి చూపరు. పుస్తకాన్ని చూపిస్తూ, 'చదివారా' అని అడిగాను. 'అవును' అని చెప్పింది. అయితే ఇంకా మనకు పుస్తకాలు చదివే ఉత్తేజకర యువ మెదళ్లున్నాయి.

– సల్మాన్ రషీద్, ఫెలో

ఇతరులను అంగీకరించేలా...



మా పోరాటం కేవలం 'ఎల్జీబీటీక్యూఐఏ' కమ్యూనిటీ జీవితాల్ని మెరుగుపర్చడం అని జనం పొరపడుతుంటారు. దానికంటే మించి 'సిస్‌జెండర్' (జన్మతః వచ్చిన లింగం) కమ్యూనిటీని మెరుగైన వ్యక్తులుగా మార్చాలన్నది మా ప్రయత్నం. అప్పుడు వాళ్లు 'ఇతరుల' ప్రేమ, సంతోషాల్ని అంగీకరించగలరు.

– ఓనీర్, ఫిలింమేకర్

పెరిగిన గౌరవం



జెసిండా ఆర్డెన్ పదవిలోంచి దిగిపోవడం నిరుత్సాహం కలిగించింది. కానీ ఆమె మీద మరింత గౌరవం పెరిగింది.

– ప్రియాంకా చతుర్వేది, రాజ్యసభ ఎంపీ

ఇవి చేస్తే...



ఒక మంచి రాత్రి నిద్ర, రోజంతా ఆరోగ్యకరమైన తిండి, మంచి బయటి నడక వల్ల కనీసం 90 శాతం మనం సమస్యలుగా గుర్తించినవి ఇంద్రజాలంలా మాయమైపోతాయి.

– మార్క్ మాన్సన్, రచయిత

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్‌బాక్స్

అనుమానాలు సహజమే!

2019 సార్వత్రిక ఎన్నికల నాటికి దేశవ్యాప్తంగా 91.2 కోట్ల మంది ఓటర్లు ఉంటే... వారిలో 32.6 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకోలేదు. ఇందుకు అనేక కారణాలు. అందులో ముఖ్యమైనది బతుకు తెరువు కోసం వలస పోవటం. ఓటింగ్ శాతంపై సుప్రీంకోర్టుకు కూడా అనేక వినతులు అందాయి. వ్యాజ్యాలూ దాఖలయ్యాయి. ఆ నేపథ్యంలోనే 2015లో సుప్రీంకోర్టు ఓటింగ్ శాతం పెంచే విషయాన్ని పరిశీలించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని (సీఈసీ) ఆదేశించింది.

దీంతో ఎన్నికల సంఘం అనేక అంశాలను పరిశీలించింది. ఇప్పటికే పరోక్ష ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్, ఇంటర్నెట్ ఓటింగ్, ముందస్తు ఓటింగ్ వంటి విధానాలు అమల్లో ఉన్నాయి. అయితే ఆ విధానాలను అత్యధికులు ఉపయోగించుకోవడం అంత తేలికైన విషయం కాదు. ఇప్పుడు కోట్లాదిగా ఉన్న వలస ఓటర్ల కోసం కేంద్ర ఎన్నికల సంఘం, ఒకేసారి అనేక (72) నియోజకవర్గాల పరిధిలో ఉన్నవారు రిమోట్ ఓటింగ్ మిషన్ (ఆర్‌వీఎం)ను ఉపయోగించి ఓటువేయడానికి అవకాశం కల్పించాలని ప్రతిపాదించింది. ఈ ఆర్‌వీఎంలను పరిశీలించేందుకు, వాటి పనితీరుపై అభ్యంతరాలను తెలిపేందుకు, జనవరి 16, సోమవారం ప్రయోగాత్మక పరిశీలనా ప్రదర్శనకు రావాల్సిందిగా కేంద్ర ఎన్నికల సంఘం.. గుర్తింపు పొందిన 8 జాతీయ పార్టీలను, 57 రాష్ట్ర పార్టీలను ఆహ్వానించింది. పరిశీలన తర్వాత తమ అభిప్రాయాలను రాతపూర్వకంగా జనవరి 31 నాటికి అందించాలని ఈసీ కోరింది. అయితే ఆదివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో 16 ప్రతిపక్షాలు సమావేశమై తాము ఆర్‌వీఎంలను వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించాయి. ఇప్పటికే అనేక పార్టీలు ఆర్‌వీఎంల అవసరం లేదని పేర్కొన్నాయి. దీంతో ఆర్‌వీఎంలపై మరింత చర్చించి తమ అభిప్రాయాలను చెప్పాలని ఎన్నికల కమిషన్ ఫిబ్రవరి 28 వరకు గడువు పొడిగించింది. ఈవీఎంలపై అనుమానాలే పూర్తిగా తగ్గని వేళ, ఈ ఆర్‌వీఎంలపై మరిన్ని సందేహాలు రావడం సహజమే.

– డాక్టర్ తాతా సేవకుమార్, సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్

'ప్రగతిశీల' శక్తులన్నీ ఒక్కటి కావాలి!

హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం కేంద్రంగా 1974లో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఏర్పడి మరో ఏడాదికి 50 ఏళ్లు నిండనున్నాయి. అసమానమైన పోరాటాలతో, త్యాగాలతో ఇరు రాష్ట్రాల ప్రజలపై పీడీఎస్‌యూ చూపిన ప్రభావం ఎవ్వరూ చెరపలేనిది. ఈ సంస్థకు రాష్ట్ర ఉపాధ్యక్షునిగా 1980 దశకం నాటికే నా ప్రత్యక్ష నిర్మాణ సంబంధం ముగిసిపోయింది. కానీ సోదరుడు కామ్రేడ్ కూర రాజన్న ద్వారా మా ఇంటి తలుపు తట్టిన అమరుడు కామ్రేడ్ జార్జిరెడ్డి జ్ఞాపకం, ఎంతోమంది గుండెల్ని రగిలించిన ఆయన ప్రస్థానం... నేను పుట్టి పెరిగిన సిరిసిల్ల ప్రాంత రైతాంగ పోరాటాల వెల్లువతో పెనవేసుకు పోయింది. అదే విప్లవోద్యమంతో ముడిపడి పోయి రెండు తరాల విప్లవ విద్యార్థులతో నా ఇన్నేండ్ల ప్రయాణాన్ని నిర్దేశిస్తూ వస్తోంది. అందుకే నాకిది జ్ఞాపకం మాత్రమే కాదు, వర్తమాన నిజం. అలాంటి జ్ఞాపకాలన్నింటినీ తట్టిలేపుతూ, గతం–వర్తమాన పరిస్థితులను బేరీజు వేసుకుంటూ 2023 జనవరి 21న, పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరగడం అపూర్వమనే భావించాలి.



కామ్రేడ్ జార్జిరెడ్డి ఆధ్వర్యాన ఏర్పడిన పీడీఎస్‌యూ, ఆయన అమరుడైన ఏప్రిల్ 14 (1974)ననే పీడీఎస్‌యూగా ఆవిర్భవించింది. అది మొదలు అధిక ధరలపై, పలు సమస్యల సాధనకై పోరాడింది. కామ్రేడ్స్ భూమయ్య, కిష్టాగౌడ్‌ల ఉరిశిక్షల రద్దుకై ఉద్యమించింది. రైల్వే కార్మికుల సమ్మెకు మద్దతుగా నడిచింది. శ్రీకాకుళ గోదావరి లోయ పోరాటాలకు సంఘీభావంగా నిలిచింది. శ్రామికవర్గ అంతర్జాతీయతను ఎలుగెత్తి చాటి, ప్రపంచ పౌరుడిగా అవతరించిన చేగువేరా త్యాగనిరతిని పునికి పుచ్చుకుంది. అందుకే మతోన్మాదుల చేతుల్లో జార్జ్, చాంద్ పాషాల హత్యలు మొదలు... రాజ్యమే యుద్ధం ప్రకటించడంతో జంపాల, శ్రీపాద శ్రీహరిల నుండి చంద్రశేఖర్, రియాజ్‌ల వరకూ డజనుల కొలది విద్యార్థి వీరులు అమరులైనారు. మరి ఎంతోమంది విద్యాలయాల నుండి పయనమై సమాజపు విముక్తిలో అంతర్భాగమైనారు. ఇందులో కొందరు తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో నిలబడి బూర్జువా పార్లమెంటరీ రాజకీయాల్లో కీలకంగా ఎదిగారు. ఈనాడు విప్లవ విద్యార్థి ఉద్యమం ఎదుర్కొంటున్న సమస్యల ప్రత్యేక సందర్భంలో పలు పీడీఎస్‌యూలన్నీ ఒకే తాటి మీదకు రావడమనేది, ప్రధాన ఎజెండా కావాలనేది నా అభిప్రాయం.

ఇప్పుడు గతం కంటే తీవ్రంగా యావద్దేశం హిందుత్వ రాజకీయాల ఫాసిస్టు దాడికి గురవుతోంది. ప్రారంభం నుండీ ఇలాంటి ఉన్మాద దాడుల్లోనే రక్తసిక్త పసిగుడ్డుగా పుట్టిన పీడీఎస్‌యూ అనతి కాలంలోనే ఎమర్జెన్సీ ఫాసిస్టు దాడికి గురయ్యింది. చితాభస్మంలోంచి లేచిన ఫినిక్స్ పక్షిలాగా మారిన పీడీఎస్‌యూ నేడు అప్రకటిత ఎమర్జెన్సీని ఎదుర్కొంటూనే మునుముందుకు సాగుతోంది. అయితే పీడీఎస్‌యూలో సంభవించిన చీలికలు ఉద్యమ గమనం మందగించడానికి కారణమయ్యాయి.

నాకు సమకాలికులుగా ఉన్న చాలామంది కామ్రేడ్స్ ప్రత్యక్షంగా ఎదుర్కొన్న 1984 నాటి చీలికను చూసి కొందరు పీడ విరగడయిందని (గుడ్ రిడెన్స్) భావించిన వాళ్లున్నారు. కానీ అసలు పీడ అక్కడ నుండే మొదలయ్యింది. ఆ తర్వాతి 45 ఏళ్లలో 1986 రాజీవ్‌గాంధీ నూతన విద్యా విధానం, రిజర్వేషన్లు, ఎల్పీజీ, విద్యా కాషాయీకరణ – కార్పొరేటీకరణ లాంటి ఎన్నో పరిణామాలు వచ్చాయి. విద్యాహక్కు చట్టం తర్వాత కూడా ఎన్నో పాఠశాలలు మూసివేయబడి, సార్వజనీన విద్య (కామన్ స్కూల్ ఎడ్యుకేషన్) అనేది కనుమరుగై పోయింది. వాటన్నిటిపై ప్రగతిశీల విద్యార్థి ఉద్యమం బలాబలాలు మన కళ్ళకు కట్టినట్టు కనిపిస్తున్నాయి.

రెండు తరాలూ... అధిక ధరలు, ఆకలి చావులు, అన్నార్తుల ఆవేదనలు, దేశ సంపదను దోచుకెళ్తున్న పిడికెడు మంది బడా దోపిడీదారులకు వ్యతిరేకంగా సాగే పోరాటాలతో మమేకం కావాలని కోరుకోవడం ఆహ్వానించతగ్గది. సమ్మేళనం బాధ్యతను నెత్తికెత్తుకున్న నిర్వాహకులకు విప్లవాభినందనలు. ఇది బయటి వ్యక్తి మాటగా కాకుండా మీతో నేను, నాతో మీరుగానే స్వీకరించాలని నా విజ్ఞప్తి.


– అమర్

(రేపు పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందర్భంగా)

తల్లీ! నీ కీర్తి అజరామరం

తల్లీ... నీకు 75 సంవత్సరాలు. నీ ఒడిలో అక్షరాలు దిద్దుకున్న ఎందరో నీ కీర్తి పతాకను వినువీధుల్లో ఎగురవేశారు. అంతర్జాతీయ వ్యవసాయరంగ చిత్ర పటంలో నిన్ను నిలిపారు. సముచిత స్థానం కల్పించి నిన్ను గర్వపడేలా చేశారు. వరిలో జయ, హంసలతో శాస్త్రి, సాంబ మాషూరితో ఎం.వి. రెడ్డి; స్వర్ణతో రామచంద్రరావులు సుపరిచితులు. జొన్న పంటకు జీవం తెచ్చిన గంగా ప్రసాదరావు, చిరుధాన్యాలను ఇంటి పేరు చేసుకున్న హరి నారాయణలు నీ బిడ్డలే. మీ పిల్లలు మామూలు వాళ్ళు కారు. కాలాన్ని బట్టి, పంటలను శాసించి, వాటిలో మార్పులు తెచ్చి రైతుకు భరోసా ఇచ్చారు. చెరకును పీల్చి పిప్పి చేసి రైతుకు తియ్యని రసం అందించిన కోటికలపూడి నుంచి జరుగుల దాకా అందరూ నీ చనుబాలు తాగిన వారే. నరసింహ, బ్రహ్మ, ప్రత్తి రవీంద్ర నాథ్ నుండి జెన్నీ జాదు జాక్పాట్ వరకు... ఇలా చెప్పుకుంటూ పోతే నీ పిల్లల ఘన చరిత అనంతం. నేర్చిన విద్య, సంపద అంతా సమాజానికి సమంగా చెందాలనే ఉన్నత ఆశయంతో వెన్నెల పంచిన వేమూరి చంద్ర శేఖరుడు, ప్రాణత్యాగం చేసిన గోపబోయిన ప్రసాద్‌లు కూడా నీ ఒడిలో అక్షరాలు దిద్దినవారే.

నీ 50 ఏళ్ల ప్రస్థానాన్ని ఒక కమనీయ దృశ్య రూపకంగా మలచి దూరదర్శన్ ద్వారా ప్రసారం చేసిన బొగ్గవరపు, హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రం ద్వారా ఒక సంవత్సర కాలం పాటు నీ స్వర్ణోత్సవ గీతం ఆలపించిన ఈలప్రోలు, వాతావరణ మార్పులకు సంబంధించి విశ్వానికంతటికీ సలహాలు, సూచనలు ఇస్తున్న శివుడూ, శ్రీనివాసుడూ ఇద్దరూ నీ పిల్లలే కావటం ఒకింత గర్వ కారణమే కదా! కనుచూపు మేర పరిపాలన, శాంతి భద్రతలు, పర్యావరణం, అడవులు, రైల్వేలు, గనులు, మీడియా, కస్టమ్స్, ఆదాయ పన్ను, బ్యాంకింగ్, ఆర్థిక, వాణిజ్య, వ్యాపార, రాజకీయ, పారిశ్రామిక, సామాజిక, సేవా రంగాలలో ఆరితేరిన మెరికలుగా గుర్తింపు పొందిన వారంతా నీ ఒడిలో పెరిగిన పిల్లలే. అయ్యంగార్ ఇండోర్ స్టేడియం ఇచ్చారు. గోవింద రాజులు నాబార్డ్ తరఫున ఓ పెద్ద భవనం ఇచ్చారు.



బాపట్ల వ్యవసాయ కళాశాల

కరోనా ప్రభావం తగ్గాక నీ పిల్లలు ప్రత్యేక రీతిలో సావనీర్‌లు తెస్తున్నారు. 1962, 1969, 1972, 1997, 1977, 1978 బ్యాచ్‌లు వారి వారి అనుభవాలను కలబోసుకున్నారు. అంతకుముందే 1964 వారు ప్రచురించిన సావనీర్ అందరికీ రోల్ మోడల్ అయింది కూడా. కరోనా అంటే నీ కెందుకు భయం. కరోనాకు చెక్ పెట్టేందుకు సీసీఎంబీ తయారు చేసిన ఎంఆర్ఎన్ఏ టీకా శాస్త్రవేత్తల బృంద నాయకులు నాళం మధు... బాపట్ల ఒడిలో నీవు లాలించిన బిడ్డే కదమ్మా. పిల్లలు అంతా ఇలా ఒకరిని చూసి మరొకరు గుంపులు గుంపులుగా కలుస్తూ ప్రస్తుతం కళాశాలలో ఉన్న నాలుగు బ్యాచ్‌లకూ స్ఫూర్తినిచ్చేందుకు ప్లాటినం జూబిలీ ముగింపునకు తరలి వస్తున్నారు. గత వైభవం అంతా ఈ తరానికి అందించి, వారూ స్ఫూర్తి పొంది, మంచి భవిష్యత్‌కు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకుని ముందుకు సాగుతారని. అందుకే అమ్మా... నీ బిడ్డలు వారి వారి బ్యాచ్‌ల పేరుతో గోల్డ్ మెడల్స్ ఏర్పాటు చేసింది. తప్పులుంటే మమ్ము క్షమించు తల్లీ!

– వలేటి గోపీచంద్, 1980 బ్యాచ్ విద్యార్థి । 94412 76779

(రేపు బాపట్ల వ్యవసాయ కళాశాల ప్లాటినం జూబిలీ ఉత్సవాల ముగింపు వేడుక)

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం, తిథి: బ.త్రయోదశి ఉ.7.55 వరకు, తదుపరి చతుర్దశి తె.5.40 వరకు, నక్షత్రం: మూల ఉ.11.14 వరకు, తదుపరి పూర్వాషాఢ, వర్జ్యం: ఉ.9.44 నుండి 11.14 వరకు, తదుపరి రా.8.11 నుండి 9.43 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.53 నుండి 9.43 వరకు, తదుపరి ప.12.34 నుండి 1.18 వరకు, అమృతఘడియలు: తె.5.10 నుండి 6.13 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.39, **సూర్యాస్తమయం:** 5.44

వైద్య విద్యార్థుల గోస



టీఆర్ఆర్ మెడికల్ కాలేజీలో అడ్మిషన్లు రద్దు

150 మంది ఎంబీబీఎస్ విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరం

- ఇతర కాలేజీల్లో సర్దుబాటు చేసినా ఫీజు బదిలీ చేయని కాలేజీ యాజమాన్యం
- ఇతర కాలేజీల్లో మళ్లీ ఫీజు చెల్లించాల్సిన దుస్థితి
- ఏడుగురు విద్యార్థులైతే వైద్య విద్యకే స్వస్తి చెప్పారు
- రసీదులతో వస్తే న్యాయం చేస్తాం: కాళోజీ వర్సిటీ

టీఆర్ఆర్ మెడికల్ కాలేజీలో అడ్మిషన్లు రద్దయిన ఎంబీబీఎస్ ఫస్టియర్ విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వారిని వివిధ మెడికల్ కాలేజీల్లో సర్దుబాటు చేసినా, ఆ కాలేజీ నుంచి ఫీజు బదిలీ జరగకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. సర్దుబాటు చేసిన కాలేజీలకు ఫీజు చెల్లించకపోతే మొదటి ఏడాది పరీక్ష రాసేందుకు వీలు లేకుండా పోతుంది. ఈ నేపథ్యంలో తమకు న్యాయం చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. టీఆర్ఆర్ యాజమాన్యం ఫీజు డబ్బులు బదిలీ చేయకపోవడం లేదా వెనక్కు ఇవ్వకపోవడంతో ఏకంగా బీ, సీ కేటగిరీలకు చెందిన ఏడుగురు విద్యార్థులు వైద్య విద్యకు స్వస్తి చెప్పాల్సివచ్చిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. - సాక్షి, హైదరాబాద్

ఎవ్వరికీ పట్టని విద్యార్థుల గోడు

2021–22 వైద్య విద్యా సంవత్సరంలో ప్రమాణాలకు అనుగుణంగా సౌకర్యాలు లేవంటూ రాష్ట్రంలో మూడు మెడికల్ కాలేజీల్లోని మొదటి ఏడాది ఎంబీబీఎస్ అడ్మిషన్లను జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) రద్దు చేసిన సంగతి తెలిసిందే. సంగారెడ్డిలోని ఎంఎన్ఆర్, పటాన్‌చెరులోని టీఆర్ఆర్, వికారాబాద్‌లోని మహవీర్ కాలేజీల్లో మొదటి ఏడాదికి చెందిన మొత్తం 450 ఎంబీబీఎస్ సీట్లను ఎన్ఎంసీ రద్దు చేసింది. దాంతో ఆయా కాలేజీల్లో చేరిన వైద్య విద్యార్థులు అడ్మిషన్లు పొందిన నెలకే రోడ్డున పడ్డారు. వాటిల్లో తొలి ఏడాది చేరిన వైద్య విద్యార్థులు అంతా కలిపి రూ.66 కోట్లు చెల్లించారు. తర్వాత టీఆర్ఆర్, మహవీర్ మెడికల్ కాలేజీలకు చెందిన 300 మంది (ఒక్కో మెడికల్ కాలేజీకి చెందిన 150 మంది) విద్యార్థులను 13 ప్రైవేట్ కాలేజీల్లో సర్దుబాటు చేశారు. ఎమ్మెన్నార్ కాలేజీ విద్యార్థులను మాత్రం తిరిగి అందులోనే కొనసాగించారు. ఈ క్రమంలో టీఆర్ఆర్ కాలేజీ డబ్బులు ఇవ్వకుండా చెక్కులు ఇచ్చింది. అయితే అవి బౌన్స్ అవుతున్నాయి. ముఖ్యంగా బీ, సీ కేటగిరీల్లో పెద్ద మొత్తంలో డొనేషన్లు చెల్లించిన విద్యార్థులకు రసీదులు లేకపోవడం ఒక సమస్య కాగా, కొందరు తక్కువ ధరకు మాట్లాడుకోవడం వల్ల ఇతర కాలేజీల్లో సర్దుబాటుతో అక్కడ పూర్తి స్థాయి ఫీజు చెల్లించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. సీ కేటగిరీకి చెందిన కొందరు విద్యార్థులైతే ఏకంగా ఏడాదికి రూ. 23 లక్షల చొప్పున చెల్లించారు. ఇందులో డొనేషన్ల సొమ్ముకు కాలేజీలు ఎలాంటి రసీదులూ ఇవ్వలేదు. ఇదిలా ఉంటే.. బీ, సీ కేటగిరీలకు చెందిన ఓ ఏడుగురు విద్యార్థులు పెద్దమొత్తంలో టీఆర్ఆర్ కాలేజీకి డొనేషన్ చెల్లించారు. కానీ ఆ కాలేజీ యాజమాన్యం ఇప్పటివరకు తిరిగి డబ్బు ఇవ్వకపోవడం, తమకు తిరిగి సీటు కేటాయించిన కాలేజీకి డబ్బులు బదిలీ చేయకపోవడం.. మళ్లీ ఇక్కడ అంత మొత్తంలో చెల్లించేంత డబ్బు తమ వద్ద లేకపోవడంతో మొత్తంగా ఆ ఏడుగురు విద్యార్థులూ ఎంబీబీఎస్ విద్యకే దూరమయ్యారని అంటున్నారు. కాగా మొత్తం ఈ వ్యవహారంపై కాలేజీ యాజమాన్యం వివరణ కోసం పలుమార్లు ఫోన్ చేసినా వారు స్పందించకపోవడం గమనార్హం.

రూ.45 లక్షలు చెల్లించా



మా అబ్బాయిని టీఆర్ఆర్‌లో చేర్పించాను. ఫీజు రూ.75 లక్షలకు మాట్లాడుకున్నాను. అడ్మిషన్ రద్దయ్యే నాటికి రూ. 45 లక్షలు చెల్లించాను. ఇప్పుడు మా అబ్బాయిని కరీంనగర్‌లోకి ఒక కాలేజీలో సర్దుబాటు చేశారు. టీఆర్ఆర్ కాలేజీ చెక్‌లను కరీంనగర్ కాలేజీ అనుమతించడంలేదు. టీఆర్ఆర్ కాలేజీ యాజమాన్యం ఇప్పటివరకు మేం చెల్లించిన సొమ్మును ఇవ్వలేదు. పరీక్ష ఫీజు దగ్గర పడుతోంది. ఫీజు చెల్లించకుంటే పరీక్ష రాసే పరిస్థితి లేదంటున్నారు.
- శ్రీనివాసరెడ్డి, ఎంబీబీఎస్ విద్యార్థి తండ్రి

చెక్‌లు బౌన్స్ అవుతున్నాయి



టీఆర్ఆర్ కాలేజీలో బీ కేటగిరీలో మా అబ్బాయిని చేర్పించాను. మొదటి ఏడాది కింద రూ. 11.25 లక్షల ఫీజు చెల్లించాను. తర్వాత ఆర్వీఎం కాలేజీలో సర్దుబాటు చేశారు. కానీ టీఆర్ఆర్ కాలేజీ యాజమాన్యం మాత్రం ఫీజు ఆర్వీఎం కాలేజీకి బదిలీ చేయలేదు. దీంతో మళ్లీ ఫీజు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు. లేకుంటే పరీక్ష రాయడానికి వీలుండదని చెబుతున్నారు.
- రుక్మిణి, (ఎంబీబీఎస్ విద్యార్థి తల్లి)

వైద్య విద్యకు దూరం

మా అమ్మాయిని సీ కేటగిరీలో టీఆర్ఆర్‌లో చేర్పించాను. ఒకేసారి రూ. 75 లక్షల ఫీజు చెల్లించాను. ఇతర కాలేజీలో చేరాలంటే అక్కడ డబ్బు చెల్లించాలన్నారు. టీఆర్ఆర్ యాజమాన్యం మాత్రం డబ్బులు బదిలీ చేయలేదు. దీంతో మా అమ్మాయి ఏకంగా ఎంబీబీఎస్ చదువుకే దూరమైంది. - శ్రద్ధ (విద్యార్థిని తల్లి)

రసీదులు తెస్తే న్యాయం చేస్తా

టీఆర్ఆర్ కాలేజీలో చేరి డబ్బులు చెల్లించినట్లు తల్లిదండ్రులు, విద్యార్థులు తమ వద్దకు రసీదులతో వచ్చి లిఖిత పూర్వక ఫిర్యాదులు చేస్తే, అటువంటి వారికి న్యాయం చేస్తాము. కాలేజీ యాజమాన్యంతో మాట్లాడతాం.
- కరుణాకర్‌రెడ్డి, వీసీ, కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం

గ్రూప్-1 మెయిన్స్‌కు 182 మంది బీసీ స్టడీ సర్కిల్ అభ్యర్థులు

సాక్షి, హైదరాబాద్: వివిధ ప్రభుత్వ శాఖల్లో గ్రూప్–1 ఉద్యోగాల భర్తీకి సంబంధించి టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షలో బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ తీసుకున్న 182 మంది అభ్యర్థులు మెయిన్స్‌కు అర్హత సాధించినట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.అలోక్ కుమార్ తెలిపారు. మెయిన్స్‌కు అర్హత సాధించిన అభ్యర్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. తాజాగా బీసీ స్టడీ సర్కిల్ మెయిన్స్‌కు ఉచిత కోచింగ్ నిర్వహిస్తోందని, ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లోని బీసీ స్టడీ సర్కిల్స్ పరిధిలో 300 మంది, హైదరాబాద్‌లోని బీసీ స్టడీ సర్కిల్‌లో రెండు వందల మంది అభ్యర్థులకు కోచింగ్ తరగతులు ఈ నెల 25వ తేదీ నుంచి మొదలుకానున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు సంబంధిత బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, మెరిట్ ఆధారంగా ఎంపిక చేపడతామని పేర్కొన్నారు. ఇప్పటికే బీసీ స్టడీ సర్కిల్‌లో ప్రిలిమ్స్ కోచింగ్ తీసుకుని మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. అభ్యర్థులకు నెలకు రూ.5 వేల స్టైపండ్, స్టడీ మెటీరియల్ ఇవ్వనున్నట్లు ఆయన వెల్లడించారు.

హతుడు నాందేడ్‌వాసి

బీమా సొమ్ము కోసం ఒకరి హత్య కేసులో పోలీసుల పురోగతి



బాబు మారోతి (ఫైల్)

ఖలీల్‌వాడి (నిజామాబాద్): రూ. లక్షల్లో ఉన్న అప్పులను బీమా సొమ్ముతో తీర్చేందుకు ఓ ప్రభుత్వోద్యోగి తన లాంటి వ్యక్తిని హత్య చేసి కారు సహా మృతదేహాన్ని దహనం చేసిన కేసులో మృతుడు బాబు స్వస్థలాన్ని పోలీసులు గుర్తించారు. బాబు మారోతి గలగాయే (42) మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా బోకర్ తాలుకా లాగలూడ్ గ్రామానికి చెందిన వాడని పేర్కొన్నారు. ఈ కేసులో నిందితులు ధర్మానాయక్, అతని మేనల్లుడు తేజవత్ శ్రీనివాస్ కలిసి నిజామాబాద్ రైల్వేస్టేషన్ నుంచి అడ్డా కూలీ అయిన బాబును గత వారం మెదక్ జిల్లా టెక్మాల్ మండలంలోని వెంకటాపూర్ చెరువు వద్దకు కారులో తీసుకెళ్లి హతమార్చడం... ఆపై కారుతోపాటు మృతదేహంపై పెట్రోల్ పోసి దహనం చేయడం తెలిసిందే. ఈ కేసులో బాబు కనిపించట్లేదంటూ నిజామాబాద్ కమిషరేట్ పరిధిలోని పోలీసు స్టేషన్‌లలో ఎటువంటి మిస్సింగ్ కేసు నమోదు కాకపోవడంతో అతని స్థానికత ను కనుగొనేందుకు పోలీసులు వివిధ రైల్వేస్టేషన్‌లలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా బోకర్ రైల్వేస్టేషన్‌లో బాబు రైలు ఎక్కినట్లు సీసీటీవీ ఫుటేజీలో కనిపించడంతో సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఆరా తీశారు. కూలి పనుల కోసం నిజామాబాద్‌లో అతను రైలు దిగినట్లు మృతుని కుటుంబ సభ్యులను విచారించి తెలుసుకున్నారు. మరోవైపు బాబుకన్నా ముందు ధర్మానాయక్ చంపాలనుకున్న నాంపల్లికి చెందిన అంజయ్య అనే వ్యక్తి ఎందుకు, ఎలా తప్పించుకొని పారిపోయాడనే కోణంలోనూ పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇప్పటికే అంజయ్యకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీలను తీసుకువెళ్లినట్లు సమాచారం. అతన్ని మెదక్ పోలీసులు ప్రశ్నించనున్నట్లు తెలుస్తోంది.

యువకుడిని చుట్టేసిన సుడిగాలి...



రఘునాథపాలెం: ఒక్కసారిగా సుడిగాలి రావడం.. అందులో మనుషులు, జంతువులు, వస్తువులు చిక్కుకుని గాలిలో తేలిపోవడం సినిమాల్లో చూసి ఆశ్చర్యపోతుంటాం. అలాంటి ఘటనే గురువారం ఖమ్మం జిల్లా రఘునాథపాలెం వీవీ పాలెంలోని నూతన కలెక్టరేట్ సమీపంలో కనిపించింది. ఇటీవల సీఎంల పర్యటన నేపథ్యంలో గ్రావెల్ నింపిన ప్రాంతంలో ఉదయం 11.30 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా సుడిగాలి వచ్చింది. మట్టి, దుమ్ము తెరలుతెరలుగా గాల్లోకి తిరుగుతూ.. అక్కడే మూత్రవిసర్జన కోసం వెళ్లిన యువకుడిని చుట్టుముట్టింది. అయితే, వెంటనే అప్రమత్తమైన యువకుడు పరుగులు తీయడంతో అక్కడి బీఆర్ఎస్ పార్టీ జెండాలు, కర్రలు సుడిగాలి ధాటికి ఆకాశంలో కొద్దిసేపు చక్కర్లుకొట్టాయి. కాగా, సుడిగాలి వస్తుండగా అక్కడ కొందరు తీసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

కామారెడ్డి ‘మాస్టర్‌ప్లాన్’ వెనక్కి!

- నేడు మున్సిపల్ అత్యవసర సమావేశం
- ముసాయిదా రద్దు కోరుతూ తీర్మానించాలని నిర్ణయం



మాట్లాడుతున్న జాహ్నవి

సాక్షి, కామారెడ్డి/కామారెడ్డి టౌన్: ‘భూమిని మింగే మాస్టర్ ప్లాన్ మాకొద్దు’ అంటూ నెలన్నర కాలంగా రైతు ఐక్యకార్యాచరణ కమిటీ చేస్తున్న పోరాటం ఫలించింది. కామారెడ్డి మున్సిపల్ పాలకవర్గం మాస్టర్‌ప్లాన్ రద్దుకు ముందుకు వచ్చింది. ఈ నెల 20న మున్సిపల్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి ముసాయిదా రద్దు కోరుతూ తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపనున్నట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి గురువారం విలేకరుల సమావేశంలో ప్రకటించారు. దీంతో గడచిన నెలన్నర రోజులుగా జరుగుతున్న ఆందోళనలకు ఫుల్‌స్టాప్ పడనుందని రైతులు భావిస్తున్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి రైతు ఐక్యకార్యాచరణ కమిటీ అనేక రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టింది. ధర్నాలు, రాస్తారోకోలు, ర్యాలీలు, బంద్‌లు నిర్వహించింది. విలీన గ్రామాల కౌన్సిలర్లు తొమ్మిది మంది రాజీనామా చేయాలని గురువారం సాయంత్రం వరకు డెడ్‌లైన్ విధించింది. ఈ క్రమంలో బీజేపీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లు తమ రాజీనామా లేఖలను మున్సిపల్ కమిషనర్‌కు అందించారు. దీంతో అధికార పార్టీ కౌన్సిలర్లపై ఒత్తిడి పెరిగింది. ముందు నుయ్యి, వెనక గొయ్యిలా వారి పరిస్థితి తయారైంది. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఇంటిని ముట్టడించాలని పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు చర్చించి ఈ నెల 20న మున్సిపల్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి ముసాయిదా రద్దు కోరుతూ తీర్మానించాలని నిర్ణయించారు. ఎట్టకేలకు రైతుల పోరాటాల ఫలితంగా బల్దియా పాలకవర్గం మాస్టర్‌ప్లాన్ ముసాయిదా రద్దుకు సిద్ధమైంది.

ఆగని ‘మాస్టర్‌ప్లాన్’ మంటలు

జగిత్యాలలో పలువురు మహిళల ఆత్మహత్యాయత్నం



పురుగు మందు డబ్బాలతో మహిళా రైతులు

జగిత్యాల రూరల్: జగిత్యాల జిల్లాకేంద్రంలో మాస్టర్‌ప్లాన్ – 2041 మంటలు ఇంకా కొనసాగుతున్నాయి. పట్టణ సమీప గ్రామాల్లోని తమ వ్యవసాయభూములను రిక్రియేషన్, ఇండస్ట్రియల్, సెమీ పబ్లిక్‌జోన్లలో చేర్చుతూ ముసాయిదా మాస్టర్‌ప్లాన్ ప్రకటించారని రైతులు భగ్గుమంటున్నారు. వారంరోజులుగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం కూడా రైతులు పెద్దఎత్తున తరలివచ్చి జగిత్యాల నలువైపులా రహదారులను దిగ్బంధించారు. రోడ్లపైనే వంటావార్పు నిర్వహించారు. తాము పండించిన మక్కకంకులను విక్రయిస్తూ, ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తూ నిరసన తెలిపారు. హస్నాబాద్ శివారులోని జగిత్యాల–నిజామాబాద్ ప్రధాన రహదారిపై రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కొందరు మహిళారైతులు పురుగుమందు డబ్బాలు వెంట తెచ్చుకున్నారు. మాస్టర్‌ప్లాన్ నుంచి తమ భూములను తొలగించకుంటే ఆత్మహత్య చేసుకుంటామంటూ అధికారులను హెచ్చరిస్తూ.. మందు తాగేందుకు యత్నించగా, అక్కడే ఉన్న పోలీసులు పురుగుమందు డబ్బాలను లాక్కున్నారు. మధ్యాహ్నం 2.30 గంటల తర్వాత అన్నిచోట్ల ధర్నాలను ఉపసంహరించుకున్నారు.

నేడు వైల్డ్ లైఫ్ టూరిజం పునః ప్రారంభం

- ఫ్లాగ్‌ఆఫ్‌తో టైగర్ సఫారీ...
- ‘ఆన్‌లైన్‌లో’ టైగర్ స్టే ప్యాకేజీని ప్రారంభించనున్న మంత్రి ఇంద్రకరణ్



సాక్షి, హైదరాబాద్: అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ (ఏటీఆర్) పరిధిలో ‘ఎకోఫ్రెండ్లీ వైల్డ్ లైఫ్ టూరిజం’ తిరిగి ప్రారంభం కానుంది. 2021 నవంబర్‌లో ప్రయోగాత్మకంగా మొదలైన ‘వైల్డ్‌లైఫ్ టూరిజం ప్యాకేజీ టూర్’ని జతచేసిన సరికొత్త హంగులు, ఆకర్షణలతో శుక్రవారం అటవీ, పర్యావరణశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పునఃప్రారంభించనున్నారు. ఇందులో భాగంగా టైగర్ సఫారీ కోసం సమకూర్చిన కొత్తవాహనాలను ఫ్లాగ్‌ఆఫ్ చేయడం ద్వారా ఈ కార్యక్రమం మొదలుకానుంది. టూర్‌లో భాగంగా ‘టైగర్‌స్టే ప్యాకేజీ’ని ఆన్‌లైన్‌లో టికెట్ల బుకింగ్‌తో మంత్రి ప్రారంభించి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. పర్యాటకులకు కొత్తగా అందుబాటులోకి తీసుకురానున్న ఆరు కాటేజీలను కూడా మంత్రి ప్రారంభిస్తారు. ఏటీఆర్ పరిధిలో పులుల కదలికల ఫొటోలు, పాదముద్రలు, ఇతర అంశాలతో తయారుచేసిన ‘ఏటీఆర్ టైగర్‌బుక్’ను ఆవిష్కరిస్తారు. అటవీ, వన్యప్రాణుల పరిరక్షణకు కృషి చేస్తున్న ‘ఫ్రెండ్స్ ఆఫ్ ఏటీఆర్‌క్లబ్’ సభ్యులతో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సమావేశం నిర్వహిస్తారు.

‘టైగర్‌స్టే ప్యాకేజీ’ ఇలా...

టూరిజం ప్యాకేజీలో... టైగర్ సఫారీ, ట్రెక్కింగ్, ఫారెస్ట్ స్టడీటూర్, ఆదివాసీ, గిరిపుత్రులను కలుసుకుని వారి జీవనశైలి, అనుభవాలు తెలుసుకోవడం వంటివి జతచేశారు. దాదాపు 24 గంటల పాటు ఇక్కడ గడపడంతో పాటు రాత్రి పూట అడవిలోనే కాటేజీలు, మట్టి ఇళ్లలో బస వంటివి అందుబాటులోకి తేనున్నారు. స్థానికంగా ఉండే చెంచులు, ఆదివాసీలే టూరిస్ట్ గైడ్‌లుగా వ్యవహరించనున్నారు. రాత్రిపూట అడవిలోని పర్క్యులేషన్ ట్యాంక్‌లో నీటిని తాగడానికి వచ్చే వన్యప్రాణుల వీక్షణకు నైట్‌విజన్ బైనాక్యులర్స్ ఏర్పాటు చేశారు. ఎకోఫ్రెండ్లీ చర్యల్లో భాగంగా... జ్యూట్‌బ్యాగ్ వర్క్‌షాపు, ప్లాస్టిక్ రీసైక్లింగ్‌సెంటర్, బయో ల్యాబ్‌ల సందర్శన ఉంటుంది.

వచ్చే నెలలో బీసీల బస్సు యాత్ర

అమరావతి నుంచి హైదరాబాద్ వరకు నిర్వహిస్తాం: జాజుల



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

కరీంనగర్: ‘ఓ బీసీ మేలుకో.. నీ లెక్కలు తేల్చుకో’ నినాదంతో వచ్చే నెల నుంచి మూడు నెలలపాటు అమరావతి నుంచి హైదరాబాద్ వరకు బీసీ బస్సు యాత్ర చేపట్టనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. దేశవ్యాప్తంగా బీసీ కులాల జనగణన చేపట్టాలని ఉద్యమిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుండటంతో బీసీ రిజర్వేషన్ల ఉనికికే ప్రమాదం ఏర్పడిందని ఆయన అన్నారు. ఇప్పటికే ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో స్థానిక సంస్థల రిజర్వేషన్లు నిలిపివేశారని.. మరో ఏడాదిలో తెలంగాణలో జరిగే ఎన్నికల్లోనూ బీసీ రిజర్వేషన్లు ఉండవని ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం సంఘ కార్యాలయంలో నిర్వహించిన బీసీ సంఘాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలకు, చివరకు అగ్రకులాలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు దక్కుతుంటే.. 60 శాతం ఉన్న బీసీలకు కేవలం 25 శాతం దక్కుతుండటం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరితో ఉండటంవల్లే బిహార్‌లో ప్రభుత్వం బీసీ కులాల లెక్కలు సేకరించాలని ఆర్డినెన్స్ తీసుకువచ్చిందని తెలిపారు. ఇదే తరహాలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా బీసీ కులాల లెక్కలను తక్షణమే చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

విఫలమైన ఇన్‌స్టాగ్రామ్ ప్రేమ

మనస్తాపంతో యువతి ఆత్మహత్య



ప్రవళిక (ఫైల్)

ఇల్లెందు: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమై ప్రేమించిన ప్రియుడు పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపానికి గురైన యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో గురువారం చోటుచేసుకుంది. లలిత కళామందిర్ (రాజేంద్రనగర్) ఏరియాకు చెందిన హోంగార్డు బాబు కుమార్తె పి.ప్రవళిక (23) డిగ్రీ పూర్తి చేసి హైదరాబాద్‌లో బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ పొందుతోంది. కాగా, ప్రవళికకు శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ యువకుడు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమై ప్రేమలో పడ్డారు. ప్రవళిక తండ్రి బాబు వీరి ప్రేమను మొదట నిరాకరించినా.. ఆ తర్వాత అంగీకరించారు. దీంతో కొంతకాలంగా ప్రవళిక పెళ్లి ప్రస్తావన తీసుకొస్తున్నా.. దాటవేస్తున్న యువకుడు చివరికి నిరాకరించాడు. బాబు కూడా ఆ యువకుడితో ఫోన్‌లో మాట్లాడాడు. అయితే భారీగా కట్నం ఇస్తే పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో అంత ఇచ్చే స్తోమత తనకు లేదని, ఆ యువకుడిని మర్చిపొమ్మని కూతురుకు చెప్పాడు. ఈ క్రమంలో సంక్రాంతి పండుగకు ఇంటికి వచ్చిన ప్రవళిక మనస్తాపానికి గురై గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆత్మహత్యకు ముందు ప్రియుడికి ఫోన్‌లో విషయం చెప్పగా.. అతడే ప్రవళిక సోదరుడికి సమాచారం అందించడం గమనార్హం. దీంతో తండ్రి, సోదరుడు ఇంటికి వచ్చేసరికే ప్రవళిక మృతిచెందింది. బాబు ఫిర్యాదు మేరకు ఇల్లెందు సీఐ రాజు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాగా, ప్రవళిక తల్లి గతంలోనే అనారోగ్యంతో మృతిచెందింది.

ట్రిపుల్ తలాక్‌పై కేసు.. నిందితుడి రిమాండ్

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అర్బన్ మహిళా పోలీస్‌స్టేషన్‌లో ట్రిపుల్ తలాక్‌కు సంబంధించిన తొలి కేసు నమోదైంది. అర్బన్ మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఉస్మాన్ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం... కాజీపేట దర్గాకు చెందిన హర్ష ఫాతిమాకు కరీంనగర్‌కు చెందిన మహ్మద్ రహీంతో 2021 డిసెంబర్ 12న వివాహమైంది. కొద్దిరోజుల తర్వాత నుంచే రహీం కుటుంబసభ్యులు అదనపు కట్నం కోసం ఫాతిమాను వేధింపులకు గురిచేస్తున్నారు. ఈ క్రమంలో అత్తింటివారు గతేడాది నవంబర్ 3న ఫాతిమాను కాజీపేటలో వదిలివెళ్లారు. ఈ నెల 3న కరీంనగర్‌లో మత పెద్దల సమక్షంలో పంచాయతీ నడుస్తుండగానే రహీం తలాక్ తలాక్ తలాక్ అని చెప్పాడు. దీంతో బాధితురాలు అర్బన్ మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు మహ్మద్ రహీంపై కేసు నమోదు చేసి ఈ నెల 17న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టు అతడికి 14 రోజులపాటు రిమాండ్ విధించింది.

క్లుప్తంగా...

నిందితుల్ని నిరవధికంగా జైల్లో ఉంచలేం: సుప్రీం

లఖీంపూర్ ఖేరి కేసులో వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లో రైతు ల ప్రాణాలను తీసిన లఖీంపూర్ ఖేరి హింసాకాండ కేసులో ప్రధాన నిందితుడైన కేంద్ర మంత్రి కుమారుడు ఆశిష్ మిశ్రా బెయిల్ పిటిషన్‌పై తీర్పును సుప్రీంకోర్టు గురువారం వాయిదా వేసింది. మిశ్రాకు బెయిలిస్తే తప్పుడు సంకేతాలు వెళతాయని యూపీ ప్రభుత్వం వాదించింది. దాంతో, నేరస్తుడని రుజువు కాకుండా నిందితున్ని నిరవధికంగా జైల్లో ఉంచకూడదంటూ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జే.కే. మహేశ్వరిలతో కూడిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ''కేసులో బాధిత రైతులు కూడా జైల్లో ఉన్నారు. మిశ్రాకు బెయిలివ్వకుంటే వారూ జైల్లోనే మగ్గాల్సి వస్తుంది'' అని పేర్కొంటూ తీర్పును రిజర్వ్ చేసింది.

మహారాష్ట్రలో రోడ్డు ప్రమాదం... 10 మంది దుర్మరణం

ముంబై: మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ జిల్లాలో గురువారం ఉదయం ముంబై–గోవా జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో వెళ్తున్న వ్యాన్‌ను అతివేగంగా దూసుకెళ్తున్న ట్రక్కు ఢీకొనడంతో వ్యాన్‌లోని 10 మంది ప్రాణాలు కోల్పోయారు. బాధితులంతా దగ్గరి బంధువులే.

మిశ్రాపై 4 నెలల నిషేధం

న్యూఢిల్లీ: తప్పతాగి విమానంలో మధ్యలో తోటి ప్రయాణికురాలిపై మూత్రం పోసిన ఘటనలో నిందితుడు శంకర్ మిశ్రాపై నాలుగు నెలలపాటు ప్రయాణ నిషేధం విధిస్తున్నట్లు ఎయిరిండియా గురువారం ప్రకటించింది. గతంలో ప్రకటించిన 30 రోజుల నిషేధం దీనికి అదనమని స్పష్టంచేసింది. ఇప్పటికే మిశ్రా పేరును సంస్థ నో ఫ్లై లిస్ట్‌లో చేర్చింది. తమ నిర్ణయాన్ని ఇతర ఎయిర్‌లైన్ సంస్థలకు కూడా తెలియజేయనుంది. మిశ్రా ప్రస్తుతం జైల్లో ఉన్నారు. ఘటనకు సంబంధించి విమాన సిబ్బందికి డీజీసీఏ నోటీసులివ్వడం తెలిసిందే.

డీఎంకే నేతపై తమిళనాడు గవర్నర్ పరువు నష్టం దావా

సాక్షి, చెన్నై: డీఎంకే పార్టీ అధికార ప్రతినిధి శివాజీ కృష్ణమూర్తిపై తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి గురువారం పరువు నష్టం దావా వేశారు. ఇటీవల ఓ రవిని ఆయన తీవ్ర పదజాలంతో దూషించారు. ఆయనపై కేసు నమోదుకు పోలీసు కమిషనర్‌ను రాజ్‌భవన్ ఇప్పటికే ఆదేశించింది. డీఎంకేకు, గవర్నర్‌కు చాలాకాలంగా పలు విషయాల్లో ఉప్పూ నిప్పుగా ఉన్న విషయం తెలిసిందే. ఇప్పుడిది కేసుల దాకా వెళ్లడం చర్చనీయాంశమైంది.

ముందుంది ముప్పు

వాతావరణ మార్పులతో పెను విపత్తులు

- జోషి మఠ్ కుంగుబాటు దానికే సంకేతం
- నష్ట నివారణ చర్యలు తక్షణావసరం
- లేదంటే పరిస్థితి చేయి దాటే ప్రమాదం

దేవభూమి ఉత్తరాఖండ్‌లోని జోషి మఠ్‌లో కాళ్లకింది నేల ఉన్నపళంగా కుంగిపోతున్న తీరు పర్యావరణపరంగా మానవాళి ముందున్న పెను ముప్పును కళ్లకు కట్టింది. పరిస్థితి చేయి దాటక ముందే మేల్కొనాల్సిన అవసరాన్ని మరోసారి గుర్తు చేసింది. జోషి మఠ్ సమస్యకు కారణమైన అడవుల విచ్చలవిడి నరికివేత, పెచ్చరిల్లిన వాతావరణ కాలుష్యం వంటివి ప్రపంచమంతటినీ వేధిస్తున్న సమస్యలే. వాటి పర్యవసానాలను గ్లోబల్ వార్మింగ్, ఆకస్మిక వరదలు, తీవ్ర కరువుల రూపంలో అన్ని దేశాలూ చవిచూస్తూనే ఉన్నాయి. ఈ ప్రాకృతిక విపత్తుల తీవ్రత కొన్నేళ్లుగా బాగా పెరుగుతుండటం ఆందోళన కలిగించే అంశం. ఇవన్నీ మనిషి అత్యాశకు ప్రకృతి ప్రతిస్పందన తాలూకు సంకేతాలే. వాటిని ఇప్పటికైనా అర్థం చేసుకుని తక్షణం నష్ట నివారణ చర్యలు చేపట్టాలని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు. ''లేదంటే అతి త్వరలో పరిస్థితి పూర్తిగా చేయి దాటడం ఖాయం. ఇప్పుడు జోషి మఠ్‌లో జరుగుతున్నది రేపు అన్నిచోట్లా జరుగుతుంది. ప్రకృతితో ఇష్టారాజ్యపు చెలగాటం అంతిమంగా వినాశనానికే దారి తీస్తుంది'' అంటూ హెచ్చరిస్తున్నారు.

ఏం జరుగుతుంది?

గ్లోబల్ వార్మింగ్ తదితరాల వల్ల సముద్ర మట్టం క్రమంగా పెరుగుతోంది. ఈ ధోరణి కొన్నేళ్లుగా వేగవంతమవుతోంది. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా తీర ప్రాంతాలు క్రమంగా నీట మునుగుతాయి. మానవాళిపై పెను ప్రభావం చూపగల పరిణామమిది. ఎందుకంటే ప్రపంచ జనాభాలో పదో వంతుకు పైగా సముద్ర తీర ప్రాంతాల్లోనే వ్యాపించి ఉంది. మహా నగరాల్లో కూడా అధిక శాతం అక్కడే ఉన్నాయి. అవన్నీ మునగడమో, పూర్తిగా నివాసయోగ్యం కాకుండా పోవడమో జరుగుతుంది. ఫలితంగా కోట్లాది మంది పొట్ట చేత పట్టుకుని వలస బాట పడతారు. వారందరికీ పునరావాసం, ఉపాధి తదితరాలన్నీ అతి పెద్ద సవాళ్లుగా నిలుస్తాయి. మానవాళి చరిత్రలో ఇది పెను విపత్తుగా మారినా ఆశ్చర్యం లేదు. అంతేగాక మితిమీరిన కాలుష్యం ఇప్పటికే ప్రాణాంతక వ్యాధులకు దారి తీస్తోంది. సురక్షితమైన తాగునీటికి చాలా దేశాల్లో ఇప్పటికే తీవ్ర కొరత ఏర్పడింది. ముస్ముందు ఇది మరింత తీవ్రతరం కానుంది. ప్రజలు సరైన తిండికి, తాగునీటికే కాదు, పీల్చేందుకు స్వచ్ఛమైన గాలికి కూడా నోచుకోని పరిస్థితి తలెత్తనుంది!


మాటలకే పరిమితం

పర్యావరణ నష్టాలకు అడ్డుకట్ట వేసేందుకు చారిత్రక పారిస్ ఒప్పందం మొదలుకుని పలు కాప్ శిఖరాగ్రాల దాకా పేరుకు ప్రయత్నాలెన్నో జరుగుతున్నాయి. కానీ చిత్తశుద్ధితో కూడిన చర్యలు మాత్రం కన్పించడం లేదు. కర్బన ఉద్గారాల తగ్గింపు తదితరాలకు సంబంధించి గొప్ప లక్ష్యాలు నిర్ణయించుకోవడం, తర్వాత మర్చిపోవడం ఆనవాయితీగా సాగుతోంది. ఎవరికి వారు పొరుగు దేశమే ప్రధానంగా బాధ్యత తీసుకోవాలన్నట్టుగా వ్యవహరిస్తూ వస్తున్నారు. కళ్లు మూసుకుని పాలు తాగుతున్న చందంగా వ్యవహరిస్తున్నారు.

ఎటు చూసినా విపత్తులే...

- మంచు ఖండమైన అంటార్కిటికాతో పాటు ప్రపంచవ్యాప్తంగా హిమానీ నదాలు శరవేగంగా కరుగుతున్నాయి. దీని దుష్ప్రభావం పర్యావరణంపై చాలా రకాలుగా ఉండబోతోంది.
- ఆర్కిటిక్ బ్లాస్ట్ కారణంగా ముందుగా ఇంగ్లండ్ తదితర యూరప్ దేశాలు అతి శీతల వాతావరణంతో అల్లాడాయి. తర్వాత అమెరికా దాని దెబ్బకు 10 రోజులకు పైగా దాదాపుగా స్తంభించిపోయింది. దేశ చరిత్రలో ఎన్నడూ ఎరగనంతటి చలి గాలులు, మంచు తుఫాన్లతో అల్లాడింది. వేల కోట్ల డాలర్ల ఆస్తి నష్టం చవిచూసింది.
- అమెరికాలో ఇటీవలి దాకా కార్చిచ్చులతో అల్లాడిన కాలిఫోర్నియా ఇప్పుడేమో కనీవినీ ఎరగని వరద బీభత్సంతో తల్లడిల్లుతోంది.
- ఉత్తర భారతం కొన్నేళ్లలో ఎన్నడూ లేనంతటి చలితో వణుకుతోంది.
- పొరుగు దేశం పాకిస్తాన్ గతేడాది దేశ చరిత్రలో ఎన్నడూ చూడనంతటి వరదలతో అతలాకుతలమైంది. మూడొంతుల ప్రాంతాలు పూర్తిగా దెబ్బ తిన్నాయి. ఆ ప్రభావం నుంచి పాక్ ఇప్పటికీ కోలుకోలేదు.

- సాక్షి, నేషనల్ డెస్క్



ఏటా 10 సెం.మీ. కుంగిన జోషీ మఠ్!

జోషి మఠ్‌లో నేల 2018 నుంచి ఏటా 10 సెంటీమీటర్ల చొప్పున కుంగుతూ వస్తోందట! అధునాతన శాటిలైట్ ఇమేజ్ విశ్లేషణ ఆధారంగా జరిగిన ఒక తాజా అధ్యయనంలో ఈ మేరకు తేలింది.

ఎన్ని నష్టాలో...!

- వాతావరణ మార్పుల దుష్పరిణామాలతో మానవాళిలో ఏకంగా 85 శాతం ఇప్పటికే తీవ్రంగా ప్రభావితమవుతోంది.
- ఉష్ణోగ్రతలు పదేళ్లకు 0.18 సెంటీగ్రేడ్ చొప్పున పెరుగుతున్నాయి.
- కర్బన ఉద్గారాలు 2020 కల్లా 3,481 కోట్ల టన్నులకు చేరాయి.
- మొత్తం కర్బన ఉద్గారాల్లో 50 శాతానికి 10 శాతం అత్యంత ధనిక దేశాలే కారణమవుతున్నాయి.
- గత 50 ఏళ్లలో వాతావరణ మార్పుల వల్ల ఆర్థికంగా 3.64 లక్షల కోట్ల డాలర్ల నష్టం వాటిల్లినట్టు అంచనా.
- వాతావరణ మార్పుల వల్ల వచ్చే వ్యాధులకు 2030 నుంచి ఏటా 25 లక్షల మంది బలవుతారని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది.
- వాతావరణ మార్పుల ఫలితంగా 2050 కల్లా ఏకంగా 30 కోట్ల మందికి పైగా నిర్వాసితులవుతారని అంచనా.

కారణాలేమిటి?

- దశాబ్దాల తరబడి విచ్చలవిడిగా సాగుతున్న అడవుల నరికివేత
- బొగ్గు తదితర శిలాజ ఇంధనాల మితిమీరిన వాడకం
- కోట్లాది టన్నుల ప్రమాదకర వ్యర్థాలను సముద్రాల్లోకి వదలటం
- భూగర్భ జలాలను ఇష్టారాజ్యంగా తోడేయడం, విచ్చలవిడి డ్రిల్లింగ్
- అడ్డూ అదుపూ లేకుండా సాగుతున్న కాంక్రీట్ నిర్మాణాలు

నష్ట నివారణకు ఏం చేయాలి?

- శిలాజ ఇంధనాలకు వీలైనంత త్వరగా స్వస్తి పలకాలి. సౌర విద్యుత్ తదితర సంప్రదాయేతర ఇంధన వనరులకు మళ్లాలి.
- నీరు, ఇంధనం తదితర వనరుల పొదుపుపై మరింతగా దృష్టి పెట్టాలి.
- పచ్చదనాన్ని వీలైనంతగా పెంచాలి.
- ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలి.
- వ్యర్థాల రీసైక్లింగ్‌పై బాగా దృష్టి పెట్టాలి.



ఇక చాలు..

న్యూజిలాండ్ ప్రధాని జెసిండా అనూహ్య రాజీనామా

పదవికి న్యాయం చేయలేనని వ్యాఖ్య • నివ్వెరపోయిన ప్రపంచ దేశాలు

వెల్లింగ్టన్: పదవీ కాలం ఇంకా పది నెలలుంది. ప్రజా బలమూ ఉంది. అయినా ఆమె పదవి కోసం తాపత్రయపడలేదు. బాధ్యతలను సమర్థంగా నిర్వహించగలనా, లేదా అనే ఆలోచించారు. ప్రధాని పదవి వీడాల్సిన సమయం వచ్చిందంటూ హుందాగా తప్పుకున్నారు. ఆమె ఎవరో కాదు. ప్రగతిశీల పాలనకు పెట్టింది పేరైన న్యూజిలాండ్ ప్రధాన మంత్రి జెసిండా ఆర్డెర్న్. ఆమె వయసు 42 ఏళ్ల మాత్రమే. రాజకీయంగా ఎంతో భవిష్యత్ ఉంది. సమర్థ పాలకురాలిగా, శక్తిమంతమైన నాయకురాలిగా పేరుంది. కరోనా సంక్షోభం, మైనార్టీ ఊచకోత, ప్రకృతి వైపరీత్యాలు సవాల్ ఏదైనా ఆ సమయంలో ఆమె చూపించిన సంయమనం సర్వత్రా ప్రశంసలు అందుకుంది. అయినప్పటికీ ప్రధాన మంత్రి పదవికి జకిండా ఆర్డెర్న్ రాజీనామా చేశారు. ప్రధానమంత్రిగా ఫిబ్రవరి 7 తన ఆఖరి రోజని కన్నీళ్లని అదిమిపెట్టుకుంటూ గురువారం లేబర్ పార్టీ సభ్యుల సమావేశంలో ప్రకటించి ప్రపంచ దేశాలను షాక్‌కి గురి చేశారు. ''నేనూ మనిషినే. ఎంత కాలం చెయ్యగలమో అంతే చేస్తాం. అప్పుడు సమయం వస్తుంది. ఇప్పుడు నా సమయం వచ్చింది. ఒక దేశాన్ని నడిపించడం సర్వోన్నతమైన పని. అంతే సవాళ్లతో కూడుకున్నది. అనూహ్యంగా వచ్చే సవాళ్లను, పదవితో సంక్రమించిన బాధ్యతల్ని పూర్తి స్థాయిలో సమర్థంగా నిర్వహించలేనప్పుడు ఎవరూ ఆ పదవిలో ఉండకూడదు. ఉండలేరు కూడా. ప్రధాని పదవిలో ఉండడానికి మీరు సరైన వ్యక్తా, కాదా అన్నది తెలుసుకోవడం కూడా మీ బాధ్యతే. ఇంక ఈ పదవికి నేను న్యాయం చెయ్యలేనని నాకు అనిపిస్తోంది. అందుకే తప్పుకుంటున్నాను. నేనేదో వచ్చే ఎన్నికల్లో ఓడిపోతానని ఈ పదవిని వీడడం లేదు. ఆ ఎన్నికల్లో కచ్చితంగా గెలిచే సత్తా మనకుంది'' అని పార్టీ సభ్యులతో ఆమె ఉద్విగ్నభరితంగా చెప్పారు. గత ఎన్నికల్లో తిరుగులేని విజయాన్ని సాధించిన జెసిండా హఠాత్తుగా ఎందుకు ఈ నిర్ణయం తీసుకున్నారోనన్న చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది.

ఎందరో మహిళలకు స్ఫూర్తి

జెసిండా 2017లో 37 ఏళ్లకే ప్రధాని అయ్యారు. అత్యంత పిన్న వయసులో ఆ ఘనత సాధించిన వ్యక్తిగా రికార్డులకెక్కారు. ఎందరో మహిళలకు స్ఫూర్తిగా నిలిచారు. ప్రపంచమంతటా రైట్ వింగ్ ప్రభుత్వాలున్న నేపథ్యంలో వామపక్ష భావజాలం కలిగిన ఆమె కొత్త తరానికి ప్రతినిధిగా నిలిచారు. ప్రధానిగా ఉంటూనే బిడ్డకు జన్మనిచ్చారు! కుటుంబ బాధ్యతలు కూడా ముఖ్యమేనని ఈ తరం అమ్మాయిలకు సందేశమిచ్చారు. పొత్తిళ్లలో పాపతోనే ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సమావేశంలో పాల్గొన్నారు. బిడ్డను లాలించే తల్లికే ప్రజల్ని పాలించడం బాగా తెలుస్తుందన్న సామెతను నిజం చేస్తూ, సంక్షోభం ఎదురైన ప్రతిసారీ తానేంటో ఎప్పటికప్పుడు నిరూపించుకుంటూ వచ్చారు. న్యూజిలాండ్ చరిత్రలోనే చీకటి రోజుల్ని 2019 మార్చిలో ఎదుర్కొన్నారు. క్రైస్ట్‌చర్చ్‌లో రెండు మసీదులపై ఒక దుండగుడు దాడి చేసి ప్రార్థనలు చేసుకుంటున్న 51 మంది ముస్లింల ప్రాణాలను నిర్దాక్షిణ్యంగా తీసినప్పుడు చలించిన హృదయంతో బాధితుల పట్ల ఆమె చూపించిన దయ, సానుభూతి ప్రజలందరి మనసుల్లో చెరగని ముద్ర వేసింది. కాల్పులు జరిగిన కొద్ది వారాల్లోనే సెమీ ఆటోమేటిక్ తుపాకుల్ని నిషేధిస్తూ ఆమె కఠిన చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చారు. 50 వేలకిపైగా తుపాకుల్ని, ఏఆర్–15 స్టైల్ రైఫిల్స్‌ని ధ్వంసం చేశారు. ఇక కరోనా సంక్షోభాన్ని ఆమె ఎదుర్కొన్న తీరు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది. కరోనా వైరస్ సరిహద్దుల్లోనే కట్టడి చేయడానికి ఆమె తీసుకున్న చర్యలకు అందరూ భేష్ అన్నారు. వాతావరణ మార్పులే ప్రపంచ దేశాలకు అసలైన సవాల్ అని నమ్మిన ఆమె కర్బన ఉద్గారాలను పూర్తిగా నిర్మూలించడానికి 2050ని లక్ష్యంగా నిర్ణయిస్తూ విధానపరమైన నిర్ణయాలు ప్రకటించారు. ప్రధానిగా ఆమె తెగువ, శక్తి సామర్థ్యాలకు ప్రజలు ఫిదా అయ్యారు. 2020 ఎన్నికల్లో రికార్డు విజయం ఆమెకు కట్టబెట్టారు.

మా సిఫార్సులను... పదేపదే తిప్పి పంపొద్దు

- కేంద్రానికి కొలీజియం స్పష్టీకరణ
- మూడోసారి ఐదు పేర్లు సిఫార్సు
- పలు హైకోర్టులకు మరో 20 పేర్లు



న్యూఢిల్లీ: న్యాయమూర్తులుగా తాము చేసిన సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం పదేపదే తిప్పి పంపజాలదని సుప్రీంకోర్టు కొలీజియం మరోసారి స్పష్టం చేసింది. పలు హైకోర్టులకు న్యాయమూర్తులుగా ఇప్పటికే పలుమార్లు చేసిన ఐదు గత సిఫార్సులను తాజాగా మరోసారి కేంద్రానికి పంపింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ ఎస్.కె.కౌల్, జస్టిస్ కె.ఎం. జోసెఫ్‌తో కూడిన సుప్రీంకోర్టు కొలీజియం మంగళ, బుధవారాల్లో సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. వీరిలో తాను స్వలింగ సంపర్కినని ప్రకటించుకున్న సీనియర్ అడ్వకేట్ సౌరభ్ కృపాల్ కూడా ఉన్నారు. ఆయనను ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా నియమించాలన్న 2021 నవంబర్ 11 నాటి సిఫార్సును కొలీజియం తాజాగా పునరుద్ఘాటించింది. న్యాయవాదులు ఆర్.జాన్ సత్యంను మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తిగా, సోమశేఖర్ సుందరేశన్‌ను బాంబే హైకోర్టు న్యాయమూర్తిగా తిరిగి సిఫార్సు చేసింది. వీరితో పాటు అమితేశ్ బెనర్జీ, సఖ్య సేన్‌ను కలకత్తా హైకోర్టు న్యాయమూర్తులుగా వెంటనే నియమించాలని కూడా పేర్కొంది. అలాగే కర్నాటక, అలహాబాద్, మద్రాస్ హైకోర్టులకు న్యాయమూర్తులుగా మరో 20 పేర్లను సిఫార్సు చేసింది. వీరిలో 17 మంది న్యాయవాదులు, ముగ్గురు జడ్జిలున్నారు. ఈ సందర్భంగా కేంద్రాన్ని ఉద్దేశించి కొలీజియం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. తమ సిఫార్సులను కేంద్రం పదేపదే తిప్పి పంపడాన్ని అనుమతించలేమని స్పష్టం చేసింది. అమితేశ్, సేన్ పేర్లను కేంద్రం ఇప్పటికే రెండేసిసార్లు తిప్పి పంపింది. అమితేశ్ తండ్రి జస్టిస్ యు.సి.బెనర్జీ సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి. గోధ్రాలో సబర్మతి రైలు ప్రమాదం వెనక కుట్ర కోణమేదీ లేదని తేల్చిన కమిషన్‌కు సారథి. ఇక సత్యం ప్రధాని మోదీపై విమర్శనాత్మక వ్యాఖ్యలు చేశారని, ప్రభుత్వ విధానాలు, పథకాలపై సుందరేశన్ ఉద్దేశపూర్వకంగా సోషల్ మీడియాలో విమర్శనాత్మక వ్యాఖ్యలు చేశారని వారి పేర్లను కేంద్రం తిప్పి పంపింది. ఈ అభ్యంతరాలను కొలీజియం తాజాగా తోసిపుచ్చింది. స్వేచ్ఛగా అభిప్రాయాలను వ్యక్తీకరించడం రాజ్యాంగపరమైన పదవులు చేపట్టేందుకు అడ్డంకి కాబోదని స్పష్టం చేసింది.

హిమగర్భంలో భారీ ఉల్క



న్యూఢిల్లీ: అంటార్కిటికాలో దట్టమైన మంచు గర్భంలో 7.6 కిలోల బరువైన ఉల్కను అంతర్జాతీయ సైంటిస్టుల బృందం వెలికితీసింది. మంచు ఖండంలో ఇంతటి భారీ ఉల్క దొరకడం అత్యంత అరుదైన విషయమని పేర్కొంది. గత డిసెంబర్ 11 నుంచి నెల రోజుల పాటు జరిపిన అన్వేషణలో మరిన్ని చిన్న సైజు ఉల్కలు కూడా దొరికాయి. శాటిలైట్ ఇమేజీలు, జీపీఎస్ సాయంతో వీటి జాడను కనిపెట్టారు. ''ఇవి బహుశా ఏదో ఆస్టిరాయిడ్ నుంచి రాలి పడి ఉంటాయి. వేలాది ఏళ్లుగా మంచు గర్భంలో ఉండిపోయాయి. వీటిని పరిశోధన నిమిత్తం బ్రెసెల్స్‌కు పంపాం. అందులో భూమి ఆవిర్భావంపై కొత్త విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది'' అని సైంటిస్టులు చెబుతున్నారు.

ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ మలివాల్‌కు... నడిరోడ్డుపై వేధింపులు!

తెల్లవారుజాము తనిఖీ వేళ అసభ్యంగా ప్రవర్తించిన తాగుబోతు



హరీశ్



స్వాతి మలివాల్

న్యూఢిల్లీ: ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్వాతి మలివాల్‌కు దేశ రాజధానిలో ఘోర అవమానం జరిగింది. కంఝావాలాలో యువతిని కొందరు కారుతో ఢీకొట్టి 12 కిలోమీటర్లు ఈడ్చుకెళ్లి మరణానికి కారణమైన ఉదంతం నేపథ్యంలో రాత్రిళ్లు బస్టాండ్‌ల వంటి చోట్ల మహిళలకు కనీస భద్రతపై తనిఖీ కోసం స్వాతి మలివాల్ తన బృందంతో కలిసి గురువారం తెల్లవారుజామున మూడింటపుడు ఎయిమ్స్ ప్రాంతంలో పర్యటించారు. ఎదురు బస్టాప్‌లో ఉన్న వారితో మాట్లాడుతుండగా తప్పతాగిన 47 ఏళ్ల హరీశ్ చంద్ర తన కారులో అక్కడికొచ్చి స్వాతిని కారులో కూర్చోవాలని బలవంతపెట్టాడు. అందుకు ఆమె నిరాకరించడంతో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కొద్దిసేపటికే మళ్లీ వచ్చి బూతులు తిడుతూ కారులో కూర్చోవాలని తప్పుడు సంజ్ఞలు చేశాడు. కోపంతో ఆమె అతడిని పట్టుకోబోగా కారు తలుపు అద్దం పైకెత్తాడు. దీంతో కార్ డోర్‌కు, అద్దానికి మధ్య స్వాతి చేయి ఇరుక్కుంది. కారులో పారిపోతూ స్వాతిని అలాగే కొన్ని మీటర్ల దూరం ముందుకు ఈడ్చుకెళ్లాడు. అదృష్టవశాత్తు ఆమె ఎలాగోలా చేతిని విడిపించుకోగలిగింది. కొద్దిసేపటికే అక్కడికొచ్చిన పోలీసులకు స్వాతి విషయం చెప్పడంతో వెంటనే కారు జాడ కనుక్కొని నిందితుడు హరీశ్‌ను అరెస్ట్‌చేశారు. 'సాక్షాత్తు మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కే ఇలా జరిగితే దేశ రాజధానిలో ఎంతటి దారుణ పరిస్థితి ఉందో ఊహించుకోవచ్చు' అని తనకు జరిగిన అవమానకర ఘటనపై స్వాతి హిందీలో ట్వీట్‌చేశారు.

అభివృద్ధే మాకు ముఖ్యం

ఓటు బ్యాంకు రాజకీయాలకు మేం సుదూరం: మోదీ



రాయచూరు రూరల్/శివాజీనగర/ముంబై: అభివృద్ధే తమకు అత్యంత ప్రధాన అంశమని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. ఇతర పార్టీల్లా ఓటు బ్యాంక్ రాజకీయాలు తమకు పట్టవన్నారు. గురువారం కర్నాటకలో కాలువలు, తాగునీరు, రహదారి సంబంధ పలు ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేశారు. యాద్గిరి, కలబుర్గి జిల్లాల్లో బహిరంగ సభల్లో మాట్లాడారు. ''రాష్ట్రంలోని బీజేపీ సర్కార్ కేవలం రాష్ట్రాభివృద్ధిపైనే దృష్టిపెడుతుంది. ఇతర పార్టీల మాదిరిగా ఓటు బ్యాంక్ రాజకీయాలుచేయదు. కేంద్ర, రాష్ట్రాల్లో ఒకే పార్టీ అధికారంలో ఉంటే ఎంతో మేలు చేకూరుతుంది. డబుల్ ఇంజన్‌తో డబుల్ లాభం, డబుల్ సంక్షేమం, డబుల్ వేగంతో అభివృద్ధి. ఇందుకు కర్నాటకే చక్కని ఉదాహరణ. యాద్గిరి వంటి వెనకబడిన జిల్లాలను గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయి'' అన్నారు. కొద్ది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న కర్నాటకలో మోదీ పర్యటించడం నెలరోజుల్లో ఇది రెండోసారి. 52,072 మంది లంబాడీలకు మోదీ ఇంటి హక్కు పత్రాలను అందజేశారు.

మహారాష్ట్రలో రూ.38వేల కోట్ల ప్రాజెక్టులు..

అనంతరం ముంబైలో పర్యటించిన మోదీ మహారాష్ట్రలో రూ.38 వేల కోట్లకుపైగా విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ముంబై మెట్రో 2ఏ, 7 లైన్లను ప్రారంభించి ప్రయాణించారు. పలు కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాలకు ఎంపికైన 71 వేల మందికి మోదీ శుక్రవారం వర్చువల్‌గా నియామక పత్రాలు అందజేయనున్నారు.

రాయడమంటే ప్రతిఘటించడమే

జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌లో నోబెల్ గ్రహీత అబ్దుల్ గుర్నాహ్

జైపూర్ నుంచి సాక్షి ప్రతినిధి: రచించడమంటే ప్రతిఘటించడమేనని నోబెల్ సాహితీ పురస్కార గ్రహీత, టాంజానియా–బ్రిటిష్ రచయిత అబ్దుల్ రజాక్ గుర్నాహ్ అన్నారు. గురువారం జైపూర్‌లో 16వ జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌నుాయన ప్రారంభించి కీలకోపన్యాసం చేశారు. ''రచన ద్వారా ప్రతిఘటన అంటే నిరంకుశులను ఎదిరించడం, ఉపన్యాసాలివ్వడమే కాదు. ఏవి సజీవంగా ఉండాలో వాటిని సజీవంగా ఉంచుకోవడానికి ప్రయత్నించడం కూడా'' అన్నారు. వేడుకలో ఫెస్టివల్ డైరెక్టర్లు సంజయ్ రాయ్, విలియమ్ డార్లింపల్, నమిత గోఖలే పాల్గొన్నారు.

ఐదురోజుల వేడుక

జనవరి 19 నుంచి 23 వరకు ఐదురోజుల పాటు జరుగనున్న ఈ భారీ సాహితీ ఉత్సవంలో 11 అంతర్జాతీయ, 20 దేశీయ భాషల నుంచి వక్తలు, రచయితలు, అనువాదకులు, పబ్లిషర్లు పాల్గొంటున్నారు. మలయాళ కవి సచ్చిదానంద్‌ను 'మహాకవి కన్హయ్యాలాల్ సేథియా' అవార్డు, లక్ష రూపాయల నగదుతో సన్మానించనున్నారు.

ప్రజాధనం లూటీ చేయడంలో బీజేపీ బిజీ: రాహుల్

లఖాన్‌పూర్/పఠాన్‌కోట్: ప్రజల దృష్టిని కీలక సమస్యల పై నుంచి మళ్లించి తప్పుడు జీఎస్టీ వంటి విధానాలతో ప్రజాధనాన్ని బీజేపీ సర్కార్ దోచుకుంటోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. కన్యాకుమారి నుంచి మొదలై దాదాపు 3,200 కిలోమీటర్ల పొడవునా కొనసాగిన భారత్ జోడో యాత్రలో చివరి అంకం గురువారం జమ్మూకశ్మీర్‌లో మొదలైంది. లఖాన్‌పూర్‌లో రాహుల్‌కు భారీసంఖ్యలో కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. తమ పూర్వీకులు ఇక్కడి వారేనని రాహుల్ అన్నారు. ఇక్కడికొస్తే సొంతింటికి వచ్చిన భావన కలుగుతోందన్నారు. అంతకు ముందు పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌లో సభలో మాట్లాడుతూ బీజేపీపై విమర్శలు గుప్పించారు. 'ప్రతీ మతం మరో మతంపై ఘర్షణకు దిగేలా, ఒక కులం వారు మరో కులం వారితో కొట్లాడేలా, ఒక భాష మాట్లాడే వారు మరో భాష మాట్లాడేవారితో గొడవకు దిగేలా విద్వేష వాతావరణాన్ని సృష్టిస్తోందన్నారు.

గుజరాత్ ఘర్షణలకు మోదీయే బాధ్యుడు!

- బీబీసీ డాక్యుమెంటరీ
- పక్షపాత ధోరణి: కేంద్రం
- మోదీకి రిషి సునాక్ మద్దతు

లండన్/న్యూఢిల్లీ: 2002లో గుజరాత్‌లో వెయ్యి మందిని బలి తీసుకున్న మత ఘర్షణలకు నాటి సీఎం నరేంద్ర మోదీయే నేరుగా బాధ్యుడంటూ బీబీసీ ప్రసారం చేసిన డాక్యుమెంటరీ వివాదాస్పదంగా మారింది. 'ఇండియా: ది మోదీ క్వశ్చన్'' పేరుతో బ్రిటన్లో ప్రసారమైన ఈ డాక్యుమెంటరీ భారత్‌లో ప్రకంపనలు సృష్టిస్తోంది. బ్రిటన్ ప్రభుత్వం రహస్యంగా చేసిన విచారణలో ఈ మేరకు తేలిందని అందులో పేర్కొన్నారు. 2002 ఫిబ్రవరి 27న గోధ్రాలో సబర్మతి ఎక్స్‌ప్రెస్ బోగికి దుండగులు నిప్పు పెట్టి 59 మంది కరసేవకుల్ని సజీవదహనం చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా మత ఘర్షణలు పెల్లుబికాయి. ఆ సమయంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం అల్లర్లను కట్టడి చేయకుండా ప్రోత్సహించిందని ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో దీనిపై బ్రిటన్ రహస్యంగా విచారణ చేయించందని వార్తలొచ్చినా ఆ నివేదికను బయటపెట్టలేదు. బీబీసీ తాజా డాక్యుమెంటరీలో ఆ నివేదికలో కొన్ని పేజీలను చూపించారు. అందులో 'గుజరాత్ మత ఘర్షణలకు మోదీయే నేరుగా బాధ్యుడు' అన్న వాక్యాలను హైలైట్ చేసి మరీ చూపించారు. ఒక వర్గం వారిని లక్ష్యంగా చేస్తూ కుట్రపూరితంగా, ప్రణాళిక ప్రకారం హింసకు దిగారంటూ నివేదిక ఆరోపించింది. దీన్ని కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. బీబీసీ డాక్యుమెంటరీ తప్పుడు ప్రచారంలో ఒక భాగమని, పక్షపాతంతో రూపొందించారని విమర్శించింది.

మోదీకి మాయని మచ్చ: జాక్ స్ట్రా

గోధ్రా మత ఘర్షణలప్పుడు బ్రిటన్ విదేశాంగ మంత్రిగా ఉన్న జాక్ స్ట్రా కూడా బీబీసీ డాక్యుమెంటరీలో మాట్లాడారు. ''మత ఘర్షణలు జరిగిన వెంటనే ఒక విచారణ బృందాన్ని గుజరాత్‌కు పంపించాం. వారు రాష్ట్రమంతటా తిరిగి హింస ఎలా చెలరేగిందో, దానికి కారకులెవరో సవివరంగా ఒక నివేదిక ఇచ్చారు. సీఎం మోదీ అత్యంత వ్యూహాత్మకంగా హింస జరిగే ప్రాంతాల నుంచి పోలీసుల్ని తప్పించారు. హిందూ శక్తుల్ని పరోక్షంగా ప్రోత్సహిస్తూ దారుణ మారణకాండకు పాల్పడ్డారు. మోదీ వ్యక్తిగత చరిష్మాపై ఇదొక మాయని మచ్చ'' అని ఆరోపించారు. ''ఆ సమయంలో బయటకు చెబుతున్న దాని కంటే హింస అత్యధికంగా జరిగింది. ముస్లిం మహిళలపై దారుణమైన అత్యాచారాలు జరిగాయి. ఈ హింస అంతా రాజకీయ ప్రేరేపితమే. హిందువులు నివసించే ప్రాంతాల్లోని ముస్లింలను పూర్తిగా నిర్మూలించడం కోసమే ఘర్షణలకు పాల్పడ్డారు. నిస్సందేహంగా మోదీ నుంచే ఈ ఆదేశాలు వచ్చాయి. దీనిక వెనక వీహెచ్‌పీ హస్తమూ ఉంది'' అని ఆ నివేదిక ఆరోపించింది.

తప్పుడు ఎజెండాలో భాగమే: కేంద్రం

బీబీసీ డాక్యుమెంటరీ పక్షపాత ధోరణితో, ఒక లక్ష్యం లేకుండా సాగిందని కేంద్రం దుయ్యబట్టింది. బ్రిటన్ ఇప్పటికీ వలసవాద బుద్ధిని పోనిచ్చుకోలేదని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి అరిందం బాగ్చీ విమర్శించారు. ఉద్దేశపూర్వకంగా అవమానకర రీతిలో కథనాన్ని వండి వార్చారని అన్నారు. ఈ డాక్యుమెంటరీని భారత్‌లో ప్రజలు వీక్షించడానికి కుదరదని అందుకే దీని వెనకాల ఏదో ఎజెండా ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ''డాక్యుమెంటరీ కోట్లాది మంది భారతీయుల హృదయాలను గాయపరిచేలా ఉంది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన నాయకున్ని అవమానించింది'' అన్నారు.

యూకే పార్లమెంటులో సునాక్ మద్దతు

ఈ అంశాన్ని బ్రిటన్ పార్లమెంటులో ఎంపీ ఇమ్రాన్ హుస్సేన్ ప్రస్తావించారు. బ్రిటన్ ప్రభుత్వమూ మోదీయే బాధ్యుడని భావిస్తోందా అని ప్రశ్నించారు. ''దీనిపై యూకే ప్రభుత్వం ఎప్పుడో ఒక వైఖరి తీసుకుంది. అందులో ఎలాంటి మార్పు లేదు'' అని రిషి బదులిచ్చారు. గుజరాత్ ఘర్షణల అనంతరం మోదీపై దౌత్యపరమైన నిషేధం విధించిన బ్రిటన్ 2012లో దాన్ని ఎత్తివేసింది.

కదం తొక్కిన కార్మికులు



కార్మికుల రిటైర్మెంట్ వయసును 62 ఏళ్ల నుంచి 64కు పెంచాలన్న ఫ్రాన్స్ ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ పారిస్‌లో కార్మిక సంఘాల సభ్యులు ఇలా నిరసనకు దిగారు. కార్మికుల హక్కులకు భంగం కలగొచ్చని, పెన్షన్ చందాపై అధిక పన్నులు వసూలుచేస్తారని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి.

సాక్షి
హైదరాబాద్

శుక్రవారం । 20 । జనవరి । 2023

వక్ఫ్‌బోర్డు ఇన్‌చార్జి సీఈఓగా ఖాజా మొయినుద్దీన్

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఇన్‌చార్జి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా ఎస్.ఖాజా మొయినుద్దీన్‌ను నియమిస్తూ రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి అహ్మద్ నదీమ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం మొయినుద్దీన్ చీఫ్ విజిలెన్స్ అధికారిగా పని చేస్తున్నారు.

మిసెస్ తెలంగాణ సౌత్ ఇండియాగా స్రవంతి



బంజారాహిల్స్: యూనిక్ టైమ్స్, డీక్యూ ప్రెజెంట్స్ మిసెస్ సౌత్ ఇండియాగా స్రవంతి పేరకం టైటిల్‌ను దక్కించుకుంది. మిసెస్ ఆంధ్రా సౌత్ ఇండియాగా వైష్ణవీరెడ్డి నెదురుమల్లి గెలుపొందారు.

మణికొండలో కోహ్లి సందడి



మణికొండ: భారత క్రికెటర్ విరాట్ కోహ్లి గురువారం మణికొండలో సందడి చేశారు. షేక్‌పేట నుంచి మణికొండకు వచ్చే పైప్‌లైన్ రోడ్డులో హాల్‌మార్క్ గ్రీన్ లివింగ్ అపార్ట్‌మెంట్‌లోని ఓ ప్రైవేటు జిమ్‌లో ఆయన ఓ యాడ్ షూటింగ్‌లో పాల్గొన్నారు. ఆయన రాక సందర్భంగా రాయదుర్గం పోలీసులు పెద్ద ఎత్తున భద్రత ఏర్పాటు చేశారు.



రాధా ఆర్కేడ్ (ఫైల్)



ఉదయం 11 గంటలు



మధ్యాహ్నం ఒంటి గంట



మధ్యాహ్నం 3 గంటలు



సాయంత్రం 5 గంటలు



రాత్రి 7 గంటలు



రాత్రి 9 గంటలు





‘డెక్కన్’లో ధిక్కరణ

సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్‌లోని మినిస్టర్స్ రోడ్‌లోని రాధా ఆర్కేడ్ భవనంలో డెక్కన్ కార్పొరేట్ భవనం నిబంధనల ఉల్లంఘనకు కేరాఫ్ అడ్రస్‌గా ఉంది. ఇందులో అడుగడునా ఫైర్ సేఫ్టీ మెజర్స్ అతిక్రమించినట్లు స్పష్టంగా తెలుస్తోంది. భవనం ఏరియా సైతం ఉండాల్సిన విధంగా లేదు. ఈ కారణంగానే గురువారం అగ్ని ప్రమాదంలో మంటల్ని అదుపు చేయడానికి పది గంటలకు పైగా శ్రమించాల్సి వచ్చింది. ముగ్గురు వ్యక్తులు గల్లంతు కావడంతో ఆందోళన కలిగిస్తోంది.

అడ్డగోలు నిర్మాణాలే అధికం

- నిబంధనల ప్రకారం ఉండాల్సినవీ లేవు
- అగ్ని ప్రమాదం నేపథ్యంలో వెలుగులోకి
- ముగ్గురి గల్లంతుతో తీవ్ర ఉత్కంఠ

ఉల్లంఘనలు ఇలా...

- ఈ భవనం సబ్–సెల్లార్, సెల్లార్, గ్రౌండ్ ప్లస్ సిక్స్ ఫ్లోర్లుగా నిర్మించారు. దీని విస్తీర్ణంలో కనీసం 1/3 వంతు ఖాళీ స్థలం ఉండాల్సి ఉన్నా కనిపించలేదు.
- భవనం చుట్టూ ఫైరింజిన్ తిరిగేలా ఖాళీ స్థలం ఉండాలి. అరకొర స్థలంలో నిర్మించిన ఈ భవనంలో దక్షిణం వైపు ప్రధాన రోడ్డు మినహాయిస్తే మిగిలిన మూడు దిక్కులూ కనీసం నడిచే స్థలం కూడా లేదు. ఈ వాణిజ్య భవనం వెనుక, పక్కన నివాస సముదాయాలు ఉన్నాయి.
- ప్రమాదం జరిగితే బయటపడానికి వెలుపల వైపు స్టెయిర్ కేస్ ఉండాలి. వెలుపల మాట అటుంచితే లోపల ఉన్న ఇంటర్నల్ స్టెయిర్ కేస్ కూడా అవసరమైన స్థాయిలో లేదు.
- ఇలాంటి వాణిజ్య భవనాలకు అత్యవసర సమయంలో వెలిగించేందుకు ఎమర్జెన్సీ లైట్లు, ఆటో గ్లో సిస్టమ్ తప్పనిసరి. ‘డెక్కన్’లో వెతికినా ఇవి కనిపించలేదు. అగ్ని ప్రమాదం జరిగితే బయటపడటానికి ప్రత్యేక ఎగ్జిట్ ఉండాలి. ఇది ఎక్కడా కనిపించలేదు.
- మంటలార్పేందుకు ఈ భవనంలో ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, వాటర్ పైపులు, స్ప్రింక్లర్స్‌తో పాటు వెట్ రైజర్ తప్పనిసరి. ఈ భవనంలో ఇవి ఉన్న దాఖలాలు లేవు.
- విద్యుత్ ఫైర్ అలారం, మాన్యువల్ ఫైర్ అలారం తప్పనిసరి. ఈ రెండూ మచ్చుకైనా కనిపించలేదు. ప్రమాదాన్ని పసిగట్టి హెచ్చరించే ఆటోమేటిక్ వ్యవస్థ ఉండాలి. ఇలాంటిది ఎక్కడా కనిపించలేదని అగ్నిమాక శాఖ అధికారులు చెబుతున్నారు.
- అగ్ని ప్రమాదాల్లో మాత్రమే వినియోగించడానికి ఉపకరించే అండర్ గ్రౌండ్‌వాటర్ ట్యాంక్, ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ తప్పనిసరి. ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ మాత్రమే ఉంది. దీన్ని సాధారణ వాడకానికి వినియోగిస్తున్నారు.
- అగ్ని ప్రమాదాల సందర్భంలో నీటిని సరఫరా చేసేందుకు విద్యుత్, డీజిల్, జాకీ పంప్‌లు ప్రత్యేకంగా ఉండాలి. కానీ.. ‘డెక్కన్’లో ఎంత వెతికినా కనిపించవు.

మంటలు అదుపులోకి తెచ్చాం: ఫైర్ డీజీ నాగిరెడ్డి

రాంగోపాల్‌పేట్: పదుల సంఖ్యలో ఫైర్ ఇంజిన్లను రప్పించి మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించాం. పెట్రోలియం ఉత్పత్తులతో తయారు చేసే సీటు కవర్లు, సింథటిక్ క్లాత్, ప్లాస్టిక్ వస్తువులు ఉండటంతో మంటలు అదుపులోకి రావడం లేదు. సెల్లార్ నుంచే మంటలు మొదలైనట్లు ప్రాథమికంగా తేలింది. మంటలు అదుపు చేసే క్రమంలో ఇద్దరు ఫైర్ ఆఫీసర్లు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. లోపల మరో ముగ్గురు ఉన్నారని చెబుతున్నారని ఇంత వరకు వారి ఆచూకీ మాత్రం తెలియ రాలేదు.

అమెరికా నుంచి మేయర్ ఆరా

అమెరికా పర్యటనలో ఉన్న మేయర్ విజయలక్ష్మి సికింద్రాబాద్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై ఆరా తీశారు. అక్కడినుంచే అధికారులను అప్రమత్తం చేశారు. జోనల్ కమిషనర్, ఈవీడీఎం అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు.

సురక్షిత ప్రాంతానికి 500 మంది తరలింపు

రాధా ఆర్కేడ్ వెనుక వైపు ఉన్న కాచిబోలి బస్తీకి చెందిన 500 మందిని రెవెన్యూ అధికారులు ముందుజాగ్రత్త చర్యగా ఖాళీ చేయించారు. వీరిని డీవీ కాలనీలోని జైన్ తెరాపంత్ భవన్‌కు తరలించి భోజనం, వసతి ఏర్పాటు చేశారు.





సురక్షిత ప్రాంతాలకు సమీప అపార్టుమెంట్‌వాసుల తరలింపు



ఘటనా స్థలంలో గుమిగూడిన ప్రజలు

తనిఖీలెక్కడ?

సాక్షి, సిటీబ్యూరో: ఎప్పుడు ప్రమాదాలు జరిగినా ఇకపై ఇలా జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని, మంత్రులు, అధికారులు ప్రకటించడం పరిపాటిగా మారింది. అంతకుమించి ఆ తర్వాత చర్యలుండటం లేవు. భవనాలు కూలినా అంతే. అగ్నిప్రమాదాలు జరిగినా అదే వైఖరి. తాజాగా సికింద్రాబాద్ మినిస్టర్‌రోడ్‌లో అగ్ని ప్రమాదం జరిగిన భవనాన్ని పరిశీలించిన మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ జనావాసాల మధ్య అనుమతుల్లేకుండా ఏర్పాటు చేసిన గోడౌన్‌లు, తదితరమైన వాటిపై స్పెషల్ డ్రైవ్ చేపడతామన్నారు. గత సంవత్సరం బోయగూడలో స్క్రాప్‌గోడౌన్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 11 మంది మరణించినప్పుడు సైతం ఇలాంటి ప్రకటనలే చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏంచేశారో ఎన్ని భవనాలు తనిఖీలు చేశారో, ఎలాంటి చర్యలు తీసుకున్నారో జీహెచ్‌ఎంసీ ఫైర్‌సేఫ్టీ విభాగం వెల్లడించలేదు. అప్పట్లో హోంమంత్రి సమక్షంలో జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు ఏమైందో తెలియదు. **గోడౌన్లు, షోరూమ్‌లు, హోటళ్లు, హాస్పిటళ్లు, పబ్‌ల దాకా అదే పరిస్థితి వేటికీ నిబంధనల** మేరకు సెట్‌బ్యాక్‌లుండవు. ఫైర్‌సేఫ్టీ ఏర్పాట్లు అసలే ఉండవు. గత సంవత్సరమే ఖాజాగూడ, తదితర ప్రాంతాల్లోనూ జరిగిన అగ్ని ప్రమాదాలు నగర ప్రజలింకా మరచిపోలేదు.

చర్యలేవీ?

జీహెచ్‌ఎంసీ ఫైర్‌సేఫ్టీ విభాగం అగ్నిప్రమాదాలు జరిగితే ఎక్కువ మందికి అపాయం జరిగే బార్లు, పబ్‌ల వంటివాటిపై తొలుత చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. వాటి తర్వాత హోటళ్లు, హాస్పిటళ్లపై చర్యలుంటాయని హెచ్చరించింది. కానీ ఇప్పటి వరకు ఒక్కదానిపైనా చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. నగరంలో, చుట్టుపక్కల దాదాపు 20వేలకు పైగా గోడౌన్లే ఉన్నాయి. జీహెచ్‌ఎంసీ పరిధిలో కనీసం పదిశాతం భవనాలకు కూడా ఫైర్‌సేఫ్టీ ఏర్పాట్లు లేవు. గతంలో నగరంలోని భవనాలకు సంబంధించి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని భావించిన జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు టౌన్‌ప్లానింగ్, ఫైర్‌సేఫ్టీ, ఆరోగ్యం– పారిశుద్ధ్యం, రెవెన్యూ విభాగాలకు చెందిన అధికారులను బృందాలుగా ఏర్పాటుచేసి, తనిఖీలు నిర్వహించి, ఫైర్‌సేఫ్టీ లేని భవనాలపై చర్యలు తీసుకోవాలనుకున్నారు. కానీ.. ఇప్పటి వరకు అమలు కాలేదు. కనీసం ఫైర్‌సేఫ్టీ విభాగమైనా చర్యలు తీసుకుందా అంటే అదీ లేదు. జీహెచ్‌ఎంసీలో ఫైర్‌సేఫ్టీతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అధికారాలు ఉన్న విభాగం కూడా.. ఎన్ని అగ్ని ప్రమాదాలు జరుగుతున్నా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోంది.

ప్రజల ప్రాణాలు గాలిలో దీపాలు

- పట్టని అధికార యంత్రాంగాలు
- ఘటన జరిగినప్పుడే హడావుడి
- ప్రాణాలు తీస్తున్నవి వాణిజ్య భవనాలే

నిబంధనలకు ‘నిప్పు’

సాక్షి, సిటీబ్యూరో: గత ఏడాది బోయగూడలోని స్క్రాప్ దుకాణం 11 మందిని పొట్టనపెట్టుకుంది... సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని రూబీ లాడ్జి ఎనిమిది మంది ఉసురుతీసింది... తాజాగా మినిస్టర్స్ రోడ్‌లోని డెక్కన్ కార్పొరేట్ భవనంలో ముగ్గురు గల్లంతయ్యారు... ఇలా వరుస ప్రమాదాలు జరుగుతున్నా.. అగ్నిమాపక నిబంధనల విషయంలో యాజమాన్యాలు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయో అర్థమవుతోంది. ఇలాంటి కమర్షియల్ భవనాలు ఎన్నో ఉన్నాయి. వీటి విషయంలో జీహెచ్‌ఎంసీ, అగ్నిమాపక శాఖ అధికారులు సైతం కళ్లు మూసుకుని కాలం వెళ్లదీస్తున్నారు. ఇవి చేసిన, చేస్తున్న ఉల్లంఘనల విషయం అటు పాలకులు, ఇటు అధికారులకు పట్టడంలేదు. ఏదైనా ఘటన జరిగినప్పుడు మాత్రమే ఒకటి రెండు రోజులు తనిఖీలు, చర్యల పేరుతో హడావుడి చేస్తారు. ఎలాంటి అనుమతులు లేకపోయినా భవనాలు, పై అంతస్తులు నిర్మించుకోవడం, ఆ తర్వాత పై స్థాయిలో పైరవీలు చేసి అనుమతులు తీసుకోవడమో, మ్యానేజ్ చేయడమో నగరంలో మామూలైంది.

- జీహెచ్‌ఎంసీ ఎన్ని నిబంధనలు పెట్టినా, చట్టాలు తీసుకువచ్చినా అవన్నీ కేవలం కాగితాలకే పరిమితం అవుతున్నాయి. అన్ని శాఖలు మూకుమ్మడిగా అనుమతి నిరాకరించిన అనేక బహుళ అంతస్థు భవనాలు, వాణిజ్య సముదాయాలకు ప్రభుత్వమే వివిధ సందర్భాల్లో అనుమతులు మంజూరు చేసింది. వీటి విషయంలో న్యాయస్థానాలు సైతం పలుమార్లు మొట్టికాయలు వేసినా... పటిష్ట చర్యలు తీసుకోవడానికి మాత్రం వెనుకడుగు వేస్తోంది.
- కోఠిలోని పుష్పాంజలి కాంప్లెక్స్‌లో చోటు చేసుకున్న అగ్నిప్రమాదం ఈ విషయంలో అందరి కళ్లూ తెరిపించింది. ఆ తర్వాత జరిగిన మీనా జ్యువెలర్స్ ఉదంతంతో అధికార గణం మరింత అప్రమత్తమయ్యామంటూ ఊదరగొట్టింది. ఇవన్నీ కేవలం ఆరంభ శూరత్వాలుగానే మిగిలిపోయాయి. ముఖ్యంగా నగరంలో ఉన్న అని భవనాలను సందర్శించి ఫైర్ సేఫ్టీ మెజర్స్ పరీక్షిస్తామని, నిబంధనల ప్రకారం లేని వాటి యజమానులను చైతన్య పరుస్తామని, ఆ తరవాత కఠినంగా వ్యవహరిస్తామని అధికారులు అనేక సందర్భాల్లో ప్రకటించారు.
- ప్రమాద ఘటనలు జరిగిన సందర్భంలో వాడీవేడిగా వెలువడే ఈ ప్రకటనలు ఆ తర్వాత చల్లబడిపోతున్నాయి. రోజుల గడిచే కొద్దీ ఈ విషయాలనే మర్చిపోతున్నారు. గతంలో అధికారులు నిర్వహించిన సర్వేలో ఇలాంటి భవనాలు నగరంలో వేల సంఖ్యలో ఉన్నాయని బయటపడింది. అయినా ఇప్పటికీ వీటిపై తీసుకున్న సరైన చర్యలు లేవు. అందుకే ఎక్కడపడితే అక్కడ అక్రమ భవనాలు వెలుస్తున్నాయి. గురువారం డెక్కన్ కార్పొరేట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంతో పరిస్థితి మరోసారి వేడెక్కింది. ఇకనైనా అధికారులు కాస్త కఠినంగా వ్యవహరించి సరైన చర్యలు తీసుకోకపోతే... అనేక మంది అమాయక ప్రాణాలను బలి కావాల్సిందేనని నగరవాసులు వ్యాఖ్యానిస్తున్నారు.



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

అంటుకుంటే అంతేనా?

నగర విస్తరణకు తగ్గట్టుగా పెరగని అగ్నిమాపక పరికరాలు



అగ్గి అంటుకుంటే బుగ్గిపాలు కావాల్సిందేనా? ప్రమాద సమయంలో కాపాడేందుకు సరైన అగ్నిమాపక వ్యవస్థ నగరంలో అందుబాటులో లేదా?.. అంటే అవుననే నిరూపిస్తున్నాయి అగ్ని ప్రమాద ఘటనలు. సికింద్రాబాద్ పరిధిలోని ‘డెక్కన్ కార్పొరేట్’ గురువారం చోటు చేసుకున్న భారీ అగ్నిప్రమాద ఘటనలో మంటల తీవ్రత అధికంగా ఉంది. గంటల తరబడి అగ్నిమాపక సిబ్బంది శ్రమించినా మంటలు అదుపులోకి రాని పరిస్థితి నెలకొంది. అగ్ని ప్రమాదం జరిగిన తర్వాత వీలైనంత తక్కువ సమయంలో ఫైర్ సిబ్బంది స్పందించడం, తగిన పరికరాలతో రంగంలోకి దిగడం అత్యంత ప్రధానమైంది. అలా చేస్తే మంటలను అదుపులోకి తేవడంతోపాటు ప్రమాద తీవ్రత, నష్ట తీవ్రతను తగ్గించవచ్చు. అగ్నిమాపక సిబ్బందికి తగిన సమర్థత ఉంటున్నా.. కొన్నిసార్లు అందుబాటులో సరైన పరికరాలు లేకపోవడంతోనూ వారు ఆశించిన రీతిలో స్పందించలేకపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జీహెచ్‌ఎంసీ అధికారుల కాసుల కక్కుర్తి, అగ్నిమాపక శాఖలోని కొందరు లంచావతారుల కారణంగా బహుళ అంతస్తుల నిర్మాణాలకు అనుమతులు అలవోకగా లభిస్తున్నాయి. నగరంలో కేవలం రెండంటే రెండు మాత్రమే బ్రాంటో నిచ్చెనలు ఉన్నాయి. బహుళ అంతస్థుల భవనాల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు రెస్క్యూ ఆపరేషన్‌లో ఈ నిచ్చెలను అంత్యంత కీలకమైనవి. కింది అంతస్థుల్లో మంటలు, పొగ వ్యాపించినప్పుడు అగ్నిమాపక సిబ్బంది ఈ భారీ నిచ్చెనల ద్వారా పై అంతస్తులకు చేరే వీలుంటుంది. ప్రమాదంలో చిక్కుకున్న వారిని కాపాడి వారిని సురక్షితంగా కిందకు చేర్చడంలోనూ ఈ భారీ నిచ్చెనలు ఉపయోగపడాయి. ప్రస్తుతం ఉన్న రెండు బ్రాంటో నిచ్చెనల్లో ఒకటి సికింద్రాబాద్ పరిధిలో, మరోటి మాదాపూర్ ప్రాంతంలో అందుబాటులో ఉన్నట్టు సమాచారం.

మంజూరు మంజూరు చేసినా..

అగ్నిమాపక శాఖకు ప్రస్తుతం ఉన్న బ్రాంటో నిచ్చెనకు అదనంగా మరో 101 మీటర్ల బ్రాంటో స్కై లిఫ్టనకు ప్రభుత్వం మంజూరు లభించింది. నిధులు మాత్రం విడుదల చేయడం లేదు. ఈ బ్రాంటో స్కై లిఫ్టనకు దాదాపు రూ. 25 కోట్ల ఖర్చవుతుందని, ఇంత పెద్ద మొత్తాన్ని కేటాయించేందుకు ప్రభుత్వం ఆసక్తి చూపడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

ఓనమాలకు ఆనవాలు!

ఘనాపాఠీల చదువులకు కేరాఫ్ బేగంపేట ‘హెచ్‌పీఎస్’

సనత్‌నగర్: ప్రపంచ సాఫ్ట్‌వేర్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల.. ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి.. మాజీ డీజీపీ దినేష్‌రెడ్డి.. సినీనటులు అక్కినేని నాగార్జున, రామ్ చరణ్.. ప్రస్తుత నగర కమిషనర్ సీవీ ఆనంద్.. ప్రఖ్యాత క్రికెట్ వ్యాఖ్యత హర్షభోగ్లే.. ఇలా ఏ రంగాన్ని తట్టినా మేటి స్థానాల్లో నిలబడిన వారెందరో. వారందరికీ అది పునాది రాయి.. ఇదే వారి ప్రఖ్యాతికి మైలు రాయి. రాష్ట్ర, దేశ ఖ్యాతిని ఖండాంతరాలకు తీసుకువెళ్లింది. అక్కడ విద్యాభ్యాసం చేసిన ఎందరో ప్రస్తుతం ఉన్నత శిఖరాలను అధిరోహించి భరతమాత ముద్దు బిడ్డలుగా ఎదిగారు. వారంతా ఓనమాలు నేర్చుకున్న ఆ సరస్వతీ నిలయానికి అక్షరాలా నూరేళ్లు. అదే బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్). నేటినుంచి శతాబ్ది ఉత్సవాలు జరుపుకొంటున్న హెచ్‌పీఎస్‌పై ప్రత్యేక కథనం.

అవతరణ ఇలా..

- ఉన్నత వర్గాల వారి కోసం ముఖ్యంగా నవాబులు, జాగీర్‌దార్లు, బ్రిటిష్ అధికారుల పిల్లల చదువుల కోసం 1923లో బేగంపేటలో ‘జాగీర్‌దార్ కాలేజ్’ పేరుతో ఈ స్కూల్ షురువైంది. దీర్ఘకాలిక లీజు ప్రాతిపదికన పాఠశాలకు స్థలాన్ని కేటాయించారు. బ్రిటిష్ విద్యావేత్త షాక్రాస్ మొదటి ప్రిన్సిపాల్‌గా ముగ్గురు విద్యార్థులతో ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ హయాంలో ప్రారంభమైంది. 1950లో ప్రభుత్వం జమీందారీ వ్యవస్థకు స్వస్తి చెప్పడంతో అప్పటివరకు కేవలం ప్రముఖుల పిల్లలకే పరిమితమైన జాగీర్‌దార్ స్కూల్ 1951లో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌గా అవతరించింది.
- నాటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ మొదటి అధ్యక్షుడిగా హెచ్‌పీఎస్ సొసైటీ ఏర్పడింది. 1988 వరకు బాలురకు మాత్రమే పరిమితమైన హెచ్‌పీఎస్‌లో ఆ తర్వాత బాలికలకు కూడా ప్రవేశాలు కల్పించారు. దాదాపు 122 ఎకరాల సువిశాల ప్రాంగణం.. పెద్ద క్రీడా మైదానం.. ఎటు చూసినా పచ్చదనం.. లైబ్రరీ, ఇ–లైబ్రరీ, డైనింగ్‌హాల్, ఆధునిక లేబరేటరీలు, హాస్పిటల్, అన్ని రకాల క్రీడా కోర్టులు, గుర్రపు స్వారీ.. ఇలా అత్యాధునిక వసతులతో హెచ్‌పీఎస్ అలరారుతోంది.
- ప్రస్తుతం ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు 3,200 మంది పైచిలుకు విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. అప్పట్లోనే అద్భుతమైన ఆర్కిటెక్చర్‌తో ఇండో– సారాసెనిక్ శైలిలో పాఠశాల భవనాన్ని నిర్మించారు. హెచ్‌పీఎస్‌కు విద్యారంగంలోని దాదాపు అన్ని రకాల ఉన్నత స్థాయి అవార్డులు వరించాయి. ఎడ్యుకేషన్ వరల్డ్, ఫ్యూచర్ 50 అవార్డు, ఎడ్యుకేషన్ టుడేస్ ఇండియా స్కూల్ మెరిట్ అవార్డ్, బెస్ట్ ఇన్నోవేటివ్ కే–12 స్కూల్ అవార్డులను సొంతం చేసుకుంది. ప్రస్తుతం పాఠశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ మాధవ్‌దేవ్ సరస్వత్ కొనసాగుతున్నారు.

నేటినుంచి శతాబ్ది ఉత్సవాలకు శ్రీకారం

- ఎంతోమంది ప్రముఖుల విద్యాభ్యాసానికి నెలవు
- ఖండాంతరాల ఖ్యాతి చాటిన ! పూర్వ విద్యార్థులు
- 1923లో ‘జాగీర్‌దార్ కాలేజ్’ పేరుతో ప్రారంభం
- దినదినాభివృద్ధి చెందుతూ నలుదశలా ప్రాభవం
- అతిపెద్ద ఇండియన్ సైన్స్ ఫెస్టివల్‌కు సంసిద్ధం

అతిపెద్ద ఎడ్యుకేషన్ సైన్స్ ఫెస్టివల్..

హెచ్‌పీఎస్ శతాబ్ది ఉత్సవాలు ఏడాది పొడవునా నిర్వహించాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు పలు ప్రతిష్టాత్మక కార్యక్రమాల నిర్వహణను చేపట్టింది. అందులో భాగంగా మొదటి దఫాగా ఈ నెల 20 నుంచి 27 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 20 నుంచి 22 వరకు మూడు రోజుల పాటు ఇండియా సైన్స్ ఫెస్టివల్ (ఐఎస్‌ఎఫ్)తో శతాబ్ది ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 22న సింఫనీ ఆర్కెస్ట్రా ఆఫ్ ఇండియా ప్రదర్శన ఉంటుంది. 22 నుంచి 27 మధ్యన రౌండ్ స్క్వేర్ కాన్ఫరెన్స్‌లు నిర్వహించనున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మున్సిపల్ శాఖ మంత్రి కేటీ రామారావు, ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్‌రంజన్‌లు హాజరుకానున్నారు.

సమాజానికి అమూల్యమైన సేవ..

విద్య ద్వారా సమాజానికి అమూల్యమైన సేవను హెచ్‌పీఎస్ అందిస్తోంది. సైన్స్, ఆర్ట్, మ్యూజిక్, డ్యాన్స్, అడ్వెంచర్, ఇన్నోవేషన్, ఎక్స్‌పోజర్, సహకారం, నెట్‌వర్కింగ్, కాన్ఫిడెన్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పరంగా ప్రయోజనం చేకూర్చేలా శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నాం.
– డాక్టర్ మాధవ్‌దేవ్ సరస్వత్, ప్రిన్సిపాల్




నగరంలో నేడు

- కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ఉదయం 9.30 గంటలకు రెజిమెంటల్ బజార్‌లో 'రోజ్ గార్ మేళా' లో భాగంగా అపాయింట్ మెంట్ లెటర్స్ పంపిణీ చేస్తారు.
- భారత మాత మహా హారతి కార్యక్రమంలో భాగంగా సాయంత్రం 5.30 గంటలకు నెక్లెస్ రోడ్‌లో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి భూమి పూజ చేస్తారు.
- కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి కాచిగూడ ఘనశ్యామ్ పటేల్ భవన్‌లో పశు సంరక్షణకు ఏర్పాటు చేసిన సంజీవని డోర్ స్టెప్ మొబైల్ వెటర్నరీ సర్వీసెస్‌ను సాయంత్రం 4 గంటలకు ప్రారంభిస్తారు.
- కుటుంబ వ్యవస్థలో క్షీణిస్తున్న విలువలు దానిపై ప్రభావాలు అంశంపై సంస్కార్ జాగరణ్ మంచ్ ఆధ్వర్యంలో సమావేశం మధ్యాహ్నం 12 గంటలకు హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో జరుగుతుంది.

వాడ వాడలా 'వెలుగు'..

- జిల్లా వ్యాప్తంగా కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభం
- 11 వేలకు పైగా పరీక్షలు... 4వేలపైగా కంటి అద్దాల పంపిణీ



సీతాఫల్‌మండి కంటివెలుగు కేంద్రంలో కళ్లజోడు అందిస్తున్న శాసనసభ డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా రెండవ దశ కంటి వెలుగు కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. నగరంలో పలు చోట్ల జరిగిన ప్రారంభోత్సవాల్లో అధికార పార్టీ నేతలు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

తొలిరోజే లక్ష్యానికి దగ్గరగా...

ఈ కార్యక్రమంలో భాగంగా ఒక్కో శిబిరంలో రోజుకి సగటున 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించుకోగా... తొలిరోజే విజయ్ నగర్ కాలనీ తదితర చోట్ల లక్ష్యాన్ని దాటడం విశేషం. నగరవ్యాప్తంగా ఏర్పాటైన శిబిరాలు 115 కాగా తొలిరోజు కంటి వెలుగు కార్యక్రమంలో చేసిన కంటి పరీక్షలు, కంటి అద్దాల పంపిణీ వివరాలు ఇలా ఉన్నాయి.

తొలిరోజు కంటి పరీక్షలు చేయించుకున్నవారు	11654
పురుషులు	4846
మహిళలు	6808
ఎటువంటి కంటి సమస్యలు లేనివారు	5906
కంటి అద్దాలు అవసరం పడి అందుకున్నవారు	4089
వీరిలో 40ఏళ్ల లోపు వయసువారు	467
వీరిలో 40ఏళ్లు పైబడినవారు	3622
కంటి అద్దాలు ఇవ్వవలసినవారి సంఖ్య	1639

ఈ కార్యక్రమం ద్వారా అర్హులందరికీ కంటి పరీక్షలు, కంటి అద్దాల పంపిణీ సజావుగా జరిగేందుకు పూర్తి స్థాయిలో జిల్లా వైద్య అధికారులు ఏర్పాట్లు చేశారు. అంధత్వ రహిత జిల్లా లక్ష్య సాధనలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమం కోసం నగరంలోని విభిన్న ప్రాంతాల్లో 152 వైద్య కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చారు, ఆయా కేంద్రాల్లో సేవలు అందించేందుకు గాను 115 బృందాలను ఏర్పాటు చేశారు. ఈ శిబిరాల్లో మంచినీరు, విద్యుత్ సౌకర్యాలు, టాయిలెట్స్ వంటి వసతులు సిద్ధం చేశారు. అత్యవసర పరిస్థితిలో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేసేందుకు 6 అదనపు బృందాలను కూడా సిద్ధంగా ఉంచారు. అదే విధంగా ఎటువంటి సేవా లోపాలూ లేకుండా శిబిరాల నిర్వహణ సాగేలా పర్యవేక్షణకు గాను 3 క్వాలిటీ మానిటరింగ్ టీమ్స్ కూడా ఏర్పాటు చేశారు. వందరోజుల పాటు కొనసాగే ఈ కార్యక్రమంలో ఆదివారం, ప్రభుత్వ సెలవుదినాల్లో తప్ప వారంలో 5 రోజులు శిబిరాలు పనిచేస్తాయి.

- 18ఏళ్లు పైబడిన వారందరికీ ఈ శిబిరాల్లో కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు.
- ఆధార్ కార్డ్ తప్పనిసరిగా తీసుకురావాలి. అదే విధంగా ఓటీపీ పంపుతారు కాబట్టి ఒక మొబైల్ నెంబర్ కూడా ఉండాలి.
- ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకూ ఈ శిబిరాలు పనిచేస్తాయి.
- డాక్టర్ ప్రాథమిక పరీక్షలు చేశాక అవసరాన్ని బట్టి కంటి పవర్‌ను సంబంధిత నిపుణులు పరీక్ష చేస్తారు. ఆ ఫలితాన్ని అనుసరించి అవసరానికి తగ్గ కంటి అద్దాలు తమ దగ్గర రెడీగా ఉంటే అప్పటికప్పుడే ఇచ్చేస్తారు. లేదంటే ఒక 15 రోజుల నుంచి నెల రోజులలోగా లబ్ధిదారుని ఇంటి ముంగిటికే తెచ్చి అందజేస్తారు.
- శస్త్ర చికిత్స అవసరాన్ని శిబిరంలోని వైద్యులు సరోజిని దేవి కంటి ఆసుపత్రి లేదా మరోచోటుకు సిఫారసు చేస్తారు. అక్కడ సర్జరీ తప్పనిసరి అని నిర్ధారిస్తే శస్త్ర చికిత్స చేయిస్తారు.

అధ్యాపక ఉద్యోగాలను భర్తీ చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్‌సెట్-2022 ఫలితాలను ప్రకటించిన అనంతరం రాష్ట్రంలో ఖాళీగా ఉన్న డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీల లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని తెలంగాణ డిగ్రీ లెక్చరర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కిశోర్‌కుమార్ సీఎం కేసీఆర్, టీఎస్‌పీఎస్సీ, ఇతర అధికారులను కోరారు. రాష్ట్రంలో వివిధ పీజీ కోర్సులు పూర్తి చేసిన 1.50 లక్షల మంది అభ్యర్థుల మూడేళ్ల నిరీక్షణ ఫలించి గత నెల టీఎస్‌సెట్ నోటిఫికేషన్ విడుదలైనట్లు తెలిపారు. అధ్యాపక ఉద్యోగాల భర్తీకి, టీఎస్‌సెట్‌కు ఒకే సారి నోటిఫికేషన్ విడుదల చేయడంతో పీజీ కోర్సులు పూర్తి చేసిన నిరుద్యోగ అభ్యర్థులు నష్టపోతారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ఔటర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

- లారీ కిందికి దూసుకెళ్లిన మారుతి జెన్ కారు
- ఇద్దరు మృతి, నలుగురికి గాయాలు
- కింగ్ కోఠి నుంచి జహీరాబాద్‌కు వెళుతుండగా ఘటన





అబ్దుల్ సమద్, అజన్(ఫైల్)

గచ్చిబౌలి: ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం లో కారు డ్రైవర్‌తో పాటు ఓ బాలుడు మృతి చెందగా మరో నలుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని వట్టినాగులపల్లి శివార్లలో ఔటర్ రింగ్ రోడ్డుపై బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. సీఐ గోనె సురేష్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కింగ్ కోఠికి చెందిన అబ్దుల్ సమద్(33) తన చెల్లెలు ఫరా ఫాతిమా(30), అల్లుళ్లు హర్షద్(23), నిదా ఫాతిమా, అజన్(09), ఉమెద్(07)లను జహీరాబాద్‌లో దిగబెట్టేందుకు బుధవారం రాత్రి మారుతీ జెన్ కారులో బయలు దేరాడు. వట్టినాగులపల్లి శివార్లలో ఔటర్ రింగ్ రోడ్డుపై అతి వేగంగా వెళుతున్న మూడో లేన్‌లో వెళుతున్న లారీ కిందికు దూసుకెళ్లింది. ఈ ఘటనలో డ్రైవింగ్ చేస్తున్న సమద్(33) అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడి హజన్(09) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఫాతిమా, హర్షద్, నిధా ఫాతిమా, ఉమెద్‌లకు గాయాలు కావడంతో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.



లారీ కిందకు దూసుకెళ్లిన కారు

అత్తగారింటికి వెళుతుండగా..

సంక్రాంతి సెలవుల నేపథ్యంలో తల్లి గారింటికి వచ్చిన ఫాతిమాను ఆమె సోదరుడు జహీరాబాద్‌లోని అత్తగారింటికి తీసుకెళుతండగా దుర్ఘటన చోటు చేసుకుంది. సోదరుడు సమద్, పెద్ద కొడుకు అజన్ మృతితో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఉస్మానియా ఆస్పత్రిలో మృతదేహాలకు పోస్ట్ మార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ముందు వెళుతున్న లారీని గమనించకుండా వెనక నుంచి ఢీకొట్టడంతో కారు లారీ కిందికు దూసుకెళ్లింది. దాదాపు 100 మీటర్లు అలానే వెళ్లడంతో కారు నుజ్జునుజ్జు అయ్యింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కారును బయటకు తీశారు. మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ హన్మంతరావు, సీఐ గోనె సురేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ చూస్తున్నందుకు పెద్దమ్మ మందలించిందని..

చెరువులో దూకి యువతి ఆత్మహత్య



శ్రావణి

తుర్కయంజాల్: తరచూ సెల్‌ఫోన్ చూస్తున్నందుకు పెద్దమ్మ మందలించిందని మనస్తాపం చెందిన ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని తుర్కయంజాల్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా, పెనుగొండకు చెందిన మానేపల్లి కృష్ణ, శ్రీదేవి దంపతుల కుమార్తె మానేపల్లి శ్రావణి (22) కొద్దిరోజులుగా తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంజాపూర్‌లో ఉంటున్న తన పెద్దమ్మ పద్మావతి ఇంట్లో ఉంటోంది. కంప్యూటర్ కోర్సు నేర్చుకునేందుకు దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ ఇనిస్టిట్యూట్‌లో చేరింది. గురువారం ఉదయం శ్రావణి సెల్‌ఫోన్ చూస్తుండగా పెద్దమ్మ మందలించింది. దీంతో మనస్తాపానికిలోనైన శ్రావణి.. తుర్కయంజాల్‌లోని మాసబ్ చెరువులో దూకింది. సమాచారం అందుకున్న పోలీసులు.. చేపలు పట్టే వారి సహాయంతో ఆమెను బయటకు తీశారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చదువులో వెనకబడుతున్నానని..

మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య



అఖిలేష్ (ఫైల్)

అల్వాల్: చదువులో వెనకబడుతున్నానని మనస్తానికి లోనైన ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మచ్చబొల్లారం తెనుగు బస్తీకి చెందిన సత్యమూర్తి, స్వప్న దంపతులు ప్రైవేట్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వారి కుమారుడు సాయి అఖిలేష్(15) అల్వాల్ సూర్యనగర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. గురువారం అతడి తండ్రి షిరిడీ వెళ్లగా, తల్లి స్వప్న స్కూల్‌కు వెళ్లింది. స్వప్న ఇంటికి తిరిగి వచ్చేసరికి అఖిలేష్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా అఖిలేష్ మృతదేహం వద్ద పోలీసులు సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ కారణంగానే తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు అందులో పేర్కొన్నారు. ఈ విషయమై పాఠశాల యాజమాన్యాన్ని వివరణ కోరగా అఖిలేష్‌కు సంబంధించి పాఠశాలలో ఎలాంటి సమస్యలు లేవని తెలిపారు. పండుగ సెలవుల అనంతరం బుధవారం పాఠశాలకు వచ్చాడని గురువారం హాజరు కాలేదన్నారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. చదువులో వెనుకబడుతుండేవాడని పాఠశాల నుంచి ఒత్తిడి ఉన్నట్లు తెలిసిందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఎమ్మెల్యే రాజాసింగ్‌కు మరోసారి నగర పోలీసుల నోటీసులు



అబిడ్స్: గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ నగరంలోని మంగళ్‌హాట్ పోలీసులు మరోసారి నోటీసులు జారీ చేశారు. గురువారం రాత్రి మంగళ్‌హాట్ ఎస్.ఐ కె.రాజు పాత కేసుకు సంబంధించి నోటీసులను ఎమ్మెల్యే రాజాసింగ్‌కు అందజేశారు. ఐదు నెలల క్రితం కాంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదు అందడంతో కాంచన్‌బాగ్ పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు. మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి రావడంతో మంగళ్‌హాట్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గురువారం రాత్రి ఎస్.ఐ.రాజు ఎమ్మెల్యే రాజాసింగ్‌కు మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేశారు.

ఐదు నెలలుగా నిద్రపోతున్నారా: ఎమ్మెల్యే రాజాసింగ్

పాతకేసుపై తిరిగి ఐదు నెలల తర్వాత పోలీసులు నోటీసులు జారీచేయడం ఏంటని ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. ఇలాంటి నోటీసులకు తాను భయపడేది లేదన్నారు. ఎప్పుడు అరెస్టు చేసినా సిద్ధంగా ఉన్నానన్నారు. న్యాయ వ్యవస్థ, కోర్టులపై తనకు పూర్తి నమ్మకం ఉందన్నారు.

21న తెలంగాణ ఉద్యమకారుల సన్మాన సదస్సు



మాట్లాడుతున్న మేచినేని కిషన్‌రావు

బంజారాహిల్స్: తొలిదశ తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఇప్పటికి వందసార్లు వినతులు చేసినా ముఖ్యమంత్రి కేసీఆర్ తమకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని 1969 తెలంగాణ ఉద్యమకారుల సమితి అధ్యక్షుడు మేచినేని కిషన్‌రావు ఆరోపించారు. గురువారం బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి ప్రధాన కార్యదర్శి దూసర్ల సుదర్శన్‌రావు, 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు చక్రహరి రామరాజు, ఉపాధ్యక్షుడు వనం చంద్రమౌళితో కలిసి మాట్లాడారు. 1969 ఉద్యమకారుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. తమను గుర్తించాలని, అమరులైన ఉద్యమకారులకు గుర్తింపు కల్పించేందుకు 50 ఎకరాల్లో స్మృతి వనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు సహకరించిన అన్ని రాజకీయ పార్టీలను గౌరవించాలనే ఉద్దేశంతో ఈ నెల 21న రవీంద్రభారతిలో 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల సన్మాన సదస్సును నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్ర మంత్రి, బీజేపీ ఎంపీ కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, టీబీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌లను ఈ సందర్భంగా సత్కరించనున్నట్లు తెలిపారు. తొలి దశ ఉద్యమకారుల స్థితిగతులపై అధ్యయనం చేయడానికి ఒక కమిటీ వేసి నాటి ఉద్యమంలో పాల్గొన్న వారిని తెలంగాణ సమర యోధులుగా గుర్తించాలని డిమాండ్ చేయడానికి ఈ సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. తమకు పింఛన్‌తో పాటు ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.

మార్చి 15లోగా పనులు పూర్తి

సాక్షి, సిటీబ్యూరో: చారిత్రక మక్కా మసీదు సంరక్షణ, పునరుద్ధరణ పనులు తుది దశలో ఉన్నాయని, రంజాన్ నెల ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.షఫీవుల్లా తెలిపారు. గురువారం ఆయన అధికారులతో కలిసి మక్కా మసీదు పనులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రానున్న రంజాన్ నెల ప్రారంభం కంటే ముందు మక్కా మసీదు పనులు పూర్తి చేయాలని ఆదేశించామన్నారు. ఇప్పటి వరకు దాదాపు 90 శాతం పనులు పూర్తి కాగా, మరో 10 శాతం పనులు మిగిలి ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మక్కా మసీదు పునరుద్ధరణ, సంరక్షణకు రూ.8.48 కోట్ల నిధులు కేటాయించిందన్నారు. పురావస్తు విభాగం ఈ మసీదును హెరిటేజ్ బిల్డింగ్‌గా గుర్తించిందన్నారు.. డ్రైనేజీ, టైల్స్, టాయిలెట్ల మరమ్మత్తుల కోసం మరో రూ. 5.6 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. రూ.95 లక్షలతో జీహెచ్ఎంసీ టాయిలెట్ పనులకు కూడా పూర్తి చేశామన్నారు. వజూ చేసే ప్రాంతంలో వాటర్ ఫౌంటెన్ ఏర్పాటు చేశామన్నారు. మంచి నీటి ఏటీఎమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మార్చి 21 నుంచి రంజాన్ నెల ప్రారంభమౌతున్నందున మార్చి 15లోగా పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మహ్మద్ ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా కేసులో నిందితుడికి పదేళ్ల జైలు



ఖాగా బెహెరా

సికింద్రాబాద్: గంజాయి అక్రమ రవాణా చేస్తూ రైల్వే పోలీసులకు పట్టుబడిన వ్యక్తికి 1 వ అదనపు మెట్రోపాలిటన్ కోర్టు గురువారం పదేళ్ల జైలుశిక్ష, రూ.లక్ష జరిమానా విధించింది. సికింద్రాబాద్ జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీను గురువారం వివరాలు వెల్లడించారు గత నవంబర్ 11న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ 10వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌పై జీఆర్‌పీ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా 3 లగేజీ బ్యాగులతో ఒక వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని అదుపులోకి తీసుకుని బ్యాగులను సోదా చేయగా 42 కిలోల గంజాయి ని గుర్తించారు. లతడిని ఒడిస్సా రాష్ట్రం, గంజాం జిల్లాకు చెందిన ఖాగా బెహెరాగా గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతను ఇచ్చాపురం నుంచి మహారాష్ట్రకు సికింద్రాబాద్ మీదుగా రైలులో ప్రయాణిస్తూ అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించిన రైల్వే పోలీసులు అతడిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణ అనంతరం న్యాయస్థానం జైలు శిక్ష, జరిమానా విధిస్తూ గురువారం తీర్పు చెప్పింది. ఖాగా బెహెరాపై పీడీ యాక్టు నమోదు చేసినట్లు జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ వివరించారు.

నకిలీ పోలీస్, ఫేక్ రిపోర్టర్ ఆటకట్టు

- స్పా నిర్వాహకులను బెదిరించి రూ.20 వేలు వసూలు
- నిందితుల అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

గోల్కొండ: షేక్‌పేట్‌లోని ఓ మసాజ్ సెంటర్ నిర్వాహకులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న నకిలీ టాస్క్ ఫోర్స్ అధికారి, నకిలీ రిపోర్టర్‌లను వెస్ట్ జోన్ కమిషనర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ డీసీపీ (ఓఎస్‌డి) రాధాకిషన్ రావు గురువారం వివరాలు వెల్లడించారు. నగరానికి చెందిన మునావర్ హసన్‌ఖాన్, గఫార్ అలీఖాన్, సయ్యద్ అబ్దుల్ రవూఫ్ ఎలియాస్ రవూఫ్ ఎలియాస్ ఖాలిద్ స్నేహితులు వివిధ వృత్తుల్లో ఉన్న వారు తమ సంపాదన చాలక పోవడంతో అక్రమంగా డబ్బు సంపాదించడానికి పథకం పన్నారు. ఇందులో భాగంగా వీరు ముగ్గురు గురువారం షేక్‌పేట్ ఓయూ కాలనీలోని స్టార్ స్పా అండ్ సెలూన్‌కు వెళ్లారు. మునావర్ హసన్ ఖాన్ మొబైల్ తీసి స్పాలో వీడియో తీస్తుండగా, సఫారీ డ్రెస్‌లో వచ్చిన గఫార్ అలీఖాన్ తాను టాస్క్‌ఫోర్స్ ఆఫీసర్‌నని బుకాయించాడు. స్పా సెంటర్‌లో క్రాస్ మసాజ్‌లు చేస్తున్నారంటూ నిర్వాహకులను బెదిరించి రూ. 20 వేలు తీసుకున్నారు. దీనిపై సమాచారం అందడంతో అక్కడికి చేరుకున్న టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎం.డి.ఖలీల్ పాషా వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుల నుంచి నగదు, నకిలీ ఐడీ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం వారిని గోల్కొండ పోలీసులకు అప్పగించారు.

క్లుప్తంగా

స్టడీ మెటీరియల్ అందజేత



మెటీరియల్ అందిస్తున్న ఉపేందర్‌రెడ్డి

రహమత్‌నగర్: యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు టీ హోప్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు ఉపేందర్ రెడ్డి గురువారం స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలన్న లక్ష్యంతో టీ హోప్ కమ్యూనిటీ సెంటర్ ద్వారా శ్రీ కృష్ణనగర్‌లో ప్రత్యేకంగా ట్యూషన్ చెప్తున్నామని తెలిపారు. స్టడీ మెటీరియల్ బాగా చదివి అత్యధిక మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. ఖైరతాబాద్ ఉప విద్యాశాఖాధికారి సామ్యూల్ రాజ్, ఇన్‌చార్జ్ హెడ్ మాస్టర్ నరసింహ, ఉపాధ్యాయులు తబితా జాసన్, విజయలక్ష్మి, శాంతి , హమూద్ అలీ, నాగరాజు, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

వివాదాల్లో జోక్యం చేసుకుంటే కఠిన చర్యలు:ఎస్‌ఐ



బంజారాహిల్స్: సివిల్ వివాదాల్లో తలదూర్చొద్దు... పంచాయతీల్లో జోక్యం చేసుకోవద్దు...రాత్రి పూట వీధుల్లో తిరుగుతూ న్యూసెన్స్ చేయొద్దు.. ఒక వేళ ఇలాంటి ఘటనలకు పాల్పడినట్లు పోలీసుల దృష్టికి వస్తే ఇప్పుడున్న కేసుతో పాటు మరో కేసు నమోదు చేసి అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేసుకోవాల్సి వస్తుందని రౌడీషీటర్లకు బంజారాహిల్స్ ఎస్‌ఐ ఎస్.కరుణాకర్‌రెడ్డి హెచ్చరికలు జారీ చేశారు. బంజారాహిల్స్ రోడ్ నం. 12లోని భోలానగర్, ఖాజానగర్, సయ్యద్‌నగర్, ఫస్ట్‌లాన్సర్ ప్రాంతాలకు చెందిన 18 మంది రౌడీషీటర్లకు గురువారం పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ, రౌడీషీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు పోలీసుల నిఘా ఉంటుందన్నారు. ప్రతి గురువారం పోలీస్ స్టేషన్‌కు వచ్చి కౌన్సెలింగ్‌లో పాల్గొనాలని సూచించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

లిబర్టీ: ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బీసీ దళ్ అధ్యక్షుడు డి.కుమారస్వామి విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా ముందుకు సాగుతూ దేశంలోని అన్ని రాష్ట్రాలకు తెలంగాణను ఆదర్శ రాష్ట్రంగా ముఖ్యమంత్రి కేసీఆర్ నిలిపారన్నారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. పేదల ఆర్థికాభివృద్ధి, సంక్షేమ ప్రజాహిత పథకాలు ప్రవేశపెట్టి ముఖ్యమంత్రి ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించి వారిలో చెరగని ముద్ర వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాల అందజేత



కార్మికులకు వస్త్రాలు అందజేస్తున్న సూర్యనారాయణ

ఫిలింనగర్: సంక్రాంతి సందర్భంగా జూబ్లీహిల్స్ మాజీ కార్పొరేటర్, ఫిలింనగర్ హౌసింగ్ సొసైటీ కార్యదర్శి కాజా సూర్యనారాయణ గురువారం జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు అందజేశారు. కాలనీలను పరిశుభ్రంగా ఉంచడంలో శానిటేషన్ సిబ్బంది చేస్తున్న కృషికి గుర్తింపుగా ప్రతియేటా నూతన వస్త్రాలు అందజేస్తున్నామని ఆయన అన్నారు.

పర్యావరణ పరిరక్షణకు డబ్ల్యూడబ్ల్యూఎఫ్ కృషి

పంజగుట్ట: ప్రపంచవ్యాప్తంగా జంతు సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ కోసం వరల్డ్ వైడ్ ఫండ్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) సంస్థ పని చేస్తోందని డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా యూత్ అంబాసిడెర్ దీప్షికా యదుగిరి అన్నారు. గురువారం ఆమె సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ.. దేశంలోని వందల యూనివర్సిటీల్లోని విద్యార్థులను కలిశామన్నారు. పర్యావరణానికి హామీ చేయని వస్తువులు తయారు చేస్తే తాము అభివృద్ధి చేస్తామనే థీమ్ ఇచ్చామన్నారు. వందలాది మంది విద్యార్థులు వారి ఆలోచనలు తమతో పంచుకున్నారని తెలిపారు. వినూత్న ఆలోచనలు కల్గి ఉన్న ఆరు బృందాలను విజేతలుగా గుర్తించామన్నారు. ఆ బృందాలను తీసుకుని దేశవ్యాప్తంగా పర్యటిస్తున్నామని అందులో భాగంగా ఈనెల 18, 19 నగరంలో పర్యటించామని తెలిపారు.

‘కంటి వెలుగు’ షురూ

- గౌరీశంకర్ కాలనీలో ప్రారంభించిన మంత్రి తలసాని
- 18 ఏళ్లు పైబడిన వారందరికీ పరీక్షలు

బంజారాహిల్స్: రాష్ట్రంలోని ప్రజలందరికీ కంటి వైద్యం అందించేందుకు ప్రభుత్వం రెండో విడత కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఉచిత కంటి వైద్య శిబిరాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఎలాంటి ఖర్చు లేకుండా నాణ్యమైన వైద్యం అందుబాటులోకి రావడంతో ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొనేందుకు ముందుకొస్తున్నారు.

- మొదటి రోజునే పెద్ద సంఖ్యలో శిబిరాలకు హాజరై పరీక్షలు చేయించుకున్నారు. గతంలో మాదిరిగా కాకుండా ఈసారి మేడిన్ తెలంగాణ అద్దాలను పంపిణీ చేస్తున్నారు.
- శని, ఆదివారం, సెలవు దినాలు మినహా మిగతా రోజుల్లో నిత్యం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కంటి పరీక్షలు చేస్తారు.
- గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పూర్తి స్థాయిలో కంటి పరీక్షలు చేయడంతో పాటు అద్దాలు పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలు సేవలందిస్తున్నాయి.
- 18 ఏళ్ల పైబడ్డ వారందరికీ పరీక్షలు చేసి దృష్టి లోపాలు గుర్తించడంతో పాటు మందులు, కళ్లద్దాలు పంపిణీ చేస్తున్నారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేయించేందుకు ఏర్పాట్లు చేశారు.
- ఒక్కో శిబిరంలో ఎనిమిది మంది సిబ్బంది అందుబాటులో ఉండి పరీక్షలు చేస్తున్నారు.



గౌరీశంకర్ కాలనీలో పరీక్షలకు వచ్చిన వారిని పలకరిస్తున్న మంత్రి తలసాని, ఎంఎల్‌సీ సురభివాణీదేవి, కార్పొరేటర్ కవితారెడ్డి



జవహర్ కాలనీలో కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్



బంజారాహిల్స్ రోడ్ నం. 2లో కంటి వెలుగు శిబిరానికి హాజరైన స్థానికులు

- ఖైరతాబాద్ నియోజక వర్గం పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, సోమాజిగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్ల పరిధిలో తొమ్మిది కంటి వెలుగు శిబిరాలు ప్రారంభమయ్యాయి. ఒక్కో కేంద్రంలో నిత్యం సుమారు 120 మందికి పరీక్షలు చేస్తారు.

ట్విట్టర్, వెబ్‌సైట్ ద్వారా...

- గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లలో ఉంటున్న వారు ఈ శిబిరాలు కావాలంటే జీహెచ్‌ఎంసీ ట్విట్టర్, వెబ్‌సైట్ ద్వారా సంప్రదిస్తే ఇంటి గుమ్మంలోకి పరీక్ష బృందాలు వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. పార్టీలకతీతంగా స్థానిక ప్రజాప్రతినిధులు సహకరించాలని ఇప్పటికే ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

గౌరీశంకర్ కాలనీలో మంత్రి తలసాని....

- బంజారాహిల్స్ రోడ్ నం. 11లోని గౌరీశంకర్‌కాలనీ కమ్యూనిటీ హాల్‌లోని వైద్యశిబిరాన్ని రాష్ట్ర పశు సంవర్ధక శాఖామంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డితో కలిసి ప్రారంభించారు. శిబిరంలో అందుతున్న సేవలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. శిబిరాలకు వచ్చే వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా వైద్య ఆరోగ్య, జీహెచ్‌ఎంసీ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులకు మంత్రి తలసాని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ వెంకటి, ఎస్‌పీహెచ్‌ఓ అనురాధ, డాక్టర్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు. ఆశ వర్కర్లు ఇంటింటికీ వెళ్లి కంటి వెలుగు పథకం ప్రయోజనాలను ప్రజలకు వివరించారు.

జూబ్లీహిల్స్ డివిజన్‌లో....

- జూబ్లీహిల్స్ డివిజన్‌లోని గౌతంనగర్ కమ్యూనిటీ హాల్, బంజారాహిల్స్ రోడ్ నం.2 లోని జవహర్ కాలనీ కమ్యూనిటీ హాళ్లలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాలను కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ ప్రారంభించారు. ఈ రెండు శిబిరాల్లో ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు కార్పొరేటర్ సూచించారు.కార్యక్రమంలో స్థానికులు కిరణ్, శాంతి, దీపాదేవి, లక్ష్మి, జ్యోతి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనగర్‌కాలనీలో..

శ్రీనగర్‌కాలనీ: మధురానగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో కంటివెలుగు కార్యక్రమాన్ని మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దేదీప్య, కాలనీ సంక్షేమ సంఘం నేతలు సాంబశివరావు, సాయికుమార్, గోపాల్‌రెడ్డి, డీఎంసీ రమేష్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిగూడలో...

ఎల్లారెడ్డిగూడ పీజేఆర్ కమ్యూనిటీహాల్‌లో కంటివెలుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, కార్పొరేటర్ వనం సంగీత ప్రారంభించారు. కంటి పరీక్షల అనంతరం పలువురికి అద్దాలను అందజేశారు. నేతలు అప్పుఖాన్, తన్నుఖాన్, మధుయాదవ్, సంతోష్‌గౌడ్, రవి, చినబాబు పాల్గొన్నారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, డీఎంసీ

రహమత్‌నగర్ : రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ నియోజక వర్గం ప్రజలకు విజ్ఞప్తి చేశారు.రహమత్‌నగర్, బోరబండ డివిజన్లలో గురువారం ఏర్పాటు చేసిన కంటి వెలుగు వెలుగు శిబిరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంధత్వ రహిత రాష్ట్రంగా తెలంగాణ కావాలన్న లక్ష్యంతో ప్రభుత్వ రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమం ఏర్పాటు చేసిందన్నారు. . వంద రోజుల పాటు నిర్వహించే ఈ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవా లన్నారు .జీహెచ్‌ఎంసీ సర్కిల్ 19 డీఎంసీ రమేశ్, ఈఈ రాజ్‌కుమార్,ఏఎంహెచ్‌ఓ డా. బిందు భార్గవి,డాక్టర్ అనురాధ, డాక్టర్ అర్పిత, రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ,రహమత్‌నగర్, బోరబండ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు మన్సూర్, కృష్ణ మోహన్, బోరబండ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ సిరాజ్, కో ఆర్డినేటర్ విజయసింహ, ధర్మ, బాబురావు, సింగారి శ్రీనివాస్,విజయ్‌కుమార్,ఏడీ మధు, కొండాపురం నాగరాజు, రవిశంకర్, షేక్ సాబేర్,గఫూర్ తితరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్ డివిజన్‌లో...



‘కంటి వెలుగు’ వైద్య సిబ్బందితో కార్పొరేటర్ విజయారెడ్డి

ఖైరతాబాద్: డివిజన్‌లోని ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్‌లోని జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాల్లోను, శ్రీనివాసనగర్ కమిటీ హాల్లోను కంటి వెలుగు శిబిరాలను ఏర్పాటు చేశారు. ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని కార్పొరేటర్ విజయారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీ మోహన్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ భార్గవ్‌నారాయణ, సైఫాబాద్ ఇన్‌స్పెక్టర్ సత్తయ్య, స్థానిక నాయకులు మహేందర్‌బాబు, రాజు, అనిల్‌కుమార్, మహేష్‌యాదవ్ పాల్గొన్నారు.

హిమాయత్‌నగర్‌లో...



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ దీప్తిప్రియాంక

హిమాయత్‌నగర్: నారాయణగూడలోని కేశవ మెమోరియల్ హైస్కూల్లో కార్పొరేటర్ గడ్డం మహాలక్ష్మి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మంచాల దీప్తి ప్రియాంకతో కలిసి కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు దాదాపు 120మంది కంటి పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 20మందికి రీడింగ్ గ్లాసులను వైద్యులు అందజేశారు. మరికొందరికి ఆపరేషన్‌కు రిఫర్ చేశారు. బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు యాదగిరి తదితర నాయకులు కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించి వైద్యులకు పలు సూచనలు చేశారు.

ప్రతి కార్యకర్త ఇంటింటికీ తిరగాలి: మంత్రి తలసాని

వెంకటేశ్వరకాలనీ: బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి కంటి వెలుగుపై ప్రజలకు అవగాహన కలిగించి వారు శిబిరాలకు వెళ్లి పరీక్షలు చేయించుకునేలా కృషి చేయాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం ఆయన బంజారాహిల్స్ గౌరీశంకర్ కాలనీలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. ‘కంటి వెలుగు ప్రభుత్వ కార్యక్రమం, దానితో మనకు సంబంధం లేదు, అధికారులు చూసుకుంటారు’అని అనుకోవద్దన్నారు. ప్రతి బీఆర్‌ఎస్ కార్యకర్త స్థానికంగా ఉన్న ఇంటింటికీ వెళ్లి, ఆ ఇంట్లోవారు కంటి పరీక్షలు చేయించుకునేలా చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.. కార్యకర్తలు కూడా తమ కుటుంబ సభ్యులకు కూడా తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించాలన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి కూడా పాల్గొన్నారు.

ఫార్మసీ రంగానికి పెరిగిన ఆదరణ



మాట్లాడుతున్న గౌరవ కార్యదర్శి జాఫర్ జావెద్

బంజారాహిల్స్: 20 ఏళ్ల క్రితంతో పోల్చుకుంటే ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఫార్మసీ రంగానికి ఆదరణ ఎంతో పెరిగిందని సుల్తాన్ ఉల్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవ కార్యదర్శి జాఫర్ జావెద్ అన్నారు. సుల్తాన్ ఉలూం ఫార్మసీ కళాశాల సిల్వర్ జూబ్లీ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన అలుమినీ వేడుకల్లో ఆయన మాట్లాడారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు దేశ వ్యాప్తంగానే కాకుండా ప్రపంచంలోని వివిధ దేశాల్లో కూడా ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని అన్నారు. కరోనా కష్టకాలంలో కాలేజీకి చెందిన ఫార్మసీ విద్యార్థులు కొందరు చేసిన సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. అధ్యాపకులకు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ మహ్మద్ వలియుల్లా జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ అనుపమ కోనేరు, వైస్ చైర్మన్ సయీద్ అబ్దుల్ వాహెబ్, జాయింట్ సెక్రటరీ మసూద్ అబ్దుల్ ఖాదీర్, ట్రెజరర్ అక్బర్ అలీ ఖాన్, ఆమెర్ జావెద్ పాల్గొన్నారు.

నేడు ఏఈఈల గోల్డెన్ జూబ్లీ వేడుకలు

పంజగుట్ట: అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ శుక్రవారం (ఈనెల 20న) ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండి శ్రీనివాస్, ఎన్.నాగరాజు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇరిగేషన్ శాఖ స్పెషల్ సెక్రటరీ డాక్టర్ రజత్ కుమార్, అతిథులుగా పలువురు ఇంజినీర్ ఇన్ చీఫ్‌లు, చీఫ్ ఇంజినీర్లు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో కోశాధికారి వై.సంతోష్ రెడ్డి, గౌరవాధ్యక్షుడు టీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

గీత పనివారల సంఘం కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న కూనంనేని తదితరులు

హిమాయత్‌నగర్: గీత కార్మికుల హక్కుల రక్షణకు కమ్యూనిస్టు నాయకుడు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మ భిక్షం స్థాపించిన గీత పనివారల సంఘానికి ఘనమైన చరిత్ర ఉందని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు అన్నారు. హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో గురువారం తెలంగాణ గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి డీజీ సాయిలు గౌడ్, ఉపాధ్యక్షుడు కేవీఎల్, కార్యనిర్వాహక కార్యదర్శి బొమ్మగాని నాగభూషణం తదితరులతో కలిసి గీత పనివారల సంఘం 2023 నూతన సంవత్సరం కేలండర్‌ను కూనంనేని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆర్. సాయిలు గౌడ్, నేతలు టి.యాదయ్య గౌడ్, రాములు గౌడ్, శ్రీధర్ గౌడ్, లింగం గౌడ్, సత్యనారాయణ గౌడ్ పాల్గొన్నారు.

ముమ్మరంగా సీవరేజి పైప్‌లైన్ పనులు



రిచ్‌మండ్ స్కూల్ వద్ద జరుగుతున్న సీవరేజ పైప్‌లైన్ పనులు

ఫిలింనగర్: మురుగు నీటి సమస్య పరిష్కారానికి జూబ్లీహిల్స్ డివిజన్‌కు కోటి రూపాయల వరకు నిధులు మంజూరయ్యాయి. దీంతో బంజారాహిల్స్ రోడ్ నం. 2లోని ఇందిరానగర్, కమలాపురి కాలనీ, జవహర్ కాలనీ బస్తీల్లో ముమ్మరంగా వరద నీటి కాల్వ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఏళ్ల క్రితం వేసిన పైప్‌లైన్ ప్రస్తుత సామర్థ్యానికి సరిపోవడం లేదని స్థానికులు ఎమ్మెల్యే దానం నాగేందర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి ఇక్కడి పైప్‌లైన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. పాత పైపులను తొలగించి ప్రస్తుత నివాసాలకు అనుగుణంగా పైప్ లైన్లు వేస్తున్నట్లు తట్టికాన సెక్షన్ మేనేజర్ రాంబాబు తెలిపారు. మరో పదిరోజుల్లో ఈ పనులు పూర్తవుతాయన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణదారులకు జరిమానాలు



బంజారాహిల్స్ రోడ్ నం. 10లో జరిమానాలు విధిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

బంజారాహిల్స్: ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారిపైన, రోడ్డు పక్కన వాహనాలను అక్రమంగా పార్కింగ్ చేస్తున్న వారిపైన ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝులిపిస్తున్నారు. గత ఐదు వారాల నుంచి బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు ప్రధాన రహదారులు, హోటళ్లు, ఆస్పత్రుల వద్ద స్పెషల్ డ్రైవ్ చేపడుతూ ఫుట్‌పాత్ ఆక్రమణదారులపై కేసులు నమోదుతో పాటు జరిమానాలు విధిస్తున్నారు. ఇదే క్రమంలో గురువారం బంజారాహిల్స్‌రోడ్ నం. 10లో ట్రాఫిక్ పోలీసులు ఫుట్‌పాత్ ఆక్రమణదారులకు జరిమానాలు విధించారు. 41(1) సీపీ యాక్ట్ కింద 12 మందిపై, 39(బి) సీపీ యాక్ట్ కింద 15 మందిపై, అక్రమ పార్కింగ్ చేసిన ఇద్దరు కారు డ్రైవర్లకు జరిమానాలు విధించారు. పంజగుట్ట ట్రాఫిక్ ఇన్‌చార్జి ఏసీపీ రుద్రరాజు, ట్రాఫిక్ సీఐ టి. నరసింహరాజు, ఎస్‌ఐ రాకేష్‌రెడ్డి ఈ డ్రైవ్‌లో పాల్గొన్నారు.

తాగి డ్రైవింగ్ చేసిన ఇద్దరికి జైలు

బంజారాహిల్స్: మోతాదుకు మించి మద్యం తాగి వాహనాలను నడుపుతూ డ్రంకన్ డ్రైవ్‌లో పోలీసులకు పట్టుబడిన ఇద్దరు వాహనదారులకు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. బంజారాహిల్స్ ట్రాఫిక్ సీఐ టి. నరసింహరాజు తెలిపిన వివరాల ప్రకారం... గత నెల 16న, ఈ నెల 1వ తేదీన వివిధ ప్రాంతాల్లో పోలీసులు నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 16 మంది వాహనదారులు మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డారు. వీరందరినీ గురువారం నాలుగో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు. ఇందులో గచ్చిబౌలికి చెందిన కె. కిశోర్(26) డ్రంకన్ డ్రైవ్‌లో రెండుసార్లు పట్టుబడటంతో ఆయనకు ఐదు రోజుల జైలుతో పాటు రూ. 3300 జరిమానా విధించారు. బంజారాహిల్స్‌కు చెందిన మహ్మద్ రియాజ్(30) శ్వాస పరీక్షలో బీఏసీ 320 ఎంజీగా నిర్ధారణ అయింది. ఆయనకు నాలుగు రోజుల జైలుతో పాటు రూ. 2100 జరిమానా విధించారు. మిగతా 14 మందికి రూ.2100 చొప్పున జరిమానా విధించారు. జరిమానాల రూపంలో మొత్తం రూ. 34,800 చెల్లించారు.

‘నా ఓటే నా ఆయుధం’ పాట ఆవిష్కరణ



పాట సీడీని ఆవిష్కరిస్తున్న ఎస్‌కే జోషి, సుద్దాల అశోక్‌తేజ తదితరులు

పంజగుట్ట: ఈ నెల 25న జాతీయ ఓటింగ్ డే సందర్భంగా తెలంగాణ డెవలప్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవీ రావు ఆంగ్లంలో రాసిన పాటను ప్రముఖ రచయిత, గాయకుడు సుద్దాల అశోక్ తేజ ‘నా ఓటే నా ఆయుధం’ పేరిట తెలుగులోకి అనువదించారు. ఈ పాట సీడీని గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాజీ చీఫ్ సెక్రటరీ ఎస్‌కే జోషి.. తెలంగాణ రెడ్‌క్రాస్ చైర్మన్ అజయ్ మిశ్రా, మాజీ పోలీస్ డైరెక్టర్ జనరల్ వీహెచ్ దేశ్‌ముఖ్, సుద్దాల అశోక్ తేజ, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు కె.విద్యాసాగర్, వీఎస్ భాస్కర్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌కే జోషి మాట్లాడుతూ .. ఓటు ఎంతో ముఖ్యమైందో గుర్తించేందుకు, ఎక్కువమంది ఓటు వేసేందుకు ఈ పాట ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సంగీత దర్శకుడు యశోకృష్ణ, గాయకులు రాంకీ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవండి

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి తారిఖ్ అన్వర్



కార్మిక సంఘాల నేతలతో సమావేశమైన తారిఖ్ అన్వర్

హిమాయత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటానికి అండగా నిలవాలని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి తారిఖ్ అన్వర్ కోరారు. దేశంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అన్ని వర్గాల వారు నష్టాన్ని చూశారే తప్పా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కార్మికులు అండగా నిలిస్తే పార్టీ విజయకేతనం ఎగురవేస్తుందనడంలో ఏమాత్రం సందేహం లేదన్నారు. గురువారం హైదరాబాద్ నారాయణగూడలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డిని మాజీ ఎంపీ వి.హనుమంతరావుతో కలిసి తారిఖ్ అన్వర్ పరామర్శించారు. అనంతరం పలు కార్మిక సంఘాల నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తారిఖ్ మాట్లాడుతూ..పార్టీల అభివృద్ధికి, గెలుపునకు ట్రేడ్ యూనియన్ల సహకారం ఎంతో అవసరమన్నారు. అటువంటి ట్రేడ్ యూనియన్లకు కాంగ్రెస్ పార్టీ చేసిన ఎన్నో మంచి కార్యక్రమాలు నేటికీ ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కేంద్రంలోని బీజేపీ అధికారం చేపట్టాక ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ చేయడంతో పాటు ట్రేడ్ యూనియన్లపై కక్ష సాధింపు చర్యలకు పూనుకుందన్నారు. కేంద్ర, రాష్ట్రాలలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు అన్ని ట్రేడ్ యూనియన్లు కలిసికట్టుగా తమకు సహకారం అందించాలని తారిఖ్ అన్వర్ కోరారు. ఐఎన్‌టీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి సంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ.. సంస్థలను, యాజమాన్యాలను బ్యాలెన్స్ చేసుకుంటూ కాంగ్రెస్ పార్టీ పక్షాన నిలుస్తామన్నారు. ఉపాధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి, ప్రధాన కార్యదర్శులు నిరంజన్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

‘ఖమ్మం సభతో ప్రతిపక్షాలకు దడ’

లిబర్టీ: ఎప్పుడు లేని విధంగా ఖమ్మంలో భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ సభ జరిగిందని ఆ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి వెన్న సదానంద్ అన్నారు. కనీవినీ ఎగరని రీతిలో సభ జరిగిందంటే ప్రజల్లో పార్టీకి ఎంత ఆదరణ ఉందో ఇట్టే తెలుస్తోందన్నారు. గురువారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ప్రగతిశీల పథకాలకు బహిరంగ సభకు వచ్చిన జనం నిదర్శనమన్నారు. దేశ రాజకీయాల్లో బీఆర్‌ఎస్ పార్టీ కీలక భూమిక పోషించనుందని ఆయన అన్నారు. ఖమ్మం సభ చూశాక ప్రధాన ప్రతిక్షాలైన కాంగ్రెస్, బీజేపీలకు దడ మొదలైందన్నారు.

‘భారతమాత మహా హారతికి రండి’



కేశవ మెమోరియల్ ట్రెజరర్ ప్రభాకర్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నర్సింగ్‌గౌడ్

హిమాయత్‌నగర్: పీపుల్స్ ప్లాజాలో ఈనెల 22న నిర్వహించే భారతమాత మహా హారతి కార్యక్రమానికి విచ్చేసి విజయవంతం చేయాలని బీజేపీ డివిజన్ నాయకుడు నర్సింగ్‌గౌడ్ కోరారు. ఈ మేరకు గురువారం ఆయన హిమాయత్‌నగర్‌లో ఇంటింటికీ వెళ్లి ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా నర్సింగ్‌గౌడ్ మాట్లాడుతూ.. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి భారతమాత మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని చెప్పారు. కాశీలో కనిపించే సప్తహారతిని ఇక్కడ భక్తులకు అందజేస్తారని చెప్పారు. పార్టీలకతీతంగా నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

(BY ORDER OF THE HON'BLE II SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT HYDERABAD)
IN THE COURT OF THE HON'BLE II SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT HYDERABAD: I.A. No. 22 OF 2020 IN O.S. No. 100 OF 2015

Between:
M/s. India Bulls Housing Finance Limited
Having its registered office at F-60, Malhotra Building 2nd floor, Cannaught Place, New Delhi
And having branch office at 5th floor, Venkat Plaza, Panjagutta, Hyderabad
Rep by its authorized signatory Venkata Subbaiah, S/o B.V. Krishna Murthy, aged about 45 years ...Plaintiffs/Petitioners

AND

1. Pooja Verma, D/o. Arun Kumar Verma Age: Major, R/o. Flat No.405, Plot No. 189/190, KVK Classic Homes, Kalyan Nagar, Venture-2, Molinagar, Hyderabad.
2. Arun Kumar Verma, S/o. not known, Age: Major, R/o. Flat No. 405, Plot No. 189/190, KVK Classic Homes, Kalyan Nagar, Venture-2, Molinagar, Hyderabad.

...Defendants/Respondents

NOTICE

Kindly take notice that the above said Plaintiffs/Petitioners have filed an I.A. No. 22 of 2020 in O.S. No. 100 of 2015 wherein you have been arrayed as Defendants/ Respon dents 1 & 2. As such you are hereby directed to appear before the Hon'ble II Senior Civil Judge, City Civil Court at Hyderabad on 27.01.2023 either in person or through a Counsel. If you fail to appear before the Hon'ble Court, then the matter will be decided accordingly.

Sd/-
RUSHEEK REDDY K.V.
Advocate
III Floor, J K Enclave, Rao & Raju Colony, Road No. 2, Banjara Hills, Hyderabad - 034.

క్లుప్తంగా...

'బీఆర్ఎస్ సభలో కానరాని బీజేపీ వ్యతిరేక ఎజెండా'

పొంగులేటిని కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్నాం: భట్టి



ఖమ్మం సహకారనగర్: దేశ సంస్కృతి, సంపదతోపాటు ప్రభుత్వరంగ సంస్థలు, వ్యవస్థలను ప్రైవేట్‌పరం చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎజెండా ప్రకటిస్తారని జరిగిన ప్రచార ఆర్భాటానికి తగ్గట్టుగా ఖమ్మం బీఆర్ఎస్ సభ లేదని సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క ఎద్దేవా చేశారు. కనీసం ఉమ్మడి ఖమ్మం జిల్లాకు పనికొచ్చే ఎజెండా కూడా లేదని అన్నారు. గురువారం ఇక్కడి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఇతర రాష్ట్రాల సీఎంలను తీసుకొచ్చి ఆర్భాటంగా నిర్వహించిన సభలో దేశానికి దశదిశ ఇచ్చే ఎజెండా లేకపోవడం, ప్రజలు ఆశించినవి కూడా ప్రకటించకపోవడం విచారకరమన్నారు. పోడుపట్టాలు, పేదలకు ఇళ్లస్థలాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, సింగరేణి ప్రైవేటీకరణ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ వంటి హామీల ఊసెత్తలేదని ఆరోపించారు. ప్రజలను విభజించి, విద్వేషాలను రెచ్చగొట్టి లబ్ధి పొందాలని చూస్తున్న బీజేపీని కట్టడి చేయడం కాంగ్రెస్‌తోనే సాధ్యమని భట్టి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వామపక్ష పార్టీలు తమతో కలిసి ప్రయాణం చేస్తే బాగుంటుందని ఆకాంక్షించారు. కాగా, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి రావాలని మీడియా సాక్షిగా ఆహ్వానిస్తున్నట్టు భట్టి తెలిపారు. ఆయన కాంగ్రెస్‌లోకి రావడానికి తాను అడ్డుగా లేనని చెప్పారు.

కేసీఆర్ ప్రసంగం హాస్యాస్పదం: పొన్నాల



సాక్షి, హైదరాబాద్: ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా సుమారు రూ. 5 లక్షల కోట్ల అప్పులతో రాష్ట్రాన్ని దివాలా తీయించిన సీఎంకేసీఆర్ దేశం గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య విమర్శించారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఖమ్మంలో బీఆర్ఎస్ నిర్వహించిన బహిరంగ సభలో సీఎం గొప్పలు చెప్పుకొనేందుకే తాపత్రయపడ్డారని విమర్శించారు. రాష్ట్రంలో 17 లక్షల మంది దళితులుంటే కేవలం 30 వేల మందికే దళితబంధు పథకాన్ని అమలు చేస్తూ దేశమంతా దీన్ని వర్తింపజేస్తానని సీఎం మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఉద్యోగ ఖాళీలకు నోటిఫికేషన్లు ఇచ్చి కొత్త ఉద్యోగాలు ఇచ్చినట్లు చెబుతున్నారని పొన్నాల ఆక్షేపించారు. మిషన్ భగీరథ కోసం రూ. 40 వేల కోట్లు ఖర్చు పెట్టినా నీళ్లు తాగలేని దుస్థితి నెల కొందని, ఉద్యోగులకు సరిగ్గా జీతాలు ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందని విమర్శించారు.

పర్యాటకరంగ అభివృద్ధికి సీఎం పెద్దపీట: శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: పర్యాటకరంగ అభి వృద్ధికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని పర్యాటక, సాంస్కృతి కశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ప్రపంచ పర్యాటకుల స్వర్గధామంగా తెలంగాణ మారిందని కొని యాడారు. స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో జరి గిన ప్రపంచ ట్రావెల్ అండ్ టూరిజం మీట్‌లో తెలంగాణ పర్యాటక వైభవాన్ని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో బుద్ధవనం ప్రాజెక్టు అభివృద్ధి చేస్తున్నామన్నారు. టెంపుల్ టూరిజానికి ప్రత్యేక ఆకర్షణ తెలంగాణ అని, హైదరాబాద్ బిర్యానీకి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందని పేర్కొన్నారు. ప్రపంచ వారసత్వ కట్టడంగా రామప్ప దేవాలయం గుర్తింపు పొందిందని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా యాదాద్రి దేవాలయం అభివృద్ధి చేశామని వివరించారు.

పదేళ్ల పోరాటం.. అంధుడికి దక్కిన 'న్యాయ'ం

సాక్షి, హైదరాబాద్: ఓ అంధుడి పదేళ్ల 'న్యాయ' పోరాటం ఫలించింది. కోర్టు ఆదేశాలతో ప్రభుత్వం దిగివచ్చింది. అతనికి కరీంనగర్ జిల్లా వీణవంక మండలం చల్లూరు పంచాయతీ కార్యదర్శిగా పోస్టింగ్ ఇస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. 2013లో పంచాయతీ కార్యదర్శి గ్రూప్–4 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిన ఉమ్మడి ఏపీ ప్రభుత్వం 92 పోస్టులకుగాను 87 పోస్టులను భర్తీ చేసింది. అయితే దివ్యాంగ రిజర్వేషన్ ఉన్నా, ఖాళీలున్నా తనకు పోస్టింగ్ ఇవ్వడం లేదంటూ సిరిసిల్ల శాంతినగర్‌కు చెందిన అంధుడు(100%) కె.మల్లికార్జున్ హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం అతనికి పోస్టింగ్ ఇవ్వాలని 2021లో రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయినా అధికారులు ఈ ఆదేశాలను అమలు చేయకపోవడంతో మల్లికార్జున్ కోర్టు ధిక్కరణ పిటిషన్ వేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి పిటిషనర్‌కు వికలాంగ కేటగిరీ కింద పంచాయతీ కార్యదర్శి ఉద్యోగం ఇవ్వాలని అధికారులను మరోసారి ఆదేశించారు. 2013 నుంచి పిటిషనర్‌కు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలన్నింటినీ వర్తింపజేయాలన్నారు. కోర్టు ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం మల్లికార్జున్‌కు పోస్టింగ్ ఇచ్చింది.

ఐటీ కొలువుపై మాంద్యం వేటు

లే ఆఫ్‌లు ప్రకటిస్తున్న భారతీయ, బహుళ జాతి కంపెనీలు, స్టార్టప్‌లు


ఖర్చు తగ్గింపు చర్యల్లో భాగంగా ఉద్యోగుల తొలగింపు

కొత్త ఏడాది తొలి 15 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా 25 వేలమందికి ఉద్వాసన

2022లో 1,54,336 మందిని తొలగించిన వెయ్యికి పైగా కంపెనీలు

లే ఆఫ్స్ ట్రాకింగ్ సైట్ 'లేఆఫ్స్.ఎఫ్‌వైఐ' తాజా నివేదిక వెల్లడి

రోజుకు 1,600 మంది!



ఓలా నుంచి అమెజాన్ వరకు..

అనిశ్చిత మార్కెట్ పరిస్థితుల కారణంగా స్వదేశీ సామాజిక మాధ్యమ కంపెనీ షేర్‌చాట్ 20 శాతం వర్క్‌ఫోర్స్‌ను లేఆఫ్ చేసింది. దాదాపు 500 మంది ఉద్యోగులపై దీని ప్రభావం పడింది.

ట్విట్టర్, గూగుల్, స్నాప్, టైగర్ గ్లోబల్ కంపెనీలు 2,300 మంది ఉద్యోగుల్ని తొలగించాయి.

ఓలా (200 మంది తొలగింపు) వంటి కంపెనీలు కూడా ఉద్యోగుల్ని తొలగించగా, వాయిస్ ఆటోమేటెడ్ స్టార్టప్ స్కిట్.ఏఐ ఈ నెలలో చాలా మందిని తొలగించింది.

నిత్యావసర సరుకుల డెలివరీ సంస్థ 'దంజో'తన కాస్ట్ కట్టింగ్ (ఖర్చు తగ్గింపు) చర్యల్లో భాగంగా 3 శాతం వర్క్‌ఫోర్స్‌ను తొలగించింది.

అమెజాన్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా 18 వేల మందిని (భారత్‌లో వెయ్యి మంది) లే ఆఫ్ చేసింది.

6 నెలల దాకా లేఆఫ్‌ల ట్రెండ్

ఆర్థిక మాంద్యం, సమస్యలు ఎదురైనప్పుడు పెద్ద కంపెనీలతో పాటు స్టార్టప్ కంపెనీలు కూడా పెద్ద కుదుపునకు గురవుతాయి. ఈ నేపథ్యంలో వీటిల్లో లే ఆఫ్‌ల ట్రెండ్ మూడు నుంచి ఆరునెలల దాకా కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి. గత 3, 4 ఏళ్లుగా ఐటీ కంపెనీల్లో సరైన పద్ధతులు, విధానాల్లో హైరింగ్ జరగనందున ఉద్యోగులపై అధిక ప్రభావం పడనుంది. రిక్రూట్‌మెంట్ సవ్యంగా జరగకపోవడం, భారీ ప్యాకేజీలు ఆఫర్ చేయడం వంటివి జరిగినపుడు రెండేళ్లకోసారి దిద్దుబాట్లు జరుగుతుంటాయి. మరోవైపు ఆశించిన మేర ఇతర దేశాల నుంచి ఔట్‌సోర్సింగ్ బిజినెస్, బ్యాకెండ్ సపోర్ట్ వంటివి రాకపోవడం మన దేశంపై ప్రభావం చూపిస్తుంది.

– డా.బి.అపర్ణా రెడ్డి, హెచ్ఆర్ నిపుణురాలు

సాక్షి, హైదరాబాద్: ఆర్థిక మాంద్యం నేపథ్యంలో టెకీలకు 'డేంజర్ బెల్స్'మోగుతున్నాయి. ఐటీ రంగానికి సంబంధించి 2022లోనే ప్రారంభమైన ప్రతికూల పరిస్థితులు 2023 లోనూ కొనసాగే సూచనలు కన్పిస్తున్నాయి. ఖర్చు తగ్గించుకునేందుకు మన దేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఐటీ కంపెనీలు లే ఆఫ్‌లు కొనసాగిస్తున్నాయి. గత ఏడాది (2022) కాలంలో ప్రపంచంలోని వెయ్యికి పైగా కంపెనీలు మొత్తం 1,54,336 మందికి ఉద్వాసన పలికాయి. ఇక కోటి ఆశలతో కొత్త ఏడాది మొదలైన తొలి పదిహేను రోజుల్లోనే ప్రపంచ వ్యాప్తంగా 91 కంపెనీలు లే ఆఫ్‌లు ప్రకటించాయి. దీంతో 25 వేల దాకా ఐటీ ఉద్యోగులు అంటే.. రోజుకు సగటున 1,600 మందికి పైగా టెకీలు లే ఆఫ్‌ల బారిన పడ్డారు. గతేడాది నుంచి లేఆఫ్‌లు ప్రకటించిన వాటిలో అనేక భారతీయ కంపెనీలతో పాటు పలు స్టార్టప్‌లు కూడా ఉన్నట్టు తేలింది. లే ఆఫ్స్ ట్రాకింగ్ సైట్ 'లే ఆఫ్స్.ఎఫ్‌వైఐ' తన తాజా నివేదికలో ఈ అంశాలు వెల్లడించింది.

తొలి ప్రభావం ఐటీ రంగంపైనే..!



డి. పాపారావు, ఆర్థికరంగ విశ్లేషకులు

ఆర్థిక రంగం ఒడిదుడుకులకు గురవుతున్నప్పుడు, ఆర్థికమాంద్యం పరిస్థితులు తలెత్తుతున్నప్పుడు మొదటగా ప్రభావం పడేది ఐటీ రంగం పైనే. ఐటీ కంపెనీలు ఉద్యోగుల్ని తొలగించడానికి ఇదే కారణం. ఆర్థికరంగ స్లోడౌన్‌కు సూచికగా ప్రస్తుత పరిణామాలను పరిగణించాలి. 2001లోనూ ఇలాంటి పరిస్థితులు సంభవించాయి. ఇండియన్ ఐటీ కంపెనీలకు ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్‌లు తగ్గిపోతాయి కాబట్టి ఖర్చు తగ్గించుకునేందుకు లేఆఫ్‌ల వైపు మొగ్గు చూపుతాయి. ఆర్థికమాంద్యం ఏర్పడుతుందనే సంకేతాలు రాగానే ఐటీ కంపెనీలు ముందుగా ఉద్యోగుల భారాన్ని తగ్గించుకుంటాయి. అలాగే ఇప్పుడు కూడా లాభాల మార్జిన్లు తగ్గిపోయే కొద్దీ ఖర్చులను తగ్గించుకోవడంలో భాగంగా అధిక జీతాలిచ్చే ఉద్యోగుల సంఖ్యను కంపెనీలు కుదించుకుంటున్నాయి. క్యాంపస్ సెలక్షన్లలో భాగంగా ఎంపిక చేసుకున్నవారి నియామక ఉత్తర్వులను సైతం కొన్ని సంస్థలు రద్దు (క్యాన్సిల్) చేస్తున్నాయి.

హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ పెట్టుబడి...

మరో రూ. 16వేల కోట్లు!

దావోస్ వేదికగా నగరంలో భారీ విస్తరణ ప్రణాళికను ప్రకటించిన ఐటీ దిగ్గజం

- కొత్తగా మరో 3 డేటా సెంటర్లు ఏర్పాటు చేస్తామని మంత్రి కేటీఆర్ సమక్షంలో వెల్లడి
- గతేడాది రూ.16 వేల కోట్లతో 3 డేటా సెంటర్లు ఏర్పాటు చేస్తామని ప్రకటన
- తాజా నిర్ణయంతో రెట్టింపు కానున్న మైక్రోసాఫ్ట్ పెట్టుబడి

సాక్షి, హైదరాబాద్: సాఫ్ట్‌వేర్ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ హైదరాబాద్‌లో మరో భారీ పెట్టుబడికి ముందుకొచ్చింది. గత సంవత్సరం ప్రారంభంలో రూ. 16 వేల కోట్ల పెట్టుబడితో ఒక్కోటీ సగటున 100 మెగావాట్ల ఐటీలోడ్ (సర్వర్లు, నెట్‌వర్క్ పరికరాలు వినియోగించిన లేదా వాటి కోసం కేటాయించే విద్యుత్ మొత్తం)తో 3 డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన మైక్రోసాఫ్ట్ తాజాగా దావోస్ వేదికగా మరో 3 డేటా సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కె.తారక రామారావుతో జరిగిన సమావేశంలో ఈ మేరకు మైక్రోసాఫ్ట్ తమ విస్తరణ ప్రణాళికలను ప్రకటించింది. కొత్తగా ప్రకటించిన 3 డేటా సెంటర్ల ఏర్పాటుకు మరో రూ. 16 వేల కోట్లు వెచ్చించే అవకాశం ఉంది. హైదరాబాద్‌లో ఉన్న పెట్టుబడి అనుకూల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని మొత్తంగా 6 డేటా సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. రాబోయే 10–15 ఏళ్లలో ఈ డేటా సెంటర్లు పూర్తిస్థాయిలో కార్యకలాపాలు కొనసాగిస్తాయని పేర్కొంది. క్లౌడ్ ఆధారిత మౌలిక వసతులను పెంచి ప్రపంచవ్యాప్తంగా ఉన్న వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందించేందుకే ఈ భారీ పెట్టుబడుల నిర్ణయం తీసుకున్నట్లు మైక్రోసాఫ్ట్ వివరించింది.

మైక్రోసాఫ్ట్‌తో బంధం బలోపేతం: కేటీఆర్

రాష్ట్ర ప్రభుత్వం, మైక్రోసాఫ్ట్ మధ్య ఉన్న బంధం తాజా పెట్టుబడితో మరింత బలోపేతం అవుతుందని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ, క్లౌడ్ అడాప్షన్ వంటి అంశాల్లో ఇప్పటికే మైక్రోసాఫ్ట్‌తో కలసి పనిచేస్తున్నట్లు చెప్పారు. మైక్రోసాఫ్ట్ ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 6 డేటా సెంటర్లు హైదరాబాద్‌లోనే కేంద్రీకృతం కావడం సంతోషకరమన్నారు. తెలంగాణ కేంద్రంగా మైక్రోసాఫ్ట్ మరింత అభివృద్ధి చెందాలని కేటీఆర్ ఆకాంక్షించారు. ఇంత భారీ పెట్టుబడితో హైదరాబాద్‌లో కార్యకలాపాలను విస్తరిస్తున్నందుకు మైక్రోసాఫ్ట్‌కు కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. మైక్రోసాఫ్ట్ ఆసియా హెడ్ అహ్మద్ మజారీ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ మార్కెట్‌లో హైదరాబాదే కీలకమని, భవిష్యత్తులోనూ మరిన్ని పెట్టుబడులు పెట్టనున్నట్లు చెప్పారు. భారత్ కేంద్రంగా తమ సంస్థ చేపట్టే పలు ప్రాజెక్టులకు హైదరాబాద్‌లో ఏర్పాటు చేయబోయే డేటా సెంటర్లు కీలకంగా మారతాయన్నారు.

హైదరాబాద్‌లో రూ.150 కోట్లతో 'వెబ్‌పీటీ' కేంద్రం

సాక్షి, హైదరాబాద్: ఔట్ పేషెంట్ రిహాబిలిటేషన్ థెరపీకి అవసరయ్యే సాఫ్ట్‌వేర్ సేవలను అందించడంలో అంతర్జాతీయంగా పేరున్న వెబ్‌పీటీ సంస్థ హైదరాబాద్‌లో రూ. 150 కోట్లతో గ్లోబల్ కేపబిలిటీస్ సెంటర్ (జీసీసీ)ను ఏర్పాటు చేయనుంది. 2008లో అమెరికాలోని ఫీనిక్స్ కేంద్రంగా ప్రారంభమైన వెబ్‌పీటీ సాఫ్ట్‌వేర్‌కు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో హైదరాబాద్‌లో తమ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సంస్థ తెలిపింది. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా మంత్రి కేటీఆర్ బృందంతో సమావేశమైన వెబ్‌పీటీ సీఈఓ యాష్లే గ్లోవర్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ పాల్ షుగా, సమ్మిట్ కన్సల్టింగ్ సర్వీసెస్ వ్యవస్థాపకుడు, సీఈఓ సందీప్ శర్మలు ఈ మేరకు ప్రకటన చేశారు. రాష్ట్రంలో పెట్టుబడి పెడుతున్నందుకు వెబ్‌పీటీకి మంత్రి కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. వెబ్‌పీటీ విజయాల్లో తెలంగాణ ప్రభుత్వం భాగస్వామిగా ఉంటుందని హామీ ఇచ్చారు. లైఫ్ సైన్సెస్ హబ్ ఆఫ్ ఆసియాగా హైదరాబాద్ ఎదుగుతున్న వైనానికి ఇది మరో నిదర్శనమన్నారు.

రాష్ట్రంలో డబ్ల్యూహెచ్‌వో టీకా కేంద్రం

మీడియా సంస్థల ఇంటర్వ్యూలో కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్ తయారీ కేంద్రాన్ని తెలంగాణలో ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కె. తారక రామారావు తెలిపారు. దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమావేశాల్లో భాగంగా పలు మీడియా సంస్థలకు ఇచ్చిన ఇంటర్వ్యూల్లో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. కరోనా మహమ్మారి వల్ల వైద్య రంగంలో ఉన్న లోపాలు ప్రపంచవ్యాప్తంగా కనిపించాయన్నారు. కరోనా తీవ్రంగా ఉన్న సమయంలో తమ దగ్గర కావాల్సినన్ని వెంటిలేటర్లు లేవని న్యూయార్క్ గవర్నర్ అన్నారని, ఆ పరిస్థితుల్ని అంచనా వేస్తే లైఫ్ సైన్సెస్‌కు పెద్దపీట వేయాలన్న ఆలోచన కలిగిందన్నారు. ఈ మేరకు చేసిన కృషి వల్ల ప్రపంచంలోకెల్లా మూడో వంతు వ్యాక్సిన్లు తెలంగాణలోనే ఉత్పత్తి అవుతున్నాయన్నారు. తెలంగాణలోనే 40 శాతం ఫార్మసీ ఉత్పత్తులు తయారవుతున్నాయని చెప్పారు. కరోనా తరహాలో మరే ఇతర మహమ్మారులు వచ్చినా ఎదుర్కొనే రీతిలో టీకాలు అవసరమని గుర్తించి ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్ల ఉత్పత్తి విషయంలో ప్రపంచ ఆరోగ్య సంస్థను సంప్రదించామని, అందుకు ఆ సంస్థ కూడా ఆసక్తి ప్రదర్శించిందని... త్వరలోనే తెలంగాణలో ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్ హబ్‌ను డబ్ల్యుహెచ్‌వో ఏర్పాటు చేయబోతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

అత్యధిక వృద్ధి రేటు తెలంగాణలోనే..

దేశంలో అత్యధిక వృద్ధి రేటు తెలంగాణలోనే ఉన్నట్లు మంత్రి కేటీఆర్ చెప్పారు. కోవిడ్ ఉన్నా.. నోట్ల రద్దు చేసినా.. కేంద్రం సహకరించకున్నా.. తెలంగాణ రాష్ట్రం వృద్ధి రేటులో దూసుకువెళ్తున్నట్లు కేటీఆర్ వెల్లడించారు. రాష్ట్రంలో సమ్మిళిత వార్షిక వృద్ధిరేటు 15 శాతంగా ఉన్నట్లు ఆయన చెప్పారు. ఒకవేళ కేంద్రం తమకు సహకరించి ఉంటే తెలంగాణ మరింత వేగంగా వృద్ధి సాధించేదని పేర్కొన్నారు. తెలంగాణ తరహాలో ఇతర రాష్ట్రాలన్నీ పనిచేసుంటే దేశ ఆర్థిక వ్యవస్థ ఇప్పటికే రూ. 5 లక్షల కోట్ల మార్కును దాటేదన్నారు.

మోదీ సర్కార్ అప్పు రూ.100 లక్షల కోట్లు..

మోదీ ప్రధాని కావడానికి ముందు దేశ అప్పు రూ. 56 లక్షల కోట్లుగా ఉండగా మోదీ పాలనలో దేశం కొత్తగా రూ. 100 లక్షల కోట్ల మేర అప్పులపాలైనట్లు మంత్రి కేటీఆర్ ఆరోపించారు. గత 8 ఏళ్లలో తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ఖజానాకు పన్నుల రూపంలో రూ. 3.68 లక్షల కోట్లు అందించినా తమ ప్రభుత్వానికి కేంద్రం నుంచి వచ్చింది కేవలం రూ. 1.68 లక్షల కోట్లేనని కేటీఆర్ తెలిపారు.

ప్యానెల్ డిస్కషన్‌లో కేటీఆర్



పరస్పర సహకారంతో సమస్యలకు పరిష్కారం

బయోటెక్ విప్లవంపై దావోస్ చర్చా వేదికలో మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: సైన్స్‌కు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం తోడైతే ఎన్నో సమస్యలకు సులువైన పరిష్కారం లభిస్తుందని మంత్రి కె. తారక రామారావు అన్నారు. దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం వార్షిక సమావేశానికి హాజరైన ఆయన బయోటెక్నాలజీ పరిణామ క్రమం (విప్లవం)పై జరిగిన ప్యానల్ డిస్కషన్‌లో పాల్గొన్నారు. అత్యాధునిక సాంకేతికత, ఉద్యోగ కల్పనలో దాని సామర్థ్యంపై తన ఆలోచనలను పంచుకున్నారు. మెరుగైన, కచ్చితమైన ఔషధాల తయారీతోపాటు ఆరోగ్య సంరక్షణలో మరిన్ని సురక్షిత పద్ధతులు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. వైద్య రంగంలో మౌలిక సదుపాయాల కల్పనలో నెలకొన్న లోపాలు కోవిడ్ వ్యాప్తితో బయటపడ్డాయని, పరస్పర సహకారం లేకుంటే ఎలాంటి సమస్య కూడా పరిష్కారం కాదన్న సత్యాన్ని కోవిడ్ తెలియచేసిందన్నారు. ప్రభుత్వ విధానాలు రూపొందించే నాయకత్వం, ప్రముఖ బయోటెక్నాలజిస్టులు, సాంకేతిక సంస్థలతో కలిసి పనిచేసే అవకాశాన్ని ప్రపంచ ఆర్థిక వేదిక కల్పిస్తుందన్న విశ్వాసం తనకు ఉందన్నారు.

జీఐ జర్నల్‌లో తాండూరు కంది ప్రత్యేకతలు



సాక్షి, హైదరాబాద్: గతేడాది డిసెంబర్‌లో తెలంగాణ నుంచి భౌగోళిక గుర్తింపు (జీఐ) సాధించిన వికారాబాద్ జిల్లా తాండూరు కందికి సంబంధించిన ప్రత్యేకతలను తాజాగా కేంద్రం 'జీఐ జర్నల్'లో పొందుపరిచింది. వండిన పప్పు ఎక్కువ కాలం నిల్వ ఉండటం, తొందరగా ఉడకడం, మంచి రుచి, వాసన తాండూరు కంది ప్రత్యేకతలని పేర్కొంది. అలాగే సానుకూల వాతావరణ పరిస్థితులు, రైతులు ఆచరించే సంప్రదాయ, ఆధునిక యాజమాన్య సాగు పద్ధతుల మూలంగా దీనికి ప్రత్యేక గుర్తింపు లభించిందని వివరించింది. తాండూరు ప్రాంతంలో ఉన్న సున్నపురాయి నిక్షేపాల వల్ల వచ్చే పోషక నాణ్యతలే దీనికి కారణమని వ్యవసాయ వర్గాలు వెల్లడించాయి. తాండూరు, పెద్దేముల్, యాలాల, బషీరాబాద్ మండలాలలో 1.48 లక్షల ఎకరాల్లో కంది సాగు జరుగుతుంది. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా భౌగోళిక గుర్తింపు కోసం వివిధ రంగాల నుంచి వెయ్యి దరఖాస్తులు రాగా వాటిలో 432 ఉత్పత్తులకు మాత్రమే భౌగోళిక గుర్తింపు లభించిందని రాష్ట్ర వ్యవసాయశాఖ వర్గాలు వెల్లడించాయి.

తెలంగాణ ఏర్పడ్డాక ఆరింటికి..

తెలంగాణ ప్రాంతానికి చెందిన మొత్తం 16 ఉత్పత్తులకు ఇప్పటివరకు జీఐ హోదా లభించగా వాటిలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఆరు ఉత్పత్తులు ఈ ఘనత సాధించాయి. రాష్ట్రం ఏర్పడ్డాక ఈ హోదా పొందిన వాటిలో పుట్టపాక తేలియ రుమాలు (2015), బంగినపల్లి మామిడి (2017), ఆదిలాబాద్ ఢోక్రా, వరంగల్ డురీస్ (2018), నిర్మల్ పెయింటింగ్ (2019), తాండూరు కంది (2022) ఉన్నాయి. తాజాగా తాండూరు కంది భౌగోళిక గుర్తింపు సాధించిన నేపథ్యంలో ఆ ప్రాంత రైతులు, వ్యవసాయ విద్యాలయం సంచాలకుడు డాక్టర్ జగదీశ్వర్, కంది పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్‌లను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అభినందించారు. ఈ నెల 31న కంది పరిశోధనా కేంద్రంలో తాండూరు రైతులు, శాస్త్రవేత్తలను అభినందిస్తామని ఆయన పేర్కొన్నారు.

పిటిషన్‌దారులతో రాజీ కుదుర్చుకోవడమే మేలు

వివాదాస్పద భూములపై సర్కారు నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: కేసులు తేలకుండా ఏళ్ల తరబడి విలువైన భూముల వివాదాలు కొనసాగితే వాటిని అమ్ముకోలేమని, పిటిషన్‌దారులతో రాజీ కుదుర్చుకోవడమే మేలని సర్కారు నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర నీటి పారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్ నేతృత్వంలో గురువారం ఉన్నతస్థాయి సమావేశం ఈ నిర్ణయానికి వచ్చింది. ఈ సమావేశానికి ఈఎన్‌సీ (జనరల్) మురళీధర్, ఈఎన్‌సీ(అడ్మిన్) అనిల్ కుమార్‌తోపాటు పలువురు అధికారులు హాజరై చర్చించారు. నీరు, భూమి యాజమాన్య, శిక్షణ పరిశోధన సంస్థ (వాలంతరి), తెలంగాణ రాష్ట్ర ఇంజనీరింగ్ పరిశోధన ప్రయోగశాల(టీఎస్ఈఆర్ఎల్) భూముల వేలానికి వీలుగా తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయల కల్పన సంస్థ(టీఎస్ఐఐసీ)కి అప్పగించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈ సంస్థలకు 442 ఎకరాల భూములు ఉండగా, ఇందులో 110 ఎకరాల భూములపై సివిల్ కేసులున్నాయి. అంతేకాకుండా ఈ భూములు అమ్మడానికి వీల్లేదని 2019లో హైకోర్టు స్టే ఇచ్చింది. ఈ మేరకు 110 ఎకరాలపై కేసులు వేసిన 21 మంది పిటిషన్‌దారులతో రాజీ కుదుర్చుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కొక్కరికి 500 గజాల భూమిని కేటాయించాలనే ప్రతిపాదన తెర మీదకు తెచ్చింది. 110 ఎకరాలపై సివిల్ కేసులు ఉన్నప్పటికీ భూములు మాత్రం ప్రభుత్వం అధీనంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో వీటిపై ఉన్న కేసులలో రాజీ కుదుర్చుకోవాలని నిర్ణయించింది.

'ఢిల్లీ ప్రోగ్రామింగ్ కమిటీ ఇన్‌చార్జిగా కర్రి వేణుమాధవ్'

హైదరాబాద్: బీసీ సంక్షేమ సంఘం ఢిల్లీ ప్రోగ్రామింగ్ కమిటీ ఇన్‌చార్జిగా కర్రి వేణుమాధవ్‌ను సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య నియమించారు. ఈ మేరకు గురువారం నియామక పత్రాన్ని అందజేశారు. గత 20 సంవత్సరాలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి బీసీ ఉద్యమాలలో వేణుమాధవ్ క్రియాశీలంగా వ్యవహరిస్తున్నారని ఆర్.కృష్ణయ్య తెలిపారు. భవిష్యత్ బీసీ ఉద్యమానికి ఢిల్లీ వేదికగా మారనుందని, జాతీయ స్థాయిలో అన్ని రాజకీయ పార్టీలను సమన్వయ పర్చడం, కార్యక్రమాలు నిర్వహించడంలో తనకు వేణుమాధవ్ అండదండలు అందిస్తారన్నారు.

'ఎంవీ యాక్ట్'లో 6 నెలల నిబంధన

అమానుషం: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: రోడ్డు ప్రమాద పరిహార కేసుల్లో బాధిత కుటుంబ సభ్యులు ప్రమాదం జరిగిన 6 నెలల్లోనే దావా వేయాలన్న మోటారు వాహన చట్ట నిబంధనను హైకోర్టు తప్పుబట్టింది. ప్రమాదంలో ఎవరైనా మృతిచెందితే ఆ కుటుంబం కోలుకోవడానికే సంవత్సరానికిపైగా సమయం పడుతుందని వ్యాఖ్యానించింది. కేంద్ర ప్రభుత్వ నిబంధన అమానుషమని పేర్కొంది. ఈ నిబంధనను సవాల్ చేస్తూ దాఖలైన కేసులో అమికస్ క్యూరీ (కోర్టుకు సహాయకారి)గా న్యాయవాది పి.శ్రీరఘురామ్‌ను నియమిస్తున్నామని స్పష్టం చేసింది. నిబంధనలను పరిశీలించి ఏం చేయాలన్న దానిపై నివేదిక అందజేయాలని ఆయన్ను ఆదేశించింది. అలాగే కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 2కు వాయిదా వేసింది. నిజామాబాద్ జిల్లా మక్లూర్ మండలం అమ్రాద్ గ్రామానికి చెందిన అయిటి హనుమాండ్లు గతేడాది ఏప్రిల్ 15న తన భార్య నవనీత సహా ఇద్దరు మైనర్ కుమారులతో కలసి ద్విచక్ర వాహనంపై గ్రామం నుంచి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నలుగురికీ తీవ్ర గాయాలవగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒక కుమారుడు మృతిచెందాడు. ఈ నేపథ్యంలో తమ కుమారుడి మరణానికి కారణమైన ద్విచక్రవాహనదారుడి నుంచి పరిహారం కోరుతూ నిజామాబాద్ మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్‌లో గతేడాది నవంబర్ 10న హనుమాండ్లు పిటిషన్ వేశారు. అయితే అప్పటికే ప్రమాదం జరిగి 6 నెలలు దాటడంతో పిటిషన్‌ను స్వీకరించేందుకు ట్రిబ్యునల్ నిరాకరించింది. దీన్ని సవాల్ చేస్తూ ఆయన హైకోర్టుకెక్కారు.

ప్రసూతి మరణాలపై విచారణ

త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసిన సర్కారు ● వారంలోగా నివేదిక ఇవ్వాలని ఆదేశం



సాక్షి, హైదరాబాద్: మలక్‌పేట ప్రాంతీయ ఆసుపత్రిలో ఇటీవల జరిగిన ప్రసూతి మరణాలపై ప్రభుత్వం విచారణ కమిటీని నియమించింది. తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్, గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు, పేట్లబురుజు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాలతిలతో కూడిన త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. వారం రోజుల్లో విచారణ పూర్తి చేసి నివేదికను సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది.

అసలేం జరిగిందంటే ...

నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండలం చెదుమపల్లికి చెందిన సిరివెన్నెల (23), హైదరాబాద్ పూసలబస్తీకి చెందిన శివాని (24) మలక్‌పేట ప్రభుత్వ ఆసుపత్రిలో వారం కిందట సిజేరియన్ చేయించుకున్నారు. అనంతరం వారి ఆరోగ్యం విషమించడంతో గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఒకరు 12వ తేదీన, మరొకరు 13వ తేదీన మరణించారు. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంతోనే చనిపోయినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. వారి తీరును నిరసిస్తూ ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. బాలింతల మృతికి బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లే కారణమన్న వాదనలు వినిపించాయి. పోస్ట్‌మార్టం రిపోర్టులో కూడా ఇన్ఫెక్షనే కారణమని తేలినట్లు సమాచారం. ఇందుకు ఆసుపత్రిలో పరిశుభ్రత లోపమే ప్రధాన కారణమని గుర్తించారు. కాగా, ఈ ఘటనలకు ముందు సిజేరియన్ చేయించుకున్న మరో 18 మందిని నిమ్స్ అత్యవసర విభాగానికి తరలించారు. అందులో ఇద్దరు బాలింతల కిడ్నీలకు ఇన్ఫెక్షన్ సోకడంతో వారికి డయాలసిస్ చేశారు. ప్రస్తుతం వీరి ఆరోగ్యం నిలకడగా ఉందని, అధికార వర్గాలు వెల్లడించాయి. కొందరిని డిశ్చార్జి కూడా చేశామని చెబుతున్నారు.

అధిక మోతాదు యాంటీబయోటిక్స్ వాడారా?

బాలింతలకు అధిక మోతాదు యాంటీబయోటిక్స్ వాడటం వల్లే ఇన్ఫెక్షన్‌కు దారితీసిందని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. శస్త్రచికిత్స సమయంలో ఉపయోగించిన పరికరాలను స్టెరిలైజేషన్ చేయడంలో కొంత నిర్లక్ష్యం ఉన్నట్లు కూడా చెబుతున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇన్ఫెక్షన్ల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడంలేదన్న విమర్శలు వస్తున్నాయి. గత ఆగస్టులో ఇబ్రహీంపట్నంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకున్న నలుగురు మహిళలు మరణించిన తర్వాత కూడా ఇటువంటి సంఘటన జరగడం ఆందోళన కలిగిస్తోంది. ఇబ్రహీంపట్నం మరణాల తర్వాత రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఆసుపత్రి ఇన్ఫెక్షన్ నియంత్రణ కమిటీలను ఏర్పాటు చేసినా ఫలితం లేకపోయిందనడానికి మలక్‌పేట సంఘటన నిదర్శనంగా చెబుతున్నారు.

నేడు తేలనున్న డీజీపీ భవితవ్యం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర డీజీపీగా అంజనీకుమార్ కొనసాగుతారా? లేక ఏపీకి వెళ్లాల్సి వస్తుందా అనేది నేడు తేలిపోనుంది. 2014లో ఉమ్మడి ఏపీ విభజన నేపథ్యంలో కేంద్రం నియమించిన ప్రత్యూష్ సిన్హా కమిటీ నివేదిక ప్రకారం ఆలిండియా సర్వీస్ ఉద్యోగుల విభజనలో భాగంగా అంజనీకుమార్‌ను ఏపీకి కేటాయించారు. అయితే కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్(క్యాట్)ను ఆశ్రయించిన అంజనీకుమార్ తెలంగాణలో విధులు నిర్వహించేలా ఉత్తర్వులు పొందారు. గత నెలలో డీజీపీ మహేందర్ రెడ్డి పదవీ విరమణ చేయడంతో ప్రభుత్వం ఆ బాధ్యతలను అంజనీకుమార్‌కు అప్పగించింది. బాధ్యతలు చేపట్టి ఇంకా నెలైనా పూర్తికాకముందే కేడర్ కేటాయింపులకు సంబంధించి తీర్పు రానుంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సేవలందించిన సోమేశ్ కుమార్‌కు ఈనెల 10న హైకోర్టు షాక్ ఇచ్చింది. రాష్ట్ర విభజన సమయంలో ఆయనను ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు కేటాయించినందున అక్కడే వెళ్లి విధులు నిర్వహించాలని తేల్చిచెప్పింది. దీంతో ఆయన సీఎస్ విధులకు రాజీనామా చేసి, ఏపీకి వెళ్లి రిపోర్టు చేశారు. ఆయన ఏపీలో బాధ్యతలు చేపడతారా? లేదా? అన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. ఈ నేపథ్యంలో నేడు వెలువడనున్న తీర్పు డీజీపీకి అనుకూలమా.. ప్రతికూలమా? అన్నది సందిగ్ధంగా మారింది. సోమేశ్‌లానే తీర్పు వెలువడితే అంజనీకుమార్ కూడా ఏపీకి వెళ్లాల్సి వస్తుంది. ఇదే జరిగితే ఒక రాష్ట్రంలో కోర్టు తీర్పుల కారణంగా ఒకే నెలలో సీఎస్, డీజీపీలు ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సి రావడం దేశంలో ఇదే తొలిసారి అవుతుంది. వీరిద్దరూ బిహార్ రాష్ట్రానికి చెందినవారే కావడం గమనార్హం. అంజనీకుమార్‌తోపాటు మరికొందరు ఆలిండియా కేడర్ సర్వీస్ అధికారులు కూడా క్యాట్ అనుమతి పొంది తెలంగాణలో పనిచేస్తున్నారు. వీరందరికీ సంబంధించి కేంద్రం దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టులో వాదనలు పూర్తయ్యాయి. నేటి తీర్పుతో వీరి భవితవ్యం కూడా తేలిపోనుంది.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 20-1-2023

స్ఫూర్తి

ముందుకు సాగడమే జీవితం


నాగ చంద్రికాదేవి

కిన్నెర నాగ చంద్రికాదేవి పుట్టింది అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణం (కడప జిల్లా). పెరిగింది కడప జిల్లా ఎర్రగుంట్లలో. ఉన్నత విద్యావంతుల కుటుంబంలో పుట్టిన నాగచంద్రాదేవికి పదో తరగతితోనే పెళ్లి చేసుకోవాల్సి వస్తుందని ఊహించ లేదు. అలాగే రెండు వందల తులాల బంగారంతో మొదలైన ఆమె జీవితంలో కాలంతోపాటు బంగారం కరిగిపోవడమూ ఊహించలేదు. ప్రభుత్వ ఉద్యోగం వస్తుందని, సమాజ సేవ కోసం ఆ ఉద్యోగాన్ని వదిలేయాల్సి వస్తుందని కూడా ఊహించని సంఘటనలే. అలాగే సోదరులున్నప్పటికీ తల్లిదండ్రుల దహన సంస్కారాలు తన చేతులతో చేయాల్సి వస్తుందని కూడా ఊహించని పరిణామమే. అలాగే తన హోమ్‌లో కాలధర్మం చెందిన ఆరు వందల మందికి స్వయంగా అంత్యక్రియలు చేయడం కూడా ఊహించని సంఘటనలే. తన సేవా ప్రస్థానాన్ని 'సాక్షి'తో పంచుకున్నారామె.

'జీవితం అంటేనే గమ్యం ఏమిటో తెలియకనే మొదలు పెట్టే ప్రయాణం. ఊహాకందని మలుపులతో సాగే ఈ ప్రయాణంలో స్పీడ్ బ్రేకర్‌లుంటాయి, గతుకులుంటాయి, వాహనం మొరాయిస్తుంది, మరమ్మతులు చేసి ముందుకు సాగబోతే ఇంధనం నిండుకోనూవచ్చు. ఇన్నింటినీ అధిగమిస్తూ ముందుకు సాగడమే మనం చేయగలిగింది. వృద్ధుల సేవలో నా జీవితానికి ఒక అర్థాన్ని నిర్వచించుకున్నాననే అనుకుంటున్నాను' అన్నారామె.

నైరాశ్యం- నేను- నా బిడ్డ

''మా నాన్న మెడికల్ ఆఫీసర్. అమ్మానాన్నలకు తొలి సంతానం నేను. నన్ను మా మేనత్తకు దత్తత ఇచ్చారు. అత్త, మామ ఇద్దరూ హైస్కూల్ టీచర్‌లు. ఎందుకు నిర్ణయం తీసుకున్నారో కానీ టెన్త్ క్లాస్‌తోనే పెళ్లి చేశారు. అయితే పెళ్లి తర్వాత కాలేజీకెళ్లే అవకాశం ఉండింది. ఇంటర్ తర్వాత విద్యుత్‌సౌధలో ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం చేస్తూ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ చేశాను. ఈ లోపు బాబుకి తల్లి కావడం... బిడ్డనెత్తుకుని ఇంటి నుంచి బయటపడడం వరకు జీవితంలో ముఖ్యమైన ఘట్టాలన్నీ చిన్నవయసుకే పూర్తయిపోయాయి.. ఉద్యోగం చేసుకుని ఇంటికి వస్తే నాలుగ్గోడల మధ్య నేను, నా కొడుకు. నైరాశ్యం ఆవరించినట్లయ్యేది. దాని నుంచి బయటపడడానికి వేసిన ఒక్కో అడుగూ నన్ను ఇవాళ ఇలా సేవకు ప్రతీకగా నిలబెట్టాయి. నా పనిని గుర్తించి అవార్డులు వరించాయి. నన్ను అంటిపెట్టుకుని నేడో రేపో అన్నట్లు కళ్లలో ప్రాణాలు నిలుపుకుని రోజులు లెక్కపెట్టుకుంటున్న వాళ్లు ఉన్నారు. నేను కనిపించగానే వాళ్ల కళ్లలో కనిపించే వెలుగు నన్ను నడిపిస్తోంది.


● వృద్ధుల సేవలో...


● అంత్యక్రియలు నిర్వహిస్తూ...

ఒకరికి ఒకరు తోడు

మగవాడి మోసానికి గురయి ఒంటరైన మహిళలకు నా ఇంట్లో ఉంచుకుని వాళ్లు ఏదో ఒక పని నేర్చుకుని వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడే వరకు ఆసరా ఇస్తూ వచ్చాను. అలాగే ఏ దిక్కూలేని వృద్ధులను ఇంటికి తీసుకురావడం కూడా. ఏ బంధుత్వం లేని వాళ్లను అలా ఇంట్లో ఉంచుకోవడం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధం అని తెలిసి 2003లో మా ఇంటి పేరుతోనే కిన్నెర ఫౌండేషన్ స్థాపించాను. అక్కడి నుంచి నా సర్వీస్ విస్తరణ కూడా మొదలైంది. స్కూల్లో ఉండాల్సిన పిల్లలు వీధుల్లో ఉంటే వారిని సమీకరించి కౌన్సెలింగ్ ఇచ్చి గవర్నమెంట్ స్కూల్లో చేర్చాను. ఎందుకో తెలియదు కానీ అక్కడ కూడా సింగిల్ పేరెంట్ సంరక్షణలో ఉన్న పిల్లలే ఎక్కువగా ఉండేవారు. ఆ బాధ నాకు తెలుసు కాబట్టి నా బిడ్డల్లా అనిపించేవారు.

సామాజిక చైతన్యం

మహిళలకు ఎదురయ్యే ఇబ్బందులను వివరిస్తూ ప్రభుత్వపరంగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయంలో షీ టీమ్‌తో కలిసి పని చేశాను. నాగర్ కర్నూల్ జిల్లా, అచ్చంపేట దగ్గర జప్తేసద్గాడ గ్రామాన్ని దత్తత తీసుకుని ఫ్లోరోసిస్ బాధితులకు మంచి నీటి ఏర్పాటు చేయడం వంటి అనేక కార్యక్రమాలు నా చేతుల మీదుగా చేయగలిగాను. వృద్ధుల సేవనే ప్రధానంగా తీసుకోవడానికి కారణం మా అమ్మమ్మ, అత్త మంచం పట్టిన రోజులను దగ్గరగా చూడడమే. వాళ్ల మీద మనకు ఎంత ప్రేమ ఉన్నప్పటికీ వాళ్ల బాధను పంచుకోలేం. మనం చేయగలిగింది వారికి తోడుగా ఉంటూ భరోసా ఇవ్వడం మాత్రమే. అందుకే మా హోమ్‌లో హాస్పిస్ సేవలే ప్రధానంగా ఉంటాయి. హోమ్ నిర్వహణకు నెలకు మూడు లక్షల ఖర్చు వస్తుంది. ఒక కంపెనీ నుంచి అద్దెలో కొంత ఆర్థిక సహాయం, మరో కంపెనీ నుంచి బియ్యం నెలనెలా అందుతున్నాయి. పుట్టినరోజులు హోమ్‌లో చేసుకోవడానికి కొంతమంది వస్తారు. మిగిలిన ఖర్చుల కోసం ... ఉద్యోగం చేస్తూ హైదరాబాద్‌లో సంపాదించుకున్న ఇల్లు, రెండు ప్లాట్లు అమ్ముకున్నాను. బంగారం బ్యాంకులో తాకట్టు పెడుతూ విడిపిస్తూ, పెద్ద అవసరంలో అమ్ముకుంటూ అలా 30 తులాలు ఖర్చయింది. మాసాబ్ ట్యాంకులో అద్దె ఇంట్లో హోమ్ నిర్వహిస్తున్నాను. నా శక్తి తగ్గిపోతోందనే సమయం వచ్చిందని కాబోలు భగవంతుడు హోమ్ కోసం సొంత భవనాన్ని నిర్మించే మార్గం చూపించాడు. చిన్న జీయర్ స్వామి సూచనతో ముచ్చింతల్‌లో హోమ్ నిర్మాణం పూర్తయితే మా హోమ్ అక్కడికి మారుతుంది'' అని వివరించారు నాగ చంద్రికాదేవి.

– వాకా మంజులారెడ్డి

> **సేవలోనే సాంత్వన**
>
> నా సర్వీస్‌కి గుర్తింపుగా స్టేట్ అవార్డు, ఉత్తమ మహిళ అవార్డు, సేవాధార్మిక, గవర్నర్ అవార్డు, నేషనల్ అవార్డు అందుకున్నాను. ఈ పనుల్లో నన్ను నేను ఎంగేజ్ చేసుకున్నాను. ఈ సేవలో నాకు సాంత్వన లభించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు ఏపీలో గుణదలలో పోస్టింగ్ వచ్చింది. నేను హైదరాబాద్ వదిలి వెళ్లాలంటే హోమ్‌లో ఉన్న వాళ్ల సంరక్షణ ప్రశ్నార్థకమైంది. వాళ్లను ఎవరి మీద వదలాలి? తాత్కాలికంగా బాధ్యత అందుకోవడానికి కూడా ఏ ఆసరా లభించలేదు. దాంతో 2016లో వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నాను.
>
> – నాగ చంద్రికాదేవి, ఫౌండర్, కిన్నెర ఫౌండేషన్

ఫ్యాషన్





**మది నచ్చేలా ఉండాలి
మేనికి హాయినివ్వాలి
తరాల జ్ఞాపకమై కదలాలి
పర్యావరణానికి హితమై
తరుణులకు నెచ్చెలి అయి
నిలిచేలా ట్రెండ్‌ను సెట్ చేస్తోంది
సస్టెయినబుల్ ఫ్యాషన్**

హితమైన నేస్తం

ప్రపంచంలో చమురు తర్వాత ఫ్యాబ్రిక్ పరిశ్రమయే అతి పెద్దది. చమురు ప్రపంచవ్యాప్తంగా 10 శాతం కార్బన్ ఉద్గారాలను విడుదల చేస్తుంది. దీనితో పోల్చితే పాలిస్టర్‌తో తయారయ్యే ఫాస్ట్ ఫ్యాషన్ వల్ల పర్యావరణం విపరీతంగా కలుషితం అవుతుందనేది నిపుణుల మాట. ఇలాంటప్పుడు ఫ్యాషన్‌లో మనవైన ఫ్యాబ్రిక్‌ను ఉపయోగిద్దాం.. పర్యావరణానికి నేస్తాలుగా మారుదాం.

మనవైన చేనేతలు ఎవర్‌గ్రీన్‌గా ఎప్పుడూ అలరిస్తూనే ఉంటాయి. ఇండో–వెస్ట్రన్ మార్పులూ కొట్టేస్తుంటాయి.

యువత నుంచే..

మన విద్యా విధానంలో ఆర్గానిక్ ఫ్యాబ్రిక్ వాడకానికి సంబంధించిన విషయాలు చెప్పడం ప్రారంభిస్తే పిల్లలు, యువతకు వాతావరణ మార్పులను అర్థం చేసుకోవడంలోనూ ఉపయోగపడుతుంది. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ పాఠ్యాంశాల్లో సస్టెయినబుల్ ఫ్యాషన్‌కు సంబంధించిన పాఠాన్ని చేర్చాలని పర్యావరణ అధ్యయనాలు సూచిస్తున్నాయి. వాడిన ఉత్పత్తులను తిరిగి ఉపయోగించడం, వాడిన వస్తువులను రీ సైక్లింగ్ చేయడం వల్ల పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరించబడుతుంది.

ఆర్గానిక్ ఫ్యాబ్రిక్స్‌ని బ్లాక్ ప్రింట్, టై అండ్ డై డిజైన్స్‌తో మెరిపించినా, చేతితో అల్లిన ఊలు శాలువాలు, జాకెట్స్ కానుకలుగా ఇచ్చినా అవి జ్ఞాపకాల దొంతరగా మనల్ని హత్తుకుపోతాయి.

పునరుద్ధరణ
ఉపయోగించని చీరలు, దుపట్టాలు చిన్నారుల సంప్రదాయ డ్రెస్‌లకు సరిగ్గా నప్పుతాయి. వేటిని తిరిగి ఉపయోగించవచ్చో తెలుసుకొని ఆచరణలో పెట్టినా ప్రకృతికి ఎంతో మేలు.

మైండ్ సెట్

ఫ్యాషన్ వ్యవస్థలో పరివర్తనకు కీలకమైన మార్పులు తీసుకువస్తున్నాయి కొన్ని ఇన్‌స్టిట్యూషన్స్. లండన్ ఫ్యాషన్ స్కూల్ 'యుఎఎల్' సస్టెయినబుల్ ఫ్యాబ్రిక్ డిజైనింగ్ కోసం ప్రత్యేకంగా కోర్సులను ఆఫర్ చేస్తోంది. యూనివర్శిటీ స్థాయిలో ఫ్యాషన్ విద్య అనేది కొత్త ఆలోచనలతో ప్రయోగాలు చేయడానికి, వాతావరణం, సామాజిక, న్యాయసూత్రాలను అమలు చేయడానికి వీలైనదని, యువతలో 'మైండ్‌సెట్' చేయడానికి ఈ విధానం బాగా ఉపకరిస్తుందని చెబుతోంది.

ఇప్పటికే నిలకడ లేని ఫాస్ట్ ఫ్యాషన్ పద్ధతులు పర్యావరణాన్ని విపరీతంగా నాశనం చేశాయంటోంది న్యూయార్క్ ఫ్యాషన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ. కర్బన ఉద్గారాలను తగ్గించడానికి ప్రభుత్వంతో కలిసి పని చేసిన మొట్టమొదటి ఉన్నత విద్యాసంస్థలలో ఒకటిగా నిలిచింది ఎన్ఎఫ్ఐటి. 2011లో కర్బన ఉద్గారాలను 30 శాతం తగ్గించిన ఈ సంస్థ, 2016 నాటికి 46 శాతానికి తగ్గించింది. 2025 నాటికి 50 శాతానికి చేరుకోవాలని ప్రణాళికలు రచిస్తోంది. మన దేశంలోనూ హ్యాండ్లూమ్స్‌తో యువత కోరుకునేవిధంగా డ్రెస్ డిజైన్ చేసే సంస్థలు ఉన్నాయి. ఫాస్ట్‌ఫ్యాషన్ పోకడలను నిలువరించి, స్వదేశీ నాణ్యమైన, పర్యావరణ హితమైన ఫ్యాబ్రిక్ డిజైన్స్ వైపు దృష్టి పెట్టాల్సిన అత్యవసర తరుణంగా ఈ యేడాది నిర్ణయం తీసుకుందాం.

కదంబ పాకం

వంటిల్లు

**హెల్దీగా కొరియాండర్ రైస్
కాంబినేషన్‌గా
తెలంగాణ రెడ్ చికెన్
వెజ్జీల కోసం పంజాబీ కాజు కర్రీ
ఈ వారం మన వంటింట్లో...**

తెలంగాణ రెడ్ చికెన్

కావలసినవి: చికెన్ – అర కిలో ; నిమ్మకాయ– ఒకటి ; అల్లం వెల్లుల్లి పేస్ట్ – ఒకటిన్నర టేబుల్ స్పూన్ ; ఉప్పు – రెండు టీ స్పూన్‌లు లేదా రుచికి తగినట్లు.

మసాలా కోసం: బాదం – పది ; పిస్తా – పది ; చిరోంజి– 2 టీ స్పూన్‌లు ; పచ్చిమిర్చి– 3 ; దాల్చిన చెక్క– అర అంగుళం ముక్క ; లవంగాలు – 2 ; ఏలకులు –4 ; మిరియాలు – అర టీ స్పూన్

గ్రేవీ కోసం: నూనె– 3 టేబుల్ స్పూన్‌లు ; నెయ్యి – 2 టీ స్పూన్‌లు ; పెరుగు– పావు కప్పు ; ఉల్లిపాయ ముక్కలు – అర కప్పు (వేయించాలి) ; టొమాటో పేస్ట్ – అర కప్పు ; రెడ్ చిల్లీ సాస్ – 2 టేబుల్ స్పూన్‌లు ; గ్రీన్ చిల్లీ సాస్ – టేబుల్ స్పూన్; షాజీరా– టీ స్పూన్ ; ధనియాల పొడి– టీ స్పూన్ ; వేయించిన జీలకర్ర పొడి – టీ స్పూన్ ; కశ్మీర్‌మిరప్పొడి – ఒకటిన్నర టేబుల్ స్పూన్ ; మిరప్పొడి – ఒకటిన్నర టేబుల్ స్పూన్ ; కొత్తిమీర తరుగు – కప్పు ; తాజా మీగడ– 2 టేబుల్ స్పూన్‌లు.

తయారీ: ● చికెన్‌ను శుభ్రం చేసి ఉప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్, నిమ్మరసం కలపాలి. ● మందపాటి బాణలిలో మసాలా దినుసులన్నింటినీ ఒక్కొక్కటిగా వేసి సన్న మంట మీద దోరగా వేయించాలి. చల్లారిన తర్వాత వీటన్నింటినీ మిక్సీలో తగినంత నీటిని వేస్తూ మెత్తగా గ్రైండ్ చేయాలి. ● ఈ మసాలా పేస్టును చికెన్‌కు పట్టించాలి. అందులో నూనె, నెయ్యి, మీగడ మినహా గ్రేవీ కోసం తీసుకున్న అన్నింటినీ వేసి కలిపి రెండు గంటల సేపు ఫ్రిజ్‌లో పెట్టాలి. ● బాణలిలో నూనె, నెయ్యి వేడి చేసి అందులో ఫ్రిజ్‌లో నుంచి తీసిన చికెన్‌ను వేసి మీడియం మంట మీద అడుగు పట్టకుండా మధ్యలో కలుపుతూ ఇరవై నిమిషాల సేపు ఉడికించాలి. ముక్కలు ఉడికిన తర్వాత మీగడ వేసి దించేయాలి. గ్రేవీ చిక్కదనం చూసుకుని అవసరమనిపిస్తే మరిగించిన నీటిని తగినన్ని పోసి కలుపుకోవాలి. నోరూరించే తెలంగాణ రెడ్ చికెన్ కర్రీ రెడీ. ఇది చపాతీ, రోటీ, బగారా రైస్‌లకు మంచి కాంబినేషన్.

కొరియాండర్ రైస్

కావలసినవి: కొత్తిమీర పేస్ట్ కోసం ; కొత్తిమీర – రెండు కప్పులు (తరిగి శుభ్రం చేసినది) ; పుదీనా ఆకులు – కప్పు (శుభ్రం చేసి ఒలిచిన ఆకులు) ; ఉడికించిన బఠాణీ: అర కప్పు ; అల్లం – అంగుళం ముక్క ; వెల్లుల్లి రేకలు – 12 ; ఉల్లిపాయ – 1 పెద్దది ; పసుపు – చిటికెడు.

రైస్ కోసం: బాసుమతి బియ్యం – పావు కేజీ ; నూనె– టేబుల్ స్పూన్ ; నెయ్యి– టేబుల్ స్పూన్ ; జీడిపప్పు – 15 ; బిర్యానీ ఆకు– 2 ; దాల్చిన చెక్క – అంగుళం ; లవంగాలు – 5 ; నిమ్మకాయ– 1 ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచికి తగినంత ; కొత్తిమీర తరుగు – పావు కప్పు.

తయారీ: ● కొత్తిమీర పేస్ట్ కోసం తీసుకున్న అన్నింటినీ తగినంత నీటిని కలుపుతూ మెత్తగా గ్రైండ్ చేయాలి. ఆ పేస్ట్‌ను పలుచటి వస్త్రంలో వేసి వడకట్టాలి. నీరు పచ్చదనం తగ్గే వరకు రెండు లేదా మూడు సార్లు నీటిని పోసి పిండి పిప్పిని పారేయాలి. నాలుగు వందల మిల్లీలీటర్ల నీటిని సిద్ధం చేసుకుంటే బియ్యం ఉడకడానికి సరిపోతాయి. ● బియ్యం కడిగి కొత్తిమీర పేస్ట్ నుంచి వడపోసిన నీటిలో వేసి, ఉప్పు కలిపి గంట సేపు నాననివ్వాలి. ● మందపాటి బాణలిలో నెయ్యి, నూనె వేడి చేసి జీడిపప్పు దోరగా వేయించి తీసి పెట్టుకోవాలి. అదే బాణలిలో బిర్యానీ ఆకులు, దాల్చిన చెక్క, లవంగాలు వేసి వేయించాలి. ఇప్పుడు నానబెట్టిన బియ్యాన్ని నీటితో సహా వేసి మంట పెంచాలి. అన్నం ఉడకడం మొదలైన తరవాత మంట మీడియంలో ఉంచి ఉడకనివ్వాలి. నీళ్లు తగ్గి పోయిన తర్వాత అన్నంలో బఠాణీ, నిమ్మరసం వేసి కలిపి మూతపెట్టాలి. తేమ ఇంకి పోయిన తర్వాత అన్నం మీద జీడిపప్పు, కొత్తిమీర తరుగుతో అలంకరించి దించేయాలి. ఘుమఘుమలాడే కొత్తిమీర రైస్ రెడీ.

కాజు కర్రీ


కావలసినవి: జీడిపప్పు – 150 గ్రాములు ; నెయ్యి – 2 టీ స్పూన్‌లు ; నూనె – 2 టీ స్పూన్‌లు.

గ్రేవీ కోసం: జీడిపప్పు – 20 ; బాదం – 5 ; మెలన్ సీడ్స్ – టేబుల్ స్పూన్ ; ఉల్లిపాయ– ఒకటి ; దాల్చిన చెక్క – అంగుళం ముక్క ; మిరియాల పొడి – అర టీ స్పూన్ ; లవంగాలు – 2 ; పెరుగు – అరకప్పు ; నీరు –300 ఎంఎల్ ; పచ్చిమిర్చి – ఒకటి.

కర్రీ కోసం: నెయ్యి – 2 టీ స్పూన్‌లు ; బిర్యానీ ఆకులు – 2 ; లవంగాలు – 2 ; యాలకులు –4 ; దాల్చినచెక్క– అంగుళం ముక్క ; అల్లం వెల్లుల్లి పేస్ట్ – టీ స్పూన్ ; (ఎండిన) మెంతి ఆకుల పొడి – అర టీ స్పూన్ ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచికి తగినంత ; కొత్తిమీర తరుగు – పావు కప్పు ; పనీర్ – 100 గ్రాములు (తురమాలి) ; తాజా మీగడ– 2 టీ స్పూన్‌లు ; వెన్న – టేబుల్ స్పూన్.

తయారీ: ● మందపాటి బాణలి పెట్టి నెయ్యి, నూనె వేసి వేడి చేసి జీడిపప్పు వేయించి పక్కన పెట్టుకోవాలి. ● ఇప్పుడు అదే బాణలిలో గ్రేవీ కోసం తీసుకున్న దినుసుల్లో పెరుగు మినహా మిగిలినవి వేయించి అందులో నీళ్లు పోసి వేడి చేసి దించాలి. చల్లారిన తర్వాత నీటిని వడపోసి నీటిని పక్కన పెట్టుకోవాలి. ఆ దినుసుల్లో పెరుగు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి.

కర్రీ ప్రిపరేషన్: బాణలిలో మరో రెండు స్పూన్‌ల నెయ్యి వేడి చేసి దాల్చిన చెక్క, లవంగాలు, యాలకులు, బిర్యానీ ఆకు వేసి వేయించాలి. అల్లం– వెల్లుల్లి పేస్ట్, అందులో ముందుగా వడపోసి పక్కన పెట్టిన నీటిని పోసి అందులో కసూరి మేథీ (ఎండిన మెంతి ఆకుల పొడి), ఉప్పు, కాజు పేస్ట్ వేసి సన్న మంట మీద ఉడికించాలి. గ్రేవీ చిక్కబడిన తరవాత మొదట వేయించి పక్కన ఉంచిన జీడిపప్పు, మీగడ, వెన్న వేసి కలిపి మూత పెట్టి ఒక నిమిషం పాటు రుచి పట్టనివ్వాలి. ఇప్పుడు పనీర్ తురుము, కొత్తిమీరతో గార్నిష్ చేయాలి.


కాజు కర్రీ
తెలంగాణ రెడ్ చికెన్

గెలుపు బాట


● రోమిత

పురుషాధిపత్య భావజాలం, లింగవివక్షత గురించి వినడమే కాని రోమిత అనుభవంలోకి ఎప్పుడూ రాలేదు. అయితే ఒకానొక దశలో తాను కూడా వాటి బారిన పడక తప్పలేదు. బాధ పడి ఆగిపోయి ఉంటే ఎంటర్‌ప్రెన్యూర్‌గా రోమిత మజుందార్ విజయం సాధించేది కాదు.

అందమైన విజయం

జార్ఖండ్‌లోని రాంచిలో పుట్టి పెరిగింది రోమిత. తండ్రి న్యాయవాది. తల్లిదండ్రులు తన పట్ల ఎప్పుడూ వివక్ష ప్రదర్శించలేదు. సోదరుడితో సమానంగా పెంచారు. యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో బిజినెస్ ఎకనామిక్స్ చదువుకునే రోజుల్లో కూడా తనకు వివక్ష ఎదురు కాలేదు.

హార్బర్ రిడ్జ్ క్యాపిటల్‌లో ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్‌గా కెరీర్‌ను ప్రారంభించింది రోమిత. ఆ తరువాత వెంచర్ క్యాపిటలిస్ట్(వీసి)గా కూడా తనను తాను నిరూపించుకుంది.

ఒకానొకరోజు...తనకు వ్యాపారరంగంలోకి ప్రవేశించాలని ఆలోచన వచ్చింది. లాయర్ల కుటుంబం నుంచి వచ్చిన రోమితకు ఎలాంటి వ్యాపార అనుభవం లేదు.

'ఎందుకొచ్చిన రిస్క్' అని అనుకొని ఉంటే తన కలను నెరవేర్చుకునేది కాదు.

కాస్మొటిక్స్ బేస్డ్ స్టార్టప్ గురించి ఆలోచనతో నిధుల సమీకరణకు ప్రయత్నాలు మొదలు పెట్టినప్పుడు తనను బాధ పెట్టే ఎన్నో అనుభవాలు, ప్రశ్నలు ఎదురయ్యాయి.

'మీరు మాత్రమేనా?' 'మేల్ కో–ఫౌండర్ ఎవరూ లేరా?

'మీకు పెళ్లి అయిందా? అయితే పూర్తి సమయం కంపెనీ కోసం ఎలా కేటాయించగలరు?'

'మీరు సీరియస్‌గా వ్యాపారరంగంలోకి వచ్చినట్లుగా అనిపించడం లేదు. ఏదో సరదాగా వచ్చినట్లు అనిపిస్తుంది'... ఇవి మనసులోకి తీసుకుని ఉంటే రోమిత మజుందార్ తిరిగి వెనక్కి వెళ్లేదే తప్ప ముందుకు అడుగు వేసేది కాదు.

ఎన్నో రకాల అనుమానాలు, అవమానాలను ఎదుర్కొని ఎట్టకేలకు కాస్మోటిక్ బేస్డ్ స్టార్టప్ 'ఫాక్స్‌టేల్'తో తన కలను నిజం చేసుకుంది. ముంబై కేంద్రంగా పనిచేస్తున్న ఈ కంపెనీ నాలుగు రకాల ఉత్పత్తులతో మార్కెట్‌లోకి ప్రవేశించి కొద్దికాలంలోనే విజయకేతనం ఎగరేసింది. ఎంటర్‌ప్రెన్యూర్‌గా రోమిత మజుందార్ మంచి పేరు తెచ్చుకుంది.

కిచెన్ టిప్స్

వంటకాలలో పసుపు ఎక్కువ పడితే..?

మీ కూరలో పసుపును ఎక్కువగా కలిపినప్పుడల్లా అందులో కొన్ని తాజా బంగాళాదుంప ముక్కలను కట్ చేసి వేయండి. దానికి కొద్దిగా నీరు పోసి పూర్తిగా ఉడకనివ్వండి. బంగాళదుంపలు మీ వంటలో అదనపు పసుపు పొడి లేదా ఉప్పును పీల్చుకుని రుచిని సమతుల్యం చేస్తాయి.

లేదంటే స్పూను పెరుగు, చిటికెడు ఉప్పు, చిటికెడు కారం కాసిని నీటిలో కలిపి ఈ మిశ్రమాన్ని పసుపు ఎక్కువైన ఆహార పదార్థానికి కలిపితే సరి. లేదంటే పసుపు ఎక్కువైన ఆహారంలో అదనపు పసుపును సమతుల్యం చేయడానికి మరొక సులభమైన మార్గం చింతపండు పేస్ట్, ఉసిరి పొడి లేదా ఉసిరి పొడి వంటి పుల్లని, ప్రాసెస్ చేసిన పదార్థాలను కలపండి. ఇది పసుపు పొడి చేదు రుచిని సమతుల్యం చేయడంలో సహాయపడుతుంది.



ఒక అరస్పూను చక్కెరను నీరు లేదా తాజా క్రీమ్‌తో కలపండి. దాన్ని పసుపు ఎక్కువైన ఆహారంలో చేర్చండి. ఇది పసుపు పొడి చేదు రుచిని తగ్గించడానికి సహాయకారిగా పని చేస్తుంది.

• గేమింగ్

ఆట కట్టించగలరా!

ఈ నెల 24న విడుదల కాబోతున్న యాక్షన్ రోల్-ప్లేయింగ్ గేమ్ ఫర్స్పోకెన్. ఈ ఓపెన్ వరల్డ్ గేమ్ ఫార్మట్‌లో ప్లేయర్స్ ఏ టైమ్‌లో అయినా, ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణించవచ్చు. ప్రతి కంబాట్ ఎన్‌కౌంటర్‌లో ప్లేయర్స్ ఎక్స్‌పీరియన్స్ పాయింట్స్ సొంతం చేసుకోవచ్చు. ఈ గేమ్‌లో కథానాయిక పేరు ఫ్రైహలండ్. న్యూయార్క్ నుంచి మాయా ప్రపంచంలోకి వెళుతుంది. తన దగ్గర ఉన్న శక్తిమంతమైన ఎర్త్‌మ్యాజిక్, ఫైర్‌మ్యాజిక్‌లను ఉపయోగించి రాక్షస సమూహాల పని పడుతుంది.



ఈ గేమ్‌లోని యూనిక్ ట్రావెల్ సిస్టమ్ అసాధ్యమైన వాటిని సుసాధ్యం చేస్తుంది. 'ఐసేకై' (జపనీస్‌లో) లేదా 'ఫిష్ ఔట్ ఆఫ్ వాటర్ యాక్షన్ గేమ్ 'ఫర్స్పోకెన్'లో 'రే-ట్రేసింగ్' అనేది ప్రత్యేకం.

జానర్: యాక్షన్-రోల్ ప్లేయింగ్ గేమ్
మోడ్: సింగిల్ ప్లేయర్
ప్లాట్‌ఫామ్: ప్లేస్టేషన్ 5, విండోస్

• సక్సెస్ స్టోరీ

ఏఐ రాగం ఎంత మధురం!

కంటెంట్ క్రియేషన్, పాడ్‌కాస్ట్... మొదలైన వాటిలో బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ అనేది కీలకం. అయితే కాపీరైట్స్ అనేది ప్రధాన సమస్యగా మారింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని కాపీరైట్స్‌తో పనిలేని ఎ.ఐ టూల్‌ను సృష్టించాడు సిద్దార్థ భరద్వాజ్.



పాడ్‌కాస్ట్... మొదలైనవి చేసేవారికి, కంటెంట్ క్రియేటర్స్‌కు 'కాపీ రైట్' అనేది ప్రధాన సమస్య. ఈ నేపథ్యంలో ఎ.ఐ-ఆధారిత మ్యూజిక్ క్రియేషన్ టూల్ 'బీథోవెన్.ఏఐ' రాయల్టీ ఫ్రీ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌ను అందించడంలో తోడ్పడుతుంది. ఐఐఐటీ-అలహాబాద్‌లో చదువు పూర్తయిన తరువాత బెంగళూరు కేంద్రంగా 'బీథోవెన్.ఏఐ' స్టార్టప్‌కు శ్రీకారం చుట్టాడు సిద్ధార్థ భరద్వాజ్.

బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ పీస్‌ను క్రియేట్ చేయడానికి 'బీథోవెన్.ఏఐ' మ్యూజిక్ డైరెక్టర్‌లా ఉపయోగపడుతుంది. కోరుకున్న మ్యూజిక్‌కు సంబంధించి జానర్, టెంపో ఎంపిక చేసుకొని టైమ్ సెట్ చేసుకుంటే సరిపోతుంది. డీప్ లెర్నింగ్ నెట్‌వర్క్‌లను ఉపయోగించి పనిచేసే వ్యవస్థ ఇది.

ఒక నిమిషం ట్రాక్ కోసం పది సెకండ్ల టైమ్ పడుతుంది. పది సెకండ్ల గిటార్ రిఫ్, పదిహేను సెకండ్ల పియానో మెలోడీల కోసం ఎంతో మంది మ్యూజిక్ డైరెక్టర్లతో కలిసి పనిచేసింది కంపెనీ.

'ఇది మ్యూజిక్ డైరెక్టర్‌ల కోసం సృష్టించిన పరికరం కాదు' అని 'బీథోవెన్.ఏఐ' టూల్ గురించి చెబుతున్నాడు భరద్వాజ్.

'బీథోవెన్.ఏఐ ఉన్నంత మాత్రాన మ్యూజిక్ డైరెక్టర్‌తో అవసరం ఉండదు అనుకోవడం తప్పు' అని స్పష్టత ఇస్తున్నాడు.

ఈ టూల్ గురించి భరద్వాజ మాటల్లో చెప్పాలంటే...

హలో వరల్డ్

ఎంతోమంది రికార్డింగ్ ఆర్టిస్ట్‌లు ఎ.ఐతో లిరిక్ జెనరేట్ చేయడం గురించి ప్రయోగాలు జరుపుతున్నారు. మ్యూజిషియన్, టెక్ రిసెర్చర్, ఫ్రాన్సోయిస్ పచెట్ కృత్రిమ మేధస్సుతో కంపోజ్ చేసిన ఫస్ట్ ఆల్బమ్ 'హలో వరల్డ్' ఆదరణ పొందింది. అయితే భవిష్యత్ విషయానికి వస్తే ఎ.ఐ ఆధారిత సంగీతానికి కోర్టు సమస్యలతో పాటు రకరకాల సమస్యలు ఎదురుకానున్నాయి. ఆ పరీక్షలను తట్టుకోగలదా? లేదా? అనేది వేచిచూడాల్సిందే.

'ఎ.ఐ (కృత్రిమ మేధస్సు)కు శిక్షణ ఇస్తే అది వినసొంపైన మ్యూజిక్ బిట్‌ను అందిస్తుంది. అలా అని చారిత్రక సంగీతానికి సంబంధించి ఎ.ఐకి శిక్షణ ఇవ్వలేము. అందుకే మాదైన డాటాను క్రియేట్ చేసుకున్నాం' అంటాడు భరద్వాజ.

అవసరమైన మ్యూజిక్ బిట్‌ను అందించడం మాత్రమే కాదు మ్యూజిక్ ఎలా కంపోజింగ్ చేయాలి, మిక్సింగ్ అండ్ మాస్టరింగ్ లోనూ ఈ ఎ.ఐ టూల్ ఉపయోగపడుతుంది.

తాజాగా వీడియోగేమ్స్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కోసం కూడా ఉపయోగిస్తున్నారు.

'సంగీతం అనేది సృజనాత్మక ప్రక్రియ. మానవ, కృత్రిమ మేధస్సుతో ముడిపడిన అంశం' అంటాడు భరద్వాజ.

'మరి ఈ కృత్రిమ సంగీతంలో సహజత్వం మాటేమిటి?' అనే ప్రశ్నకు భరద్వాజ్ జవాబు ఇది...

'తెరపై కనిపించే దృశ్యానికి నేపథ్య సంగీతం బలాన్ని ఇస్తుంది. అయితే అది ఎలాంటి సంగీతం అనేది ముఖ్యం. మేము సృష్టించిన సంగీతం సింథటిక్, ఎ.ఐ-జెనరేట్ అనిపించదు. ఒక మ్యూజిషియన్ కంపోజ్ చేసినట్లే సహజంగా ఉంటుంది'

'బీథోవెన్.ఏఐ' అనేది సబ్‌స్క్రిప్షన్‌కు సంబంధించిన మోడల్.

'ఎ.ఐ వ్యవస్థ మనం కోసం ఎంతో సృష్టించింది. అందులో ఏది, ఎలా ఎంపిక చేసుకోవాలనేది మన అవసరాలపై ఆధారపడి ఉంటుంది. బీథోవెన్.ఏఐ అందరికీ ఉపయోగపడే పరికరం కాదు. వ్యక్తిగత అవసరాలను దృష్టిలో పెట్టుకొని రూపొందించింది' అంటున్న భరాద్వాజ్ వచ్చే నెలలో వీడియోలోని దృశ్యానికి, మూడ్‌కు పర్‌ఫెక్ట్‌గా సరిపోయే 'మ్యూజిక్ పీస్'ను అందించే ఎ.ఐ-ఆధారిత టూల్‌ను తీసుకురానున్నాడు.

బెస్ట్ ఆఫ్ లక్... భరద్వాజ్

• టెక్..టాక్

వాట్సాప్‌లో డిఫరెంట్ రింగ్‌టోన్స్ కోసం



ఇన్‌స్టంట్ మెసేజింగ్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్‌లో (ఆండ్రాయిడ్) డిఫరెంట్ యూజర్‌లకు, డిఫరెంట్ రింగ్‌టోన్‌ల కోసం...

1. కన్వర్‌సేషన్ ట్యాబ్-సెలెక్ట్
2. కాంటాక్ట్‌ను సెలెక్ట్ చేసుకున్న తరువాత కస్టమ్ రింగ్‌టోన్ సెట్ చేసుకోవాలి.
3. పేజీ స్క్రోల్ డౌన్ చేసి-కస్టమ్ నోటిఫికేషన్ సెలెక్ట్ చేసుకోవాలి.
4. 'యూజర్ కస్టమ్ నోటిఫికేషన్' బాక్స్ టిక్ చేయాలి.
5. కాల్ నోటిఫికేషన్ కింద ఉన్న రింగ్‌టోన్ ట్యాప్ చేసి ఇష్టమైన రింగ్‌టోన్ సెలెక్ట్ చేసుకోవాలి.

డెల్ ఎక్స్‌పీఎస్ 13 ప్లస్



డిస్‌ప్లే: 13.4 అంగుళాలు
రిజల్యూషన్: 1920×1200 పిక్సెల్స్
బరువు: 1.23 కిలోలు
హైట్: 15.28 ఎంఎం
విడ్త్: 295.30 ఎంఎం
• వెబ్ కెమెరా • ఫింగర్ ప్రింట్ సెన్సర్ • ఐ సేఫ్ టెక్నాలజీ • స్పీకర్స్-2

జెబ్రోనిక్స్ డ్రిప్ స్మార్ట్‌వాచ్



స్క్రీన్ సైజ్: 4.29 సీఎం
టైప్: టీఎఫ్‌టీ కలర్ డిస్‌ప్లే
డైమెన్షన్స్: 112×16×163
బ్యాటరీ: 250 ఎంఏహెచ్ బిల్ట్-ఇన్ రీఛార్జబుల్
డాటా స్టోరేజ్: 5 రోజులు
ఫీచర్స్: స్లీప్ మానిటర్, హార్ట్‌రేట్, ఎస్పీవో2 అండ్ బీపీ మానిటర్...మొదలైనవి.

మల్టీ-ఫంక్షనల్ ఛార్జింగ్ స్టాండ్



బ్రాండ్: పిట్రాన్
కనెక్షన్ టైప్: యుఎస్‌బి
కలర్: బ్లాక్
స్పెషల్ ఫీచర్: ఫాస్ట్ ఛార్జింగ్
ధర: ₹ 999.00

స్ఫూర్తి

ప్రవాహమై కదలింది



'నేను, నా చదువు మాత్రమే' అని ఎప్పుడూ అనుకోలేదు ఢిల్లీకి చెందిన 26 సంవత్సరాల భావి బరాడ్. సామాజిక సేవ నుంచి యువతరం హక్కుల వరకు ఎన్నో విషయాలపై తన గొంతు వినిపిస్తోంది. ప్రస్తుతం యూత్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ 'ప్రవాహ్'లో పని చేస్తున్న భావి బరాడ్ 'పది మందితో కలిసి పనిచేయడంలో ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు' అంటుంది.

కోవిడ్ సమయంలో ఎంతోమంది బాధితులకు అండగా నిలబడింది. సహాయక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంది.

'వర్గ, కుల, మత భేదాలు లేకుండా అందరూ కలిసి శాంతిసౌభాగ్యాలతో జీవించాలి' అనేది తన కోరిక.

ఐక్యరాజ్య సమితి 'ఇండియా యువ అడ్వకేట్స్'గా ఫస్ట్ బ్యాచ్‌కు ఎంపికైన ఆరుగురిలో భావి బరాడ్ ఒకరు.

'సామాజిక సేవలో ఉన్న గొప్పతనం ఏమిటంటే ఫలితం ఆశించకుండా నిజాయితీగా కష్టపడడం. అయితే నిజాయితీగా పని చేసే వారికి మంచి ఫలితం దూరంగా ఉండదు. వారిని మరో రెండు అడుగులు ముందుకు నడిపిస్తుంది' అంటుంది భావి బరాడ్.

సమాజసేవకు సంబంధించిన విషయాలను ఇతరులతో పంచుకోవడానికి సామాజిక మాధ్యమాలను ఉపయోగించుకుంటుంది బరాడ్.

స్కూల్, కాలేజీలలో జెండర్ ఈక్వాలిటీ నుంచి పర్యావరణ స్పృహ వరకు రకరకాల విషయాలపై మాట్లాడడం, యూత్ కెరీర్‌కు సంబంధించి ప్యానల్ డిస్కషన్‌లలో చురుగ్గా పాల్గొంటుంది.

'పుస్తకాలు చదవడం అంటే ఇష్టం' అంటున్న భావి బరాడ్ సమాజాన్ని చదవడం ద్వారా మర్నీ విషయాలను తెలుసుకుంటుంది.

బాక్సాఫీస్‌పై గురి

తుపాకీ పట్టారు.. విలన్లపై గురి పెట్టారు... రెచ్చిపోయి ఫైట్స్ చేస్తున్నారు... బాక్సాఫీస్ కలెక్షన్లపై గురి పెట్టారు... ప్రస్తుతం కొందరు కథానాయికలు సిన్సియర్ పోలీసాఫీసర్లుగా, లేడీ జేమ్స్ బాండ్ తరహా పాత్రల్లో నటిస్తున్నారు. ఆ చిత్రాల గురించి తెలుసుకుందాం.


• టబు


• త్రిష

సీనియర్ నటి టబు మరో రెండు నెలల్లో ఇన్‌స్పెక్టర్ డయానా జోసెఫ్‌గా కనిపించనున్నారు. అజయ్ దేవగన్ హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న హిందీ చిత్రం 'భోలా'లోనే ఆమె పోలీస్ ఇన్‌స్పెక్టర్ డయానా జోసెఫ్ పాత్ర చేస్తున్నారు. మూడు రోజుల క్రితం ఈ చిత్రంలో టబు లుక్ విడుదలైంది. మార్చి 30న ఈ చిత్రం విడుదల కానుంది. ఇక గత ఏడాది సెప్టెంబర్‌లో 'పొన్నియిన్ సెల్వన్' చిత్రంలో యువరాణి పాత్రలో కనిపించిన త్రిష త్వరలో విడుదల కానున్న వెబ్ సిరీస్ 'బృందా'లో తుపాకీ తూటాలను అలవోకగా వదిలే పోలీస్‌గా కనిపించనున్నారు. త్రిష నటించిన తొలి వెబ్ సిరీస్ ఇది. సూర్య వంగల దర్శకత్వంలో రూపొందిన ఈ సిరీస్ సీజన్ వన్ షూటింగ్ ఇటీవలే పూర్తయింది. త్వరలో స్ట్రీమింగ్ కానుంది. ఓ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ చుట్టూ తిరిగే కథతో ఈ సిరీస్ రూపొందింది. ఇక కాజల్ అగర్వాల్ కూడా సిన్సియర్ పోలీసాఫీసర్‌గా కనిపించనున్నారు. 'ఘోస్టీ' అనే చిత్రంలోనే ఈ పాత్ర చేశారామె. తన తండ్రి అడుగుజాడలను అనుసరించి, పోలీస్‌గా మారుతుంది ఆర్తి (కాజల్). ఇరవయ్యేళ్ల క్రితం తన తండ్రి కస్టడీ నుంచి తప్పించుకున్న ఖైదీని పట్టుకోవాలన్నదే ఆర్తి ఆకాంక్ష. ఈ క్రమంలో ఆమెకు విచిత్రమైన ఘటనలు ఎదురవుతుంటాయి. కాజల్ నటించిన తొలి హారర్ సినిమా ఇది. కల్యాణ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. మరోవైపు అధికారిక ప్రకటన రాలేదు కానీ ఓ హిందీ షోలో తమన్నా పోలీస్‌గా చేస్తున్నారనే వార్త ప్రచారంలోకి వచ్చింది. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో ఈ షో సాగుతుందని సమాచారం. ఇంకోవైపు దాదాపు లేడీ ఓరియంటెడ్ సినిమాలు చేస్తున్న నయనతార తన తొలి హిందీ చిత్రం 'జవాన్'లో పోలీసాఫీసర్ పాత్ర చేస్తున్నారు. షారుక్ ఖాన్ హీరోగా తమిళ దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న తొలి హిందీ చిత్రం ఇది. ఈ చిత్రంలో అన్యాయంగా జైలుపాలైన మహిళలను విడిపించి, వారిని సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడే ఒక టీమ్‌గా మార్చే కామన్ మేన్ పాత్రను షారుక్ ఖాన్ చేస్తున్నారని సమాచారం. ఈ కేసును ఛేదించే పోలీసాఫీసర్ పాత్రలో నయనతార కనిపిస్తారని టాక్. ఈ ఏడాది జూన్ 2న ఈ చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నారు. ఇక అభినయానికి ఆస్కారం ఉన్న పాత్రలంటే దర్శకులకు గుర్తొచ్చే కథానాయికల్లో కీర్తీ సురేష్ ముందు వరుసలో ఉంటారు. ప్రస్తుతం కీర్తి చేస్తున్న చిత్రాల్లో 'రివాల్వర్ రీటా' ఒకటి. రెండు చేతులతో రెండు తుపాకీలు పట్టుకుని అలవోకగా షూట్ చేసే రీటా పాత్రలో కనిపించనున్నారు కీర్తి. కె. చంద్రు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో లేడీ జేమ్స్ బాండ్ తరహా పాత్ర చేస్తున్నారామె. మరోవైపు హిందీ చిత్రం 'కమాండో' సీక్వెల్స్‌లో పోలీస్ ఇన్‌స్పెక్టర్ భావనా రెడ్డిగా కనిపించిన అదా శర్మ ప్రస్తుతం ఓ హిందీ చిత్రంలో పోలీస్ ఆఫీసర్‌గా చేస్తున్నారు. విశాల్ పాండ్య దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. మరోసారి పోలీస్‌గా నటించే అవకాశం రావడం ఆనందంగా ఉంది అంటున్నారు అదా. ఇక 'సీతారామం' చిత్రంతో పాపులర్ అయిన మృణాల్ ఠాకూర్ నటించిన హిందీ చిత్రం 'గూమ్రా'. 'సీతారామం'లో సున్నిత మనసు ఉన్న సీత పాత్రలో అందర్నీ ఆకట్టుకున్న మృణాల్ 'గూమ్రా'లో శక్తిమంతమైన పోలీసాఫీసర్‌గా కనిపించనున్నారు. ఈ పాత్ర చేయడానికి శిక్షణ తీసుకున్నారు మృణాల్. తమిళ చిత్రం 'తడమ్'కి రీమేక్‌గా వర్ధన్ కట్కర్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది.


• కాజల్


• షారుక్ నయనతార


• కీర్తి



• అదా శర్మ


• మృణాల్

ఈ తారలే కాదు.. మరికొందరు కథానాయికలు కూడా పోలీసాఫీసర్ పాత్రల్లో విజృంభించనున్నారు.

ఆర్ఆర్ఆర్ నో

• బాఫ్టా నామినేషన్లలో దక్కని చోటు



ఇప్పటికే పలు అంతర్జాతీయ అవార్డులు సొంతం చేసుకున్న 'ఆర్ఆర్ఆర్' చిత్రం ప్రతిష్ఠాత్మక 'బాఫ్టా' (బ్రిటీష్ అకాడమీ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఆర్ట్స్) అవార్డు కోసం లాంగ్‌లిస్ట్‌లో చేరిన సంగతి తెలిసిందే. అయితే గురువారం ప్రకటించిన 'బాఫ్టా' తుది నామినేషన్ల జాబితాలో 'ఆర్ఆర్ఆర్' చిత్రానికి చోటు దక్కలేదు. రామ్‌చరణ్, ఎన్టీఆర్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన చిత్రం 'ఆర్ఆర్ఆర్'. ఈ సినిమా 'బాఫ్టా' నాన్ ఇంగ్లిష్ లాంగ్‌లిస్ట్ కేటగిరీలో చోటు దక్కించుకుంది. అయితే టాప్ 5తో కూడిన ఫైనల్ లిస్టులో స్థానం కోల్పోయింది. తుది నామినేషన్ల జాబితాలో 'ఆల్ క్వైట్ ఆన్ ద వెస్ట్రన్ ఫ్రంట్, అర్జెంటీనా 1985, కోర్సేజ్, డెసిషన్ టు లీవ్, ద క్వయిట్ గర్ల్' చిత్రాలు నిలిచాయి. కాగా 'బెస్ట్ డాక్యుమెంటరీ' విభాగంలో ఇండియన్ డాక్యుమెంటరీ 'ఆల్ దట్ బ్రీత్స్'కి నామినేషన్ దక్కింది. మొత్తం 24 విభాగాల్లో నామినేషన్లు ప్రకటించగా, భారతదేశం నుంచి 'ఆల్ దట్ బ్రీత్స్' మాత్రమే నామినేషన్ దక్కించుకుంది. షౌనక్ సేన్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. ఫిబ్రవరి 19న 'బాఫ్టా' అవార్డుల వేడుక జరగనుంది. మరి.. 'ఆల్ దట్ బ్రీత్స్' అవార్డు కూడా గెలుచుకుంటుందా? చూడాలి.

గాండీవధారి అర్జున


• వరుణ్ తేజ్

వరుణ్ తేజ్ హీరోగా ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్ఎల్‌పీ బ్యానర్‌పై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'గాండీవధారి అర్జున' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. గురువారం (జనవరి 19) వరుణ్ తేజ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. మాస్క్ ధరించిన కొందరు మనుషులు ఓ రాజ భవనంలోనికి ప్రవేశించటానికి ప్రయత్నిస్తుడటం.. ఆ సందర్భంలో బాంబుల మోత, గన్ ఫైరింగ్ నడుమ వరుణ్ తేజ్ యాక్షన్ మోడ్‌లో కనిపిస్తుండటం మోషన్ పోస్టర్‌లో కనిపిస్తోంది. యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి మిక్కీ జె. మేయర్ సంగీతం, నేపథ్య సంగీతం అందిస్తున్నారు.

హంట్ నాకు మంచి రీ ఎంట్రీ

- 'ప్రేమిస్తే' భరత్



''హంట్' చిత్రంలో ఆర్యన్ దేవ్ అనే ఐపీఎస్ ఆఫీసర్‌గా నటించాను. అలాగే శ్రీకాంత్‌గారు, సుధీర్‌బాబు కూడా ఐపీఎస్ అధికారులుగా చేశారు. ఈ చిత్రకథ మా ముగ్గురి చుట్టూ తిరుగుతుంది. యాక్షన్, క్రైమ్, థ్రిల్లర్, ఎమోషన్, ఫ్రెండ్‌షిప్.. ఇలా అన్ని వాణిజ్య అంశాలున్నాయి. ఈ చిత్రం తెలుగులో నాకు మంచి రీ ఎంట్రీతో పాటు నా మార్కెట్‌కి ప్లస్ అవుతుందనే నమ్మకం ఉంది'' అని భరత్ ('ప్రేమిస్తే' ఫేమ్) అన్నారు. సుధీర్‌బాబు హీరోగా మహేశ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'హంట్'. శ్రీకాంత్, భరత్ కీలక పాత్రలు చేశారు. వి. ఆనంద ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 26న విడుదలకానుంది. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ - ''మహేశ్‌బాబుగారి 'స్పైడర్' చిత్రం తర్వాత తెలుగులో క్యారెక్టర్ ఆర్టిస్టుగా అవకాశాలు వచ్చాయి. అయితే తమిళంలో వరుసగా హీరోగా చేస్తున్న నేను తెలుగులో క్యారెక్టర్ ఆర్టిస్టుగా చేయాలనుకోలేదు.. కాగా దర్శకుడు మహేశ్ చెప్పిన 'హంట్' కథ, నా పాత్ర నచ్చింది. అందుకే చేశాను. నేను ఇండస్ట్రీకి వచ్చి 20 ఏళ్లు అవుతోంది. ఇక్కడ మన స్థానం ఎప్పుడెలా ఉంటుందో ఎవరూ చెప్పలేరు. కొందరిలా నేను కూడా హిట్లు, ఫ్లాపులతో ప్రయాణం చేస్తున్నాను. అయితే తమిళ ఇండస్ట్రీలో హీరోగా సంతోషంగా ఉన్నాను. యాక్షన్, ఎమోషన్, రొమాంటిక్.. ఇలాంటి కథలతోనే నన్ను అప్రోచ్ అవుతున్నారు. కానీ, నాకు పూర్తి స్థాయిలో ఓ కామెడీ సినిమా చేయాలని, రా ఏజెంట్ పాత్ర చేయాలని ఉంది'' అన్నారు.

కాపీ కొట్టలేదు

- అనికా సురేంద్రన్



''ఎన్నో ఏళ్లుగా బాలనటిగా సినిమాల్లో నటించాను. తొలిసారి 'బుట్టబొమ్మ' చిత్రంలో హీరోయిన్‌గా నటించే అవకాశం రావడం సంతోషంగా ఉంది. ఈ చిత్రంలో నా పాత్రలో ఎన్నో ఎమోషన్స్ ఉన్నాయి. నటనకు ఆస్కారం ఉంది'' అని అనికా సురేంద్రన్ అన్నారు. సూర్య వశిష్ఠ, అర్జున్ దాస్, అనికా సురేంద్రన్ ప్రధాన పాత్రల్లో శౌరి చంద్రశేఖర్ రమేష్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'బుట్టబొమ్మ'. ఎస్. నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా అనికా మాట్లాడుతూ-''నాది కేరళ. మలయాళంలో 'కప్పేల' సినిమా హిట్ అయింది. ఆ సినిమాకి రీమేక్‌గా రూపొందిన 'బుట్టబొమ్మ'లో కథానాయిక అవకాశం రావడం, పైగా సితార వంటి ప్రముఖ నిర్మాణ సంస్థ నిర్మిస్తుండటంతో వెంటనే అంగీకరించాను. 'కప్పేలా'లో నటించిన నటి (అన్నా బెన్)ని కాపీ కొట్టే ప్రయత్నం చేయలేదు. పాత్రను అర్థం చేసుకొని, నటించాను. తొలిసారి హీరోయిన్‌గా చేయడంతో మొదట్లో కొంత ఒత్తిడి ఉండేది.. అయితే దర్శకుడు రమేశ్ గారు, మిగతా యూనిట్ సపోర్ట్‌తో ఆ తర్వాత ఎలాంటి ఒత్తిడి లేకుండా సినిమాని పూర్తి చేశాను'' అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	187	60,858
నిఫ్టీ ▽	58	17,108

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	10,840	▽ 116
డోజోన్స్	33,027	▽ 270
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,747	▽ 83
డాక్స్	14,920	▽ 261
షాంఘై	3,240	△ 16
నికాయ్	26,405	▽ 386

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	56,670 ▽ 85
బంగారం (99.5 స్వచ్ఛత)	56,443 ▽ 95
వెండి (కిలో)	67,444 ▽ 1,549

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	80.62	82.29
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	86.41	89.45
€	యూరో	ఎస్‌బీఐ	98.79	102.12
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	62.43	64.49
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.14	57.48
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.59	62.60
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.07	22.37
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.25	23.05
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.87	12.94

సన్ ఫార్మా చేతికి కాన్సెర్ట్ ఫార్మా!

రూ. 4,688 కోట్లకు కొనుగోలు ఒప్పందం

న్యూఢిల్లీ: హెల్త్‌కేర్ రంగ దేశీ దిగ్గజం సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్ యూఎస్ కంపెనీ కాన్సెర్ట్ ఫార్మాస్యూటికల్స్‌ను సొంతం చేసుకోనుంది. ఇందుకు 57.6 కోట్ల డాలర్ల(సుమారు రూ. 4,688 కోట్లు)కు ఒప్పందాన్ని కుదుర్చుకుంది. షేరుకి 8 డాలర్ల ముందస్తు ధరలో టెండర్ ఆఫర్ ద్వారా కాన్సెర్ట్ షేర్లను నగదు వెచ్చించడం ద్వారా కొనుగోలు చేయనున్నట్లు సన్ ఫార్మా వెల్లడించింది. 57.6 కోట్ల డాలర్ల విలువైన ఈక్విటీని చేజిక్కించుకునేందుకు కాన్సెర్ట్ ఫార్మాతో తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు తెలియజేసింది. గత 30 రోజుల సగటు షేరు ధరను పరిగణిస్తే కాన్సెర్ట్ ఈక్విటీకి చెల్లిస్తున్న ధర 33 శాతం అధికమని తెలియజేసింది. కాన్సెర్ట్ వాటాదారులు ట్రేడింగ్‌కువీలులేని కంటింజెంట్ వేల్యూ రైట్(సీవీఆర్)కింద మరో 3.5 డాలర్లను అదనంగా పొందే వీలున్నట్లు వెల్లడించింది. అయితే నిర్ధారిత గడువులోగా నికర అమ్మకాల మైలురాళ్లను సాధించినప్పుడు మాత్రమే అదనపు చెల్లింపులకు వీలుంటుందని తెలియజేసింది.

కాన్సెర్ట్ ఫార్మా కొనుగోలు వార్తల నేపథ్యంలో సన్ ఫార్మా షేరు ఎన్‌ఎస్‌ఈలో రూ. 1,040 వద్ద యథాతథంగా ముగిసింది.

హెచ్‌యూఎల్ లాభం అప్

- క్యూ3లో రూ. 2,481 కోట్లు
- ఆదాయం రూ. 15,707 కోట్లు



న్యూఢిల్లీ: ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం హిందుస్తాన్ యూనిలీవర్(హెచ్‌యూఎల్) ఈ ఆర్థిక సంవత్సరం (2022–23) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో రూ. 2,481 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో సాధించిన రూ. 2,300 కోట్లతో పోలిస్తే ఇది 8 శాతం వృద్ధి. మొత్తం ఆదాయం మరింత అధికంగా 16 శాతం వృద్ధితో రూ. 15,707 కోట్లను తాకింది. గత క్యూ3లో రూ. 13,499 కోట్ల టర్నోవర్ నమోదైంది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 10,329 కోట్ల నుంచి రూ. 12,225 కోట్లకు పెరిగాయి. అన్ని విభాగాలలోనూ మరోసారి పటిష్ట పనితీరును సాధించగలిగినట్లు హెచ్‌యూఎల్ సీఎండీ సంజీవ్ మెహతా పేర్కొన్నారు. ఇందుకు వ్యూహాలలో స్పష్టత, బ్రాండ్ల బలిమి, పటిష్ట ఆర్థిక నిర్వహణ తదితర అంశాలు దోహదపడినట్లు తెలియజేశారు. ద్రవ్యోల్బణ ప్రభావాన్ని అధిగమించామని, కన్జూమర్ డిమాండు నెమ్మదిగా పుంజుకోనుందని అభిప్రాయపడ్డారు.

రాయల్టీ పెంపు

మాతృ సంస్థ యూనిలీవర్ గ్రూప్‌నకు చెల్లించే రాయల్టీ, ఇతర సెంట్రల్ సర్వీసుల ఫీజును పెంచేందుకు బోర్డు అనుమతించినట్లు క్యూ3 ఫలితాల విడుదల సందర్భంగా హెచ్‌యూఎల్ వెల్లడించింది. యూనిలీవర్ గ్రూప్ నుంచి అందుకునే టెక్నాలజీ, ట్రేడ్‌మార్క్ లైసెన్సులు, సర్వీసులకుగాను హెచ్‌యూఎల్ ఫీజు చెల్లిస్తుంది. తాజా ఒప్పందం ప్రకారం రాయల్టీ, సెంట్రల్ సర్వీసుల ఫీజును ప్రస్తుత 2.65 శాతం నుంచి 3.45 శాతానికి పెంచేందుకు బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఈ ఏడాది నుంచి మూడేళ్లపాటు టర్నోవర్‌లో 3.45 శాతం చొప్పున దఫదఫాలుగా రాయల్టీ చెల్లింపులను చేపట్టనుంది. వెరసి 0.8 శాతం అధిక రాయల్టీని చెల్లించనుంది. ఇందుకు నియంత్రణ సంస్థల నుంచి అనుమతులు లభించవలసి ఉంది. 2023 ఫిబ్రవరి నుంచి డిసెంబర్ మధ్యకాలంలో 0.45 శాతం, 2024 జనవరి నుంచి డిసెంబర్ వరకూ మరో 0.25 శాతం, 2025 జనవరి నుంచి 0.1 శాతం చొప్పున రాయల్టీ చెల్లింపులు పెరగనున్నట్లు హెచ్‌యూఎల్ వివరించింది. రెండు సంస్థలూ ప్రస్తుత ఒప్పందాన్ని 2013 జనవరిలో కుదుర్చుకున్నాయి.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌యూఎల్ షేరు 1.6 శాతం క్షీణించి రూ. 2,643 వద్ద ముగిసింది.

హిందుస్తాన్ జింక్ లాభం డౌన్

క్యూ3లో రూ. 2,156 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022–23) మూడో త్రైమాసికంలో వేదాంతా గ్రూప్ దిగ్గజం హిందుస్తాన్ జింక్ నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 20 శాతం క్షీణించి రూ. 2,156 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 2,701 కోట్లు ఆర్జించింది. పెరిగిన వ్యయాలు, తగ్గిన అమ్మకాలు లాభదాయకతను దెబ్బతీశాయి. మొత్తం ఆదాయం సైతం రూ. 7,841 కోట్ల నుంచి రూ. 7,628 కోట్లకు క్షీణించింది. మొత్తం వ్యయాలు రూ. 4,411 కోట్ల నుంచి రూ. 5,028 కోట్లకు పెరిగాయి. గతేడాది మిలియన్ టన్నుల మైన్‌డ్ మెటల్ మార్క్‌ను సాధించగా.. ఈ ఏడాది మిలియన్ టన్నుల రిఫైన్‌డ్ మెటల్ మైలురాయిని అందుకునే వీలున్నట్లు కంపెనీ సీఈవో అరుణ్ మిశ్రా విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. 2022 డిసెంబర్ 31కల్లా స్థూల పెట్టుబడులు, నగదు నిల్వల విలువ రూ. 16,482 కోట్లకు చేరినట్లు కంపెనీ వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో హింద్ జింక్ షేరు 4.3% జంప్‌చేసి రూ. 377 వద్ద ముగిసింది.

సూచీలకు మాంద్యం భయం

- 61 వేల దిగువకు సెన్సెక్స్
- నిఫ్టీకి 58 పాయింట్ల నష్టం
- రెండురోజుల ర్యాలీకి బ్రేక్



ముంబై: ఆర్థిక మాంద్యం భయాలతో దేశీయ స్టాక్ సూచీల రెండురోజుల ర్యాలీకి గురువారం బ్రేక్ పడింది. కేంద్ర బడ్జెట్, రానున్న ప్రధాన కంపెనీల త్రైమాసిక ఆర్థిక ఫలితాల విడుదల నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత వ్యవహరించారు. ఆటో, విద్యుత్, ఎఫ్‌ఎంసీజీ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో సెన్సెక్స్ 187 పాయింట్లు నష్టపోయి 60,858 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 58 పాయింట్లు పతనమై 17,108 వద్ద నిలిచింది. అయితే ప్రభుత్వరంగ బ్యాంక్స్, ఐటీ రంగ షేర్లకు స్వల్ప కొనుగోళ్ల మద్దతు లభించింది. ఆసియా మార్కెట్ల నుంచి ప్రతికూల ప్రతికూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం నష్టాలతో మొదలయ్యాయి. ట్రేడింగ్‌లో తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతూ లాభ, నష్టాల మధ్య కదలాడాయి. సెన్సెక్స్ 60,716 వద్ద కనిష్టాన్ని, 61,032 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 18,064 – 18,155 పరిధిలో కదలాడింది. అమెరికా తయారీ రంగ, రిటైల్ అమ్మకాలు మెప్పించకపోవడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- డిసెంబర్ క్వార్టర్ ఆర్థిక ఫలితాలు అంచనాలను అందుకోలేకపోవడంతో ఏషియన్ పెయింట్స్ షేరు 3% నష్టపోయి రూ.2,868 వద్ద స్థిరపడింది.
- ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్(ఎఫ్‌పీఓ) ప్రకటన తర్వాత అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు అమ్మకాల ఒత్తిడికి లోనవుతుంది. బీఎస్‌ఈలో నాలుగుశాతం క్షీణించి రెండు నెలల కనిష్ట స్థాయి రూ.3462 వద్ద స్థిరపడింది.
- బలమైన ఆదాయాల వృద్ధి నమోదు ఆశలతో ఓఎన్‌జీసీ షేరు రెండు శాతం పెరిగి ఆరు నెలల గరిష్టం రూ.152 వద్ద స్థిరపడింది.

ఏషియన్ పెయింట్స్ లాభం ప్లస్

క్యూ3లో రూ. 1,097 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం ఏషియన్ పెయింట్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో రూ. 1,097 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో సాధించిన రూ. 1,031 కోట్లతో పోలిస్తే ఇది 6.4 శాతం వృద్ధి. మొత్తం ఆదాయం సైతం రూ. 8,527 కోట్ల నుంచి రూ. 8,637 కోట్లకు పుంజుకుంది. అయితే మొత్తం వ్యయాలు రూ. 7,220 కోట్ల నుంచి రూ. 7,281 కోట్లకు పెరిగాయి. డెకొరేటివ్ విభాగంలో గతేడాది విక్రయ ధరలు భారీగా పెరిగిన(హై బేస్) కారణంగా ప్రస్తుత సమీక్షా కాలంలో అమ్మకాల పరిమాణం, విలువలో మందగమనం నమోదైనట్లు కంపెనీ ఎండీ, సీఈవో అమిత్ సింగ్లే పేర్కొన్నారు. అక్టోబర్‌లోనూ రుతుపవనాలు కొనసాగడంతో పండుగల నేపథ్యంలోనూ రిటైల్ అమ్మకాలు నీరసించాయని, అయితే నవంబర్, డిసెంబర్‌లో తిరిగి ఊపందుకున్నట్లు తెలియజేశారు. అయితే ఆటోమొబైల్ తదితర ఇండస్ట్రియల్ విభాగం అమ్మకాల్లో పటిష్ట వృద్ధిని సాధించినట్లు వెల్లడించారు.

ఫలితాల నేపథ్యంలో ఏషియన్ పెయింట్స్ షేరు 3.2 శాతం క్షీణించి రూ. 2,853 వద్ద ముగిసింది.

సుప్రీంలోనూ గూగుల్‌కు షాక్!

- ఆండ్రాయిడ్ ఆధిపత్యం కేసులో జోక్యానికి నిరాకరణ
- ఎన్‌సీఎల్‌ఏటీ ఉత్తర్వుపై మధ్యంతర స్టేకు నో..



న్యూఢిల్లీ: ఆండ్రాయిడ్ ఆధిపత్యం వివాదం విషయంలో గూగుల్‌కు సుప్రీంకోర్టులోనూ ఎదురుదెబ్బ తగిలింది. ఇందుకు సంబంధించి నేషనల్ కంపెనీ లా అప్పీలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌ఏటీ) ఉత్తర్వును ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు పీఎస్ నరసింహ, జేబీ పార్దివాలాతో కూడిన ధర్మాసనం సమర్థించింది. అప్పీలేట్ ట్రిబ్యునల్ రూలింగ్‌పై మధ్యంతర స్టేకు నిరాకరించింది. అయితే మార్చి 31 నాటికి ఈ వివాదం విషయంలో తుది తీర్పును ఇవ్వాలని ఎన్‌సీఎల్‌ఏటీకి ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు విషయంలో కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) విధించిన రూ.1,337 కోట్ల జరిమానాలో 10 శాతాన్ని వారం రోజుల లోపు డిపాజిట్ చేయాలని కూడా అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది.

కేసు ముఖ్యాంశాలు...

- ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్ రూపంలో గూగుల్ తన ఆధిపత్యాన్ని దుర్వినియోగం చేస్తోందని, అనుచిత వ్యాపార విధానాలను అనుసరిస్తోందంటూ కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అక్టోబర్ 20న రూ.1337 కోట్ల జరిమానాను విధించడం గమనార్హం.
- దీనిపై అప్పీలేట్ ట్రిబ్యునల్‌లో గూగుల్ సవాల్ చేసింది.
- అయితే, ఈ వివాదంలో ఎన్‌సీఎల్‌ఏటీ కూడా ఈ నెల మొదట్లో గూగుల్‌కు ఎదురుదెబ్బ తగిలింది. సీసీఐ ఆదేశాలపై మధ్యంతర స్టే విధించేందుకు ఎన్‌సీఎల్‌ఏటీ నిరాకరించింది. ఆధిపత్య ఆరోపణలకు సంబంధించి సీసీఐ విధించిన రూ.1337 జరిమానాలో 10 శాతాన్ని డిపాజిట్ చేయాలని ఆదేశించింది. సీసీఐకి నోటీసులు ఇవ్వడంతో పాటు మధ్యంతర స్టేపై తదుపరి విచారణను ఫిబ్రవరి 13కు వాయిదా వేసింది.
- తాజాగా సుప్రీం కూడా గూగుల్ అప్పీల్‌కు రెడ్ సిగ్నల్ ఇచ్చింది. అప్పీల్ విచారణకు కాలపరిమితి సూచించడమే గూగుల్‌కు ఊరటనిచ్చే అంశం.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

20-1-2023	
విశాఖ	575–00
చిత్తూరు	568–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	555–00
విజయవాడ	555–00
రిటైల్ ధర (డజను)	84.00
19-1-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	550–00
వరంగల్	552–00
రిటైల్ ధర	6.10

డల్లాస్‌లో మలబార్ గోల్డ్ 300వ షోరూం



హైదరాబాద్: ప్రముఖ బంగారం, వజ్రాల ఆభరణాల తయారీ సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ అమెరికాలోని డల్లాస్‌లో 300వ షోరూంను ఏర్పాటు చేసింది. ఈ జనవరి 18న కొల్లిన్ కౌంటీ కమిషనర్ సుసన్ ఫ్లెచర్, టెక్సాస్ ఫ్రిస్కో మేయర్ జెఫ్ చెనీలు ప్రారంభించారు. గ్రూప్ చైర్మన్ ఎంపీ అహ్మద్, వైస్ చైర్మన్ కేపీ అబ్దుల్ సలాంతో పాటు ఎండీ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఇతర సభ్యులు వర్చువల్ పద్ధతిలో పాల్గొన్నారు. భారతీయ ఆభరణాలు, డిజైన్లకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ లభిస్తుందని అందుకే విదేశాల్లో విస్తరిస్తున్నామని చైర్మన్ అహ్మద్ తెలిపారు.



సానియా జోడీ ముందంజ

హైదరాబాద్ వెటరన్ టెన్నిస్ స్టార్ సానియా మీర్జా మహిళల డబుల్స్‌లో ముందంజ వేసింది. కెరీర్‌లో ఆఖరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆడుతున్న ఆమె అనా డానిలినా (కజకిస్తాన్) కలిసి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో శుభారంభం చేసింది. తొలి రౌండ్లో సానియా–డానిలినా జోడీ 6–2, 7–5తో డాల్మా గాల్ఫీ (హంగేరి)–బెర్నార్డా పెర (అమెరికా) జంటపై విజయం సాధించింది. తొలి సెట్‌ను 25 నిమిషాల్లోనే వశం చేసుకున్న భారత్–కజకిస్తాన్ ద్వయానికి రెండో సెట్లో అనూహ్య పోటీ ఎదురైంది. 4–1తో గెలిచే దశలో కనిపించిన సానియా జోడీకి గాల్ఫీ–బెర్నార్డా వరుసగా 4 గేమ్‌లు గెలిచి సవాలు విసిరారు 5–5తో సమం చేశారు. అయితే తర్వాత వారి సర్వీస్‌ను బ్రేక్ చేయడం ద్వారా సానియా–డానిలినా జంట గెలుపొందింది. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో 2009 (మిక్స్‌డ్), 2016 (డబుల్స్)లలో సానియా విజేతగా నిలిచింది.

'క్రాస్ ఓవర్'కు భారత్



- చివరి లీగ్‌లో 4–2తో వేల్స్‌పై విజయం
- ప్రపంచ కప్ హాకీ

భువనేశ్వర్: ప్రపంచ కప్ హాకీ టోర్నీలో నేరుగా క్వార్టర్ ఫైనల్ చేరుకునే లక్ష్యంతో గురువారం వేల్స్‌తో మ్యాచ్‌లో బరిలోకి దిగిన భారత్... కనీసం 8 గోల్స్ తేడాతో గెలిస్తే 'క్రాస్ ఓవర్' మ్యాచ్ అవసరం లేకుండా నేరుగా క్వార్టర్స్‌లో అడుగుపెట్టే అవకాశం. కానీ భారత జట్టు అంతటి అత్యుత్తమ స్థాయి ప్రదర్శన కనబర్చలేకపోయింది. బలహీన జట్టే అయినా వేల్స్ బాగా పోటీ ఇచ్చింది. చివరకు 4–2తో గోల్స్ తేడాతో భారత్ విజయం సాధించింది. భారత్ తరఫున షంషేర్ సింగ్ (21వ నిమిషం), ఆకాశ్‌దీప్ సింగ్ (32వ నిమిషం, 45వ నిమిషం), హర్మన్‌ప్రీత్ సింగ్ (59వ నిమిషం) గోల్స్ సాధించగా...వేల్స్ ఆటగాళ్లలో ఫర్లాంగ్ గ్యారెత్ (42వ నిమిషం), డ్రేపర్ జాకబ్ (44వ నిమిషం) గోల్స్ నమోదు చేశారు. గ్రూప్ 'డి'లో ఇంగ్లండ్‌తో సమానంగా 7 పాయింట్లతో నిలిచినా...ఆడిన 2 మ్యాచ్‌లలో కలిపి మెరుగైన గోల్స్ ప్రదర్శన ఆధారంగా (ఇంగ్లండ్ 9, భారత్ 6) మన జట్టు రెండో స్థానంలో నిలిచింది. ఆదివారం జరిగే 'క్రాస్ ఓవర్' మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో తలపడే భారత్ ఆ మ్యాచ్‌లో గెలిస్తే క్వార్టర్స్ చేరుకుంటుంది. బలమైన ప్రత్యర్థి కాకపోయినా వేల్స్ ఒక దశలో భారత్‌ను బెంబేలెత్తించింది. మన టీమ్ కూడా అంది వచ్చిన అవకాశాలను గోల్స్‌గా మలచడంలో విఫలమైంది. 7 పెనాల్టీ కార్నర్లతో పాటు ఆరు సార్లు గోల్ చేసే అవకాశం వచ్చినా మనవాళ్లు వాటిని సద్వినియోగం చేసుకోలేకపోయారు. తొలి క్వార్టర్‌లో గోల్స్ నమోదు కాకపోగా, రెండో క్వార్టర్‌లో ఒక గోల్‌తో భారత్ ముందంజ వేసింది. మూడో క్వార్టర్‌లో రెండు నిమిషాల వ్యవధిలో పెనాల్టీ కార్నర్లను గోల్స్‌గా మలచి వేల్స్ స్కోరు సమం చేసింది. రెండో క్వార్టర్ తొలి నిమిషంలోనే భారత్‌కు పెనాల్టీ లభించగా, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ దానిని ఉపయోగించుకోలేకపోయాడు. అనంతరం హర్మన్‌ప్రీత్ డ్రాగ్ ఫ్లిక్ డిఫెండర్ స్టిక్‌కు తగిలి రీబౌండ్ అయి రాగా, ఈ సారి షంషేర్ దానిని గోల్ పోస్ట్‌లోకి పంపించగలిగాడు. అమిత్ రోహిదాస్ కూడా సరైన సమయంలో స్పందించడంలో విఫలమయ్యాడు. మూడో క్వార్టర్ 11వ నిమిషంలో లభించిన పెనాల్టీని అతను కూడా విఫలం చేశాడు. చివర్లో కాస్త దూకుడు పెంచిన భారత్ ప్రత్యర్థికి అవకాశం ఇవ్వకుండా ఊపిరి పీల్చుకుంది. 'ఈ విజయంతో మేం సంతృప్తిగా లేము. ఇది మా అత్యుత్తమ ప్రదర్శన కాదు. మరింత బాగా ఆడాల్సింది' అని మ్యాచ్ అనంతరం కెప్టెన్ హర్మన్‌ప్రీత్ వ్యాఖ్యానించాడు.

ఇతర మ్యాచ్‌లలో నెదర్లాండ్స్ 14–0తో చిలీని చిత్తుగా ఓడించగా... మలేసియా 3–2తో న్యూజిలాండ్‌పై, ఇంగ్లండ్ 4–0తో స్పెయిన్‌పై విజయం సాధించాయి.

'సాయ్' స్పందన సరిగా లేదు

పోలీస్ కేసు నమోదు చేయిస్తాం • కొనసాగిన రెజ్లర్ల నిరసన

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ సింగ్ మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధిస్తున్నాడంటూ తాము చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నామని భారత టాప్ రెజ్లర్లంతా పునరుద్ఘాటించారు. బ్రిజ్‌భూషణ్‌ను తప్పించి ఆటను కాపాడాలంటూ బుధవారం అనూహ్యంగా నిరసనకు దిగిన రెజ్లర్లు రెండో రోజూ దానిని కొనసాగించారు. బజ్‌రంగ్ పూనియా, వినేశ్ ఫొగాట్, సాక్షి మలిక్ తదితరులు ఇప్పటికే నిరసనలో పాల్గొంటుండగా గురువారం ఒలింపిక్ రజత పతక విజేత రవి దహియా, అన్షు మలిక్ కూడా వారికి సంఘీభావం ప్రకటించారు. రెజ్లర్ల ఆరోపణలకు స్పందిస్తూ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) అధికారులు వారితో చర్చించేందుకు సిద్ధమయ్యారు. సుమారు గంట పాటు వారితో రెజ్లర్ల భేటీ సాగింది. అయితే దీనిపై ఆటగాళ్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. తమకు అండగా నిలుస్తామని అధికారులు చెబుతున్నా...వారి స్పందన సంతృప్తికరంగా లేదని, చర్యల విషయంలో ఎలాంటి హామీ ఇవ్వలేదని రెజ్లర్లు చెప్పారు. 'లైంగిక వేధింపులకు గురైన మరికొందరు బాధితులు ఇవాళ మాతో చేరారు. వారి పేర్లు ప్రస్తుతానికి బహిరంగపర్చదల్చుకోలేదు. ఏదైనా పరిష్కారం వస్తుందని భావించాం. కానీ ప్రభుత్వ స్పందన చూస్తే అలా అనిపించడం లేదు. ఇక మేం చట్టపరంగా, న్యాయపరంగా తేల్చుకుంటాం. బ్రిజ్‌భూషణ్ రాజీనామా మాత్రమే కాదు... ఆయనపై కేసు నమోదు చేయించి జైలుకు కూడా పంపిస్తాం. మేమంతా ఒలింపిక్ విజేతలం, ప్రపంచ విజేతలం. అన్నీ నిజాలే చెబుతున్నాం. తగిన ఆధారాలూ ఉన్నాయి. మా ఆరోపణలపై సందేహాలు వద్దు' అని వినేశ్ స్పష్టం చేసింది. బీజేపీకి చెందిన మరో అగ్రశ్రేణి రెజ్లర్ బబితా ఫొగాట్ కూడా ప్రభుత్వం తరఫున చర్చలకు ముందుకు వచ్చింది.



వినేశ్, బజరంగ్

కేంద్ర మంత్రిని కలిసిన రెజ్లర్లు

భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై తీవ్ర ఆరోపణలతో నిరసన తెలుపుతున్న రెజ్లర్లు గురువారం రాత్రి మరో కీలక అడుగు వేశారు. కేంద్ర క్రీడా శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్‌ను కలిసి తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. మంత్రి, రెజ్లర్ల మధ్య గంటకు పైగా చర్చలు కొనసాగాయి. చర్చల తుది ఫలితంపై స్పష్టత లేకున్నా... బ్రిజ్‌భూషణ్ రాజీనామాకే ఠాకూర్ కూడా మద్దతు పలికినట్లు తెలిసింది. 24 గంటల్లోగా ఆయన తన రాజీనామాను ప్రకటించాలని, లేదంటే తామే ఆయనను తొలగిస్తామని కూడా స్పష్టం చేసినట్లు రెజ్లింగ్ వర్గాల సమాచారం.

రూడ్, జబర్‌లకు షాక్!

- రెండో రౌండ్‌లోనే ఓడిన రెండో సీడ్‌లు
- మూడో రౌండ్లోకి జొకోవిచ్
- ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

మెల్‌బోర్న్: ఈ సీజన్ ఆరంభ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సంచలనాల పరంపర కొనసాగుతోంది. సీడెడ్ స్టార్లు రెండో రౌండే దాటలేకపోతున్నారు. నాలుగో రోజు పోటీల్లో రెండో సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే), 12వ సీడ్, ఒలింపిక్ చాంపియన్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) ఇంటిదారి పట్టారు. నాదల్ ఇది వరకే అవుటైన ఈ టోర్నీలో హాట్ ఫేవరెట్‌గా మారిన సెర్బియన్ దిగ్గజం నొవాక్ జొకోవిచ్ మూడో రౌండ్లోకి ప్రవేశించాడు. మహిళల సింగిల్స్‌లో నిరుటి వింబుల్డన్, యూఎస్ ఓపెన్ రన్నరప్, రెండో సీడ్ అన్స్ జబర్ (ట్యూనిషియా), తొమ్మిదో సీడ్ వెరోనికా కుడెర్మెతొవ (రష్యా), 16వ సీడ్ అనెట్ కొంటావిట్ (ఈస్టోనియా)లు కంగు తిన్నారు. ఈ విభాగంలో నాలుగో సీడ్ కరొలిన్ గార్సియా (ఫ్రాన్స్), ఐదో సీడ్ అరినా సబలెంక (బెలారస్), 12వ సీడ్ బెలిండా బెన్సిక్ (స్విట్జర్లాండ్) ముందంజ వేశారు.



వొండ్రొసొవా

బ్రూక్స్‌బి 'హీరో'చితం

పురుషుల సింగిల్స్‌లో గురువారం జరిగిన రెండో రౌండ్లో 22 ఏళ్ల యువ అమెరికన్ జెన్సన్ బ్రూక్స్‌బి సంచలన ప్రదర్శనతో రూడ్‌ను కంగుతినిపించాడు. దీంతో గతేడాది ఫ్రెంచ్, యూఎస్ ఓపెన్‌లలో రన్నరప్‌గా నిలిచిన రూడ్ ఈ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్‌లో అనూహ్యంగా రెండో రౌండ్లోనే ఇంటిదారి పట్టాడు. 3 గంటల 55 నిమిషాల సమరంలో బ్రూక్స్‌బి 6–3, 7–5, 6–7 (4/7), 6–2తో రూడ్‌ను ఓడించాడు. 8వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా) అయితే వైల్డ్‌కార్డ్ ప్లేయర్ అలెక్సీ పాపిరిన్ (ఆస్ట్రేలియా) చేతిలో చేతులెత్తేశాడు. ఫ్రిట్జ్ 7–6 (7/4), 6–7 (2/7), 4–6, 7–6 (8/6), 2–6తో 23 ఏళ్ల అలెక్సీ పోరాటానికి తలవంచాడు. నాలుగో సీడ్ జొకోవిచ్ (సెర్బియా) 6–1, 6–7 (5/7), 6–2, 6–0తో క్వాలిఫయర్ ఎంజో కౌకాడ్ (మారిషస్)పై గెలుపొందగా, జ్వెరెవ్‌కు 7–6 (7/1), 4–6, 3–6, 2–6తో మైకేల్ మో (అమెరికా) చేతిలో చుక్కెదురైంది. ఐదో సీడ్ రుబ్లెవ్ (రష్యా) 6–2, 6–4, 6–7 (2/7), 6–3తో ఎమిల్ రుసువురి (ఫిన్లాండ్)పై నెగ్గాడు.

మూడో రౌండ్లో గార్సియా, సబలెంక

మహిళల సింగిల్స్ రెండో రౌండ్లో నాలుగో సీడ్ గార్సియా (ఫ్రాన్స్) 7–6 (7/5), 7–5తో లేలా ఫెర్నాండెజ్ (కెనడా)పై, ఐదో సీడ్ సబలెంక (బెలారస్) 6–3, 6–1తో షెల్బీ రోజర్స్ (అమెరికా)పై వరుస సెట్లలో విజయం సాధించారు. అయితే గతేడాది సూపర్ ఫామ్‌లో ఉన్న రెండో సీడ్ జబర్ (ట్యూనిషియా) 1–6, 7–5, 1–6తో మర్కెటా వొండ్రొసొవా (చెక్ రిపబ్లిక్) చేతిలో పరాజయం పాలైంది. 9వ సీడ్ కుడెర్మెతొవ (రష్యా) 4–6, 6–2, 2–6తో అమెరికాకు చెందిన క్వాలిఫయర్ కేటీ వొలినెట్స్ చేతిలో ఇంటిదారి పట్టింది. 12వ సీడ్ బెన్సిచ్ 7–6 (7/3), 6–3తో క్లెయిర్ లియూ (అమెరికా)పై గెలుపొందగా, 16వ సీడ్ కొంటావిట్ (ఈస్టోనియా) 6–3, 3–6, 4–6తో మగ్ద లినెట్ (పోలాండ్) చేతిలో కంగుతింది. 30వ సీడ్ కరోలినా ప్లిస్కొవా (చెక్ రిపబ్లిక్) 6–0, 7–5తో పుతినెత్సవ (రష్యా)పై గెలిచింది.

భారత్ పోరాటం ముగిసె...

- లక్ష్యసేన్, సైనా ఓటమి
- ఇండియా ఓపెన్



లక్ష్యసేన్

న్యూఢిల్లీ: సొంతగడ్డపై జరుగుతున్న ఇండియా ఓపెన్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత ఆటగాళ్ల పోరాటం ప్రిక్వార్టర్స్‌లోనే ముగిసింది. పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ లక్ష్యసేన్, మహిళల సింగిల్స్‌లో వెటరన్ స్టార్ సైనా నెహ్వాల్ పరాజయం పాలయ్యారు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ గాయంతో వైదొలగగా... కృష్ణ ప్రసాద్-విష్ణువర్ధన్ గౌడ్ జోడీ ఓడిపోయింది. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి–ట్రీసా జాలీ జంట కూడా నిరాశపరిచింది. గురువారం జరిగిన పోటీల్లో ప్రపంచ 12వ ర్యాంకర్, ఏడో సీడ్ లక్ష్యసేన్ 21–16, 15–21, 18–21తో ప్రపంచ 20వ ర్యాంకర్ రస్మస్ గెమ్కె (డెన్మార్క్) చేతిలో కంగుతిన్నాడు. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో సైనా 9–21, 12–21తో ఒలింపిక్ చాంపియన్ చెన్ యు ఫె (చైనా) ధాటికి నిలువలేకపోయింది. మహిళల డబుల్స్ ప్రి క్వార్టర్ ఫైనల్లో గాయత్రి–ట్రీసా జాలీ జంట 9–21, 16–21తో ఆరో సీడ్ జాంగ్ షు జియాన్–జెంగ్ యు (చైనా) ద్వయం చేతిలో ఓడింది. పురుషుల డబుల్స్‌లో గరగ కృష్ణప్రసాద్–విష్ణువర్ధన్ గౌడ్ జోడీ 14–21, 10–21తో లియాంగ్ వి కెంగ్– వాంగ్ చాంగ్ (చైనా) ద్వయం చేతిలో ఇంటిదారి పట్టింది. సాత్విక్ సాయిరాజ్ తుంటిగాయం వల్ల చిరాగ్ షెట్టితో కలిసి బరిలోకి దిగలేకపోయాడు. దీంతో చైనాకే చెందిన లియు చెన్–జువాన్ యి జంట వాకోవర్‌తో ముందంజ వేసింది.

హైదరాబాద్ ఓటమి నం. 5

పుణే: రంజీ ట్రోఫీలో హైదరాబాద్ జట్టు పరాజయాల పరంపర కొనసాగింది. ఈ సీజన్‌లో అత్యంత పేలవ ప్రదర్శన కనబర్చిన జట్టు వరుసగా ఐదో మ్యాచ్‌లోనూ ఓటమిపాలైంది. గురువారం మూడో రోజే ముగిసిన గ్రూప్ 'బి' మ్యాచ్‌లో మహారాష్ట్ర 9 వికెట్ల తేడాతో హైదరాబాద్‌ను చిత్తు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 176/5తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ 192 పరుగులకే ఆలౌటైంది. మహారాష్ట్రకు 193 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. దాంతో ఆ జట్టు హైదరాబాద్‌ను 'ఫాలో ఆన్' ఆడించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లోనూ బ్యాటింగ్ వైఫల్యంతో హైదరాబాద్ 219 పరుగులకే కుప్పకూలింది. చందన్ సహాని (59) అర్ధ సెంచరీ సాధించగా...తన్మయ్ అగర్వాల్ (43), రోహిత్ రాయుడు (37) కొన్ని పరుగులు జోడించారు. 27 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన మహారాష్ట్ర 17 బంతుల్లో వికెట్ నష్టానికి 30 పరుగులు చేసి మ్యాచ్‌ను ముగించింది.



రామయ్యకు విశ్వరూప సేవ

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం రాత్రి వైభవంగా విశ్వరూప సేవ నిర్వహించారు. ముక్కోటి అనంతరం వచ్చే బహుళ ద్వాదశి రోజున ఈ వేడుక నిర్వహించడం ఆనవాయితీ. సంవత్సర కాలంలో ఆలయంలో జరిగే పూజా కార్యక్రమాల్లో ఏమైనా దోషాలు దొర్లితే.. ప్రాయశ్చిత్తం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని. ఇది ఒక్క భద్రాద్రి ఆలయంలోనే జరుగుతుందని అర్చకులు తెలిపారు. శ్రీ సీతారామలక్ష్మణ స్వామి వార్లను, ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాల్లో ఉండే ఉత్సవమూర్తులను ఒకే చోటకు చేర్చి ఏకకాలంలో ప్రత్యేక పూజలు చేశారు. ముక్కోటి ఏకాదశి రోజున స్వామి వారిని దర్శించుకోలేని వారు.. ముక్కోటి దేవతలు కొలువై ఉన్న విశ్వరూపసేవ రోజున దర్శించుకున్నా అంతే పుణ్యఫలం దక్కుతుందని భక్తుల విశ్వాసం. – భద్రాచలం



రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ, రాధికా మర్చంట్‌ల వివాహ నిశ్చితార్థం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కాబోయే వధూవరులతో ఫొటో దిగిన ముకేశ్ అంబానీ, నీతా అంబానీ, ఇతర కుటుంబ సభ్యులు.

అదనమా.. అద్దె కోసమా?

- స్టీలు సామాన్లు, బిందెల కోసం పాత సామాన్లనో, బట్టలనో ఇవ్వడం మనకు తెలిసిందే.. మనమూ ఎప్పుడో ఒకప్పుడు చేసే ఉంటాం..
- అయితే.. అలాంటి పనిని ఒక ప్రపంచ కుబేరుడు చేస్తేనో..
- కుర్చీలు, బల్లలు, కంప్యూటర్లు మాత్రమే కాదు.. చివరికి కేఎన్ 95 మాస్కుల డబ్బాలతో సహా అమ్మకానికి పెట్టేస్తేనో..
- వినడానికి కొంచెం చిత్రంగా ఉంది కదా.. మరింకేం.. ఆ వివరాలేమిటో తెలుసుకుందాం.. పదండి..

పాత సామాన్లు అమ్ముకున్న ప్రపంచ కుబేరుడు



స్పేస్ ఎక్స్ సీఈవో, ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్ ట్విట్టర్‌ను కొన్నప్పటి నుంచీ ఆ కంపెనీని దారిలో పెట్టడానికంటూ.. బ్లూటిక్‌కు డబ్బుల వసూలు నుంచి ఉద్యోగులను తొలగించడం దాకా చాలా చేశారు. ఇప్పుడు శాన్‌ఫ్రాన్సిస్కోలోని ప్రధాన కార్యాలయంలో ఉన్న అదనపు సామగ్రిని వదిలించుకునే పేరిట వాటినీ అమ్మకానికి పెట్టారు. ఇందుకోసం కార్పొరేట్ అసెట్ డిస్పోజల్ సంస్థ 'హెరిటేజ్ గ్లోబల్ పార్ట్‌నర్స్'కు బాధ్యత అప్పజెప్పారు. ఆ సంస్థ మొత్తం 631 సామాన్లకు సంబంధించి 27 గంటల ఆన్‌లైన్ సేల్ పెట్టింది. బిడ్డింగ్ విధానం ద్వారా వేలానికి ఏర్పాట్లు చేసింది. ఇందులో నాలుగడుగుల ట్విట్టర్ పిట్ట లోగో ప్రతిమతోపాటు 10 అడుగుల ఎత్తున్న ట్విట్టర్ నియాన్ లైట్, ఎస్ప్రెసో మెషీన్లు, టీవీలు, ఓవెన్లు, టేబుళ్లు, స్పీకర్లు, కిచెన్ సామాన్లు వంటివీ ఉన్నాయి. ఆఫీసులో ఉన్న అదనపు సామగ్రిని వదిలించుకోవడం కోసమే ఇదంతా అని పైకి చెబుతున్నప్పటికీ.. శాన్‌ఫ్రాన్సిస్కో కార్యాలయానికి సంబంధించిన అద్దెను మస్క్ ఇంకా కట్టలేదట. దీనిపై సంబంధిత యజమాని కేసు కూడా వేశారట. పైగా గతేడాది కాలంలో 500 మంది అడ్వటైజర్లు తమ ప్రకటనలు ఇవ్వడాన్ని నిలిపేయడంతో.. ట్విట్టర్ ఆదాయం 40 శాతం మేర తగ్గిపోయిందట. ఇలాంటి పరిస్థితుల మధ్య ఈ 'పాత సామాన్ల అమ్మకం'వార్తలు కలకలం రేపాయి. అయితే, ఈ వాదనను హెరిటేజ్ గ్లోబల్ పార్ట్‌నర్స్ ప్రతినిధి ఖండించారు. సామగ్రి అమ్మకానికి, ట్విట్టర్ ఆర్థిక పరిస్థితికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఇవన్నీ పక్కనబెడితే.. ఈ 27 గంటల సేల్‌లో అత్యధికంగా నాలుగడుగుల ట్విట్టర్ పిట్ట లోగో ప్రతిమకు రూ. 81.45 లక్షలు, పదడుగుల నియాన్ ట్విట్టర్ లోగో లైట్‌కు రూ. 32.5 లక్షలు వచ్చాయి.

–సాక్షి సెంట్రల్ డెస్క్

ఆర్థికపరమైన సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం: సీఎస్

సాక్షి, హైదరాబాద్: ఆర్థికపరమైన సైబర్ నేరాల నియంత్రణ కోసం పోలీస్ అధికారులు, రిజర్వ్ బ్యాంక్ అధికారులు సమన్వయంతో కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి సూచించారు. గురువారం బీఆర్‌కేఆర్ భవన్‌లో ఆర్థికపరమైన సైబర్ నేరాల నియంత్రణపై ఏర్పాటైన రాష్ట్రస్థాయి సమన్వయ సమావేశం(ఎస్ఎల్‌సీసీ) సీఎస్ అధ్యక్షతన జరిగింది. నాన్ బ్యాంకింగ్ ఆర్థిక కార్యకలాపాలు, మోసాలు, రియల్ ఎస్టేట్, చిట్‌ఫండ్, డిపాజిట్ల సేకరణ తదితర అంశాలపై ప్రజల నుంచి అందిన ఫిర్యాదులు, వాటిపై కోర్టుల్లో నమోదైన కేసులపై సమీక్షించారు. నాన్ బ్యాంకింగ్ తరహా లోన్‌యాప్‌ల ద్వారా మోసాలు పెరుగుతున్నందున, వీటిపట్ల ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరముందన్నారు.

శభాష్ ఆఫీసర్స్!

బందోబస్తు విజయవంతంపై అధికారులను అభినందించిన డీజీపీ

సాక్షి, హైదరాబాద్: పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఇతర వీఐపీల రాష్ట్ర పర్యటన విజయవంతం అయ్యేలా తగిన బందోబస్తు ఏర్పాట్లు చేసిన పోలీస్ ఉన్నతాధికారులను డీజీపీ అంజనీకుమార్ అభినందించారు. ఈనెల 18న యాదాద్రి పర్యటనకు తగిన బందోబస్తు ఏర్పాట్లు చేశారంటూ రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ సహా పలువురికి గురువారం ప్రశంసాపత్రాలు పంపారు. డీజీపీ నుంచి ప్రశంసపత్రాలు అందుకున్న వారిలో డీఐజీలు రంగనాథ్, రమేశ్‌నాయుడు, మల్టీజోన్ –1 ఐజీ ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, మల్టీజోన్ –2 ఐజీ షానవాజ్ ఖాసీంసహా మొత్తం ఎస్పీ ఆపై ర్యాంకు అధికారులు 27 మంది ఉన్నారు.

డాక్టర్ అల్లూరికి రామస్వామి అవార్డు

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ (ఐఐఐఈ) 64వ జాతీయ సదస్సులో ఐఐఐఈ హైదరాబాద్ చాప్టర్ సభ్యులిద్దరికి ప్రతిష్టాత్మక పురస్కారాలు దక్కాయి. మహారాష్ట్రలోని పుణెలో ఇటీవల రెండు రోజుల పాటు జరిగిన జాతీయ సదస్సులో హెచ్ఈఎస్ ఇన్‌ఫ్రా వైస్ ప్రెసిడెంట్, హైదరాబాద్ చాప్టర్ సీనియర్ సభ్యుడు డాక్టర్ అల్లూరి వి.వి.ప్రసాద రాజును ప్రతిష్టాత్మక రామస్వామి అవార్డుకు, సింగరేణి కాలరీస్ అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ నిమ్మ భాస్కర్‌ను ఫెలోషిప్‌నకు ఎంపిక చేశారు. ఫోర్బ్స్ మార్షల్ లిమిటెడ్ చైర్మన్ నౌషద్ ఫోర్బ్స్ చేతుల మీదుగా వారికి ఈ అవార్డులు అందజేశారు. సదస్సులో అన్ని రాష్ట్రాలకు చెందిన ఐఐఐఈ చాప్టర్ల ప్రతినిధులు, దేశంలోని ప్రముఖ కంపెనీల్లో పనిచేస్తున్న ఇండస్ట్రియల్ ఇంజనీర్లు 300 మందికి పైగా హాజరయ్యారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.